
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 04.06.2025 | సంపుటి :11 సంచిక :316 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## జీ7కు భారత్‌కు నో ఇన్విటేషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది.కెనడాలో జరగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే

మిగతా 2లో..

### ఆరేళ్లలో ఇదే మొదటిసారి

ఇది దౌత్యపరంగా మరో భంగపాటని మండిపడ్డ కాంగ్రెస్ పార్టీ

భారత్-పాక్‌ల మధ్య అమెరికా జోక్యం తరువాత ఇది మరో అవమానమని వెల్లడి

## పాక్ దుశ్చర్యలు ఆధునిక ప్రపంచంలో ఆమోదయోగ్యం కాదు

- ఆ దేశ ఆర్మీ చీఫ్ భారత్‌పై విషం చిమ్మారు
- ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతిస్తోంది
- భారత్‌లో రక్తపాతం సృష్టించడమే వారి విధానం:సీడీఎస్ అనిల్ చౌహాన్
- యుద్ధసమయాల్లో నష్టాలు కాదు.. తుది ఫలితమేంటన్నదే ముఖ్యమని వెల్లడి




న్యూఢిల్లీ(జనంసాక్షి):పహల్గాం ఘటనకు ముందు భారత్, హిందువులపై పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిం మునీర్ విషం చిమ్మారని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని, ఇక్కడ రక్తపాతం సృష్టించడమే వారి విధానమని మండిపడ్డారు. 'భవిష్యత్తు యుద్ధాలు, యుద్ధక్షేత్రాలు'పై పుణెలోని సావిత్రిబాయి ఫులే యూనివర్సిటీలో ప్రసంగించిన సీడీఎస్ జనరల్ చౌహాన్.. అంతర్జాతీయంగా సంఘర్షణల స్వభావం, పెరుగుతున్న సాంకేతిక ముప్పు, భారత్ సుదీర్ఘ కాలంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ.. నష్టాలు ముఖ్యం కాదని, తుది ఫలితం ఏంటన్నదే ముఖ్యమన్నారు. "ఇరు దేశాలు వివిధ రకాల సైనిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకున్నాయి. యుద్ధక్షేత్రంలో మాత్రం వాటిని పరీక్షించలేదు. రిస్క్ తీసుకోకుంటే.. విజయం సాధించలేరు. మనవద్ద అత్యుత్తమమైన యాంటీ డ్రోన్‌సిస్టమ్ ఉందని మనకు తెలుసు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఓవైపు పోరాటం, మరోవైపు రాజకీయ పరిణామాలు ఒకేసారి చోటుచేసుకున్నాయి. ఇక నష్టాల గురించి నన్ను అడిగితే.. అవి ముఖ్యం కాదు. ఎలా స్పందించాం.. ఫలితం ఏంటన్నదే ముఖ్యం. నష్టాలు, ఎదురుదెబ్బలు అనేవి సైన్యంపై ప్రభావం చూపవు. యుద్ధంలో.. ఎదురుదెబ్బలు ఎదురైనా మనోబలం ఎంతో ముఖ్యం" అని జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు."పహల్గాం ఘటన అత్యంత క్రూరమైనది.

మిగతా 2లో..





## మాన్‌సూన్ ఎమర్జెన్సీపై సంసిద్ధంగా ఉండండి

2లో

- వాతావరణ సూచనల మేరకు చర్యలు తీసుకోవాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అత్యవసరబృందాలు 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- వర్షాకాలంపై అధికారులతో సమీక్ష

### 18 ఏళ్ల నిరీక్షణకు తెర..



## 2025 ఐపీఎల్ ఛాంపియన్‌గా ఆర్సీబీ

ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై అద్భుత విజయం

6 పరుగుల తేడాతో గెలుపు

11లో

18 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది...ఐపీఎల్ 2025 సీజన్ ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌పై ఆరు పరుగుల తేడాతో విజయం సాధించి తొలిసారి కప్‌ను చేజిక్కించుకుంది. చివరి మ్యాచ్‌లో కోహ్లీ రాణించాడు.చివరి ఓవర్లల్లో పంజాబ్ విజయానికి 29 పరుగులు అవసరం కాగా సమిష్టిగా రాణించి ఆ జట్టును బెంగుళూరు 24 పరుగులకే కట్టడిచేసి 6 పరుగులతో విజయం సాధించి ఆర్సీబీ తన చిరకాల స్వప్నం నెరవేర్చుకుంది.

## ట్రంప్ ఆదేశాలతో కాల్పుల విరమణ


ఆయన బెదిరింపులకు ప్రధాని మోదీ లొంగిపోయారు

- నరేందర్.. సరెండర్ అనగానే భయపడ్డారు
- పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ప్రకటించారు
- సరెండర్ కావడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు అలవాటే..
- ఆపరేషన్ సిందూర్‌పై రాహుల్ సంచలన వ్యాఖ్యలు



2లో

### పాక్ గూఢచారి గగన్‌దీప్‌సింగ్ అరెస్టు



ఆర్మీ సమాచారం దయాదికి లీక్.. అదుపులోకి తీసుకున్న పంజాబ్ పోలీసులు

ఛండీగఢ్(జనంసాక్షి):పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్న పాక్ గూఢచారిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు.తార్న్ తరణ్ జిల్లాకు చెందిన గగన్‌దీప్ సింగ్ అనే వ్యక్తికి పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్‌ఐతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ దళాల మోహరింపులు, వ్యూహాత్మక ప్రదేశాల వివరాలతో సహా సున్నితమైన సమాచారాన్ని అతడు ఐఎస్‌ఐకి చేరవేసినట్లుగా

మిగతా 2లో..

## 'బనకచర్ల'ను ఒప్పుకునే ప్రసక్తేలేదు



ఆ ప్రాజెక్ట్ మాకు సమ్మతంకాదు: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

దీని ప్రతిపాదనలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాం

తెలంగాణ ప్రయోజనాలకు ఇది వ్యతిరేకమని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందులోభాగంగా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు ఇది భంగం కలిగిస్తుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకు వెళ్లి.. మాట్లాడామన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయన్ని కోరామని చెప్పారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన

మిగతా 2లో..




### భూముల రక్షణకే.. భూభారతి



- వారికి దగా చేసిన ధరణి పోర్టల్ అత్యంత పారదర్శకంగా భూభారతి
- కొత్త చట్టాలపై అవగాహన సదస్సులో డిప్యూటీసీఎం భట్టి, మంత్రి పొంగులేటి

ఖమ్మం(జనంసాక్షి): రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ రైతులకు మేలు చేసేలా చట్టాలు రూపొందించిందని, గత బిఆర్ఎస్ మాత్రం రైతులను దగ చేసే చట్టాలను తెచ్చిందన్నారు. అందుకు ధరణి పోర్టలే నిదర్శనమన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం జూన్ 2 రోజున

మిగతా 2లో..

### భూములకు త్వరలో భూధార్

నంబర్ కొట్టగానే అన్నివివరాల వెల్లడి

సర్వేయర్లను నియమించి భూముల సర్వే

గత పదేళ్లపాటు రైతులు ఎన్నో ఇబ్బందులుపడ్డారు:మంత్రి తుమ్మల

2లో



### 'మహా' నిర్ణయం

మహారాష్ట్రలో ఇకపై 1వ తరగతి నుంచే బేసిక్ మిలిటరీ శిక్షణ

ముంబై(జనంసాక్షి):మహారాష్ట్రలో ఇకపై 1వ తరగతి నుంచే విద్యార్థులకు బేసిక్ మిలిటరీ శిక్షణ నివ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, క్రమ శిక్షణ, శారీరక వ్యాయామం వంటి సద్గుణాలు పెంపొందించడానికి బేసిక్ మిలిటరీ శిక్షణ ఇస్తామని మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే పేర్కొన్నారు.దీనిద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎలా

మిగతా 9లో..

## అన్నార్తులపై ఆగని దాడులు

గాజాలో ఆహార కేంద్రాలపై మళ్లీ ఇజ్రాయెల్ బాంబుల వర్షం • మరో 27 మంది మృతి

గాజా(జనంసాక్షి):గాజాపై ఇజ్రాయెల్ ఏ మాత్రం కనికరం చూపడం లేదు. మానవతా సహాయక కేంద్రం వద్ద ఐడీఎఫ్ దళాలు మరోసారి దాడులు నిర్వహించాయి.ఈ దాడుల్లో మరో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్ది ప్రజలు తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.గాజా దక్షిణ ప్రాంతంలోని సహాయ కేంద్రం వద్ద మానవతా సహాయ పంపిణీ కార్యక్రమం జరుగుతోంది.

మిగతా 2లో..




### త్వరలో 'నేతన్నకు భరోసా' అందిస్తాం

రూ. 48 కోట్లు కేటాయింపు

కార్మికులకు రూ. 18వేలు,అనుబంధ కార్మికులకు రూ. 6వేలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి):నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్ రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు మరియు అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18, 000 , అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత

మిగతా 2లో..

## అమెరికాలో భారతీయులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుంది

- అవసరమైన పక్షంలో న్యాయసహాయం కూడా అందిస్తాం
- అమెరికా చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందే
- మంచి మార్పు దిశగా విద్యార్థులు కృషి చేయాలి
- డాలస్ పర్యటనలో విద్యార్థులతో కెటిఆర్



న్యూఢిల్లీ(జనంసాక్షి):

పార్లమెంట్, శాసనసభలు చేసే ఏ చట్టాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. 2012లో దాఖలైన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ నందిని సుందర్ పిటిషన్‌ను విచారిస్తూ ఈ మేరకు తీర్పునిచ్చింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ప్రతి రాష్ట్ర శాసనసభకు ఒక చట్టాన్ని ఆమోదించే పూర్తి అధికారులు ఉంటాయి. ఆ చట్టం

మిగతా 2లో..

### పార్లమెంట్, అసెంబ్లీ చట్టం చేస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించలేం: సుప్రీం

2లో

### మిస్ వరల్డ్ పోటీలపై విపక్షాలది విషప్రచారం

రూ. 200 కోట్లు ఖర్చు చేశారంటూ హరీశ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

కంటెస్టెంట్‌లకు 30 తులాలు కాదు.. 3 గ్రాముల బంగారం కూడా ఇవ్వలేదు

సింహభాగం నిధులు స్పాన్సర్ల ద్వారానే సమకూర్చాం: మంత్రి జూపల్లి



హైదరాబాద్(జనంసాక్షి): మిస్ వరల్డ్ పోటీలకు చాలా దేశాలతో పోటీ పడి హైదరాబాద్ అవకాశం దక్కించుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీలతో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, హస్తకళల గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04.06.2025

## పాక్ దుశ్చర్యలు ఆధునిక ప్రపంచంలో ఆమోదయోగ్యం కాదు

కుటుంబీకుల కళ్ల ముందే అత్యంత దారుణానికి ఒడిగట్టారు. మతం పేరుతో చంపడం ఆధునిక ప్రపంచంలో ఆమోదయోగ్యం కాదు. ఈ ఘటన సమాజంలో ప్రకంపనలు సృష్టించింది. సుదీర్ఘకాలంగా భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రదాడులను ఈ ఘటన మళ్లీ గుర్తుచేసింది. పొరుగు దేశాలు ఒకటి, రెండు ఉగ్రదాడులు ఎదుర్కొంటే.. భారత్‌లో జరిగిన వందలాది ఉగ్రదాడుల్లో 20వేల మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు" అని సీడీఎస్ చౌహాన్ ఆవేదన వ్యక్తంచేశారు.

## అన్నార్తులపై ఆగని దాడులు

అదే సమయంలో కాల్పులు మోత మోగింది. ఈ ఘటనలో 27 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. గత మూడు రోజులుగా సహాయ కేంద్రాల వద్ద దాడులు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. రఫాలో గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్ మానవతా సహాయ పంపిణీ కేంద్రం సమీపంలో ఇటీవల ఈ దాడులు జరిగాయి. ఘటన సమయంలో వేలాది మంది పాలస్తీనియన్లు మానవతా సాయం తీసుకోవడం కోసం అక్కడ ఉన్నారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ దాడులు జరిపింది. ఎంతో మంది ప్రాణాలు కోల్పోగా.. వందకు పైగా మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆకలితో అలమటిస్తున్న పౌరులపై దాడులు చేయడాన్ని హమాస్ తీవ్రంగా ఖండించింది. రఫాలోని తమ ఆస్పత్రిలో ఇప్పటివరకు 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని.. 19 మంది అక్కడికి చేరుకునేలోపే మృతి చెందారని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. మరికొందరికి తక్షణ వైద్యం అవసరమని తెలిపారు. కాగా.. 2023 అక్టోబరు నుంచి ఇజ్రాయెల్‌- హమాస్‌ల మధ్య జరుగుతున్న పోరులో గాజాలో 54 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. ఇటీవల మానవతా సాయాన్ని పరిమితంగా అందించేందుకు ఇజ్రాయెల్ అనుమతిచ్చింది. ఈ క్రమంలోనే జరిగిన దాడుల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం.

## త్వరలో 'నేతన్నకు భరోసా' అందిస్తాం

అనుబంధ కార్మికులు లబ్ది పొందుతారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రామాణాలు మరియు నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రిగారు తెలియజేశారు. ఈ పథకం నేత మరియు అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుంది. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేసే కార్మికులు మరియు ఫ్రీలాన్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, -ట్రైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు. ఈ పథకం కింద జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత మరియు అనుబంధ కార్మికులకు నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మరియు అక్టోబర్ నుండి మార్చి నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేసిన వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లైతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత మరియు అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రి తెలిపారు.

## లద్దాఖ్‌లో స్థానికులకే పెద్దపీట

**85శాతం కొలువులు వారికే..**

**రిజర్వేషన్లు, స్థానికతపై కేంద్రం కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ:** కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో నివసిస్తున్న ప్రజల భాష, సంస్కృతి, రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానికత, రిజర్వేషన్ల అంశంపై అధికారిక ప్రకటన చేసింది. 85శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది. 15 ఏళ్లకు మించి ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు, కనీసం 7 ఏళ్లపాటు అక్కడ చదువుకుని 10 లేదా 12వ తరగతి పరీక్షలకు హాజరైనవారిని స్థానికులుగా గుర్తించాలని నిర్ణయించింది. అంతేకాకుండా లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకే కేటాయించనున్నారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్‌-370ని 2019లో రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌ను రెండు భాగాలుగా విభజించిన సంగతి తెలిసిందే. జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో తమ భాష, సంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం స్థానికంగా నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో స్థానికుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. లద్దాఖ్ ప్రజల స్థానికత నిర్ధరణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని జనవరి 2023లో ఏర్పాటైంది. వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆ బృందం వారి సమస్యలను తెలుసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేసింది. మరోవైపు ఇవే డిమాండ్లపై పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా అక్టోబర్ 2024లో ఢిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

# మాన్‌సూన్ ఎమర్జెన్సీపై సంసిద్ధంగా ఉండండి

హైదరాబాద్(జనంసాక్షి): వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వర్షాకాలం సన్నద్ధత తప్పై అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. మాన్‌సూన్ అత్యవసర బృందాలు 24 గంట లకు అందుబాటులో ఉండేలా చూడాలని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో నీళ్లు నిలిచే 141 ప్రాంతాల్లో నిర్మిస్తున్న వాటర్ హార్వెస్టిం గ్ వెల్స్ పనుల పురోగతిని సీఎం తెలుసుకు న్నారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమెటిక్ పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ సూచనల కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టా లని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. వర్షాలు, వరదల ప్రభావాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించేలా వ్యవస్థను ఏర్పాటు చేసు కోవా లని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాల సంరక్షణ, రోడ్ల విస్తరణ, అభివృద్ధి కోసం సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలపై విపక్షాలది విషప్రచారం

సమావేశంలో జూపల్లి మాట్లాడారు. భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. "భారాస చేసిన ప్రతి ఆరోపణపై బహిరంగ చర్చకు నేను సిద్ధం. మిస్ వరల్డ్ పోటీల ఖర్చుపై హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేశారు. రూ.31కోట్ల ఖర్చులో 21 కోట్లు స్పాన్సర్ల ద్వారానే వచ్చింది. మరో 12 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయి. రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలను ఆయన నిరూపిస్తారా? అని సవాల్ విసురుతున్నా. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది అబద్ధం. 30 తులాలు కాదు.. 3 గ్రాములు కూడా ఇవ్వలేదు" అని జూపల్లి అన్నారు.

## రైతుల భూముల రక్షణకే.. భూభారతి

భూ భారతి చట్టం అమల్లోకి వచ్చింది. భూ సమస్యలను లేకుండా చేసేందుకు రేవంత్ సర్కార్ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నేటి నుంచి ఈ నెల 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభు త్వం ఆదేశించింది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భూ భారతి చట్టం చరిత్రాత్మకం అని అన్నారు. భూ సంస్కరణలు తెచ్చింది మొదట కాంగ్రెస్ పార్టీనే

## పార్లమెంట్, అసెంబ్లీ చట్టం చేస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించలేం

**- సుప్రీంకోర్టు**

రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, న్యాయస్థానం చెప్పేంతవరకూ అది చట్టంగానే ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఇది రాజ్యాంగ విరుద్ధమని, కొట్టివేయాలని భావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. చట్టం చెల్లుబాటును, వివాదాలను పరిష్కరించే అధికారం రాజ్యాంగం ద్వారా న్యాయవ్యవస్థకు వచ్చింది" అని కోర్టు అభిప్రాయపడింది. సల్వా జుడుం, స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ వంటి సాయుధ పౌర సమూహాలను మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వినియోగించడంపై అప్పట్లో తీవ్రమైన ఆందోళనలు రేకెత్తాయి. ఛత్తీస్‌గఢ్ సర్కారు పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని, సల్వా జుడుం రద్దు చేయాలని, నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, నక్సలైట్లు చేసిన నేరాలపై దర్యాప్తు చేయాలని నందిని సుందర్?తో పాటు పలువురు 2007లో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసారు. జూలై 5, 2011న, సుప్రీంకోర్టు లను ఉపయోగించకుండా ఆదేశాలను ఇచ్చింది. అదే ఏడాది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2011లో ఛత్తీస్‌గఢ్ సహాయక సాయుధ పోలీసు దళ చట్టాన్ని సవరించింది. స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ సేవలను వినియోగిస్తోంది. దీంతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేసిన చట్టం కోర్టు మునుపటి ఆదేశాలను ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ 2012లో నందిని సుందర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తీర్పును వెల్లడించింది. 'పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ఏ చట్టాన్ని కూడా కోర్టు ధిక్కారంగా పరిగణించలేం. ఆ ప్రభుత్వం చేసిన చట్టం రాజ్యంగ సూత్రాలకు విరుద్ధమని నిర్ధారణ కాకపోతే అది కోర్టు దిక్కారం కాదు' అని ధర్మాసనం చెప్పింది.



## 3.జీ7కు భారత్‌కు నో ఇన్విటేషన్

అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా.. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది. దీంతో జీ7లో ప్రధాని మోదీ పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది. ఇదే అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నారని, వీరితోపాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకు ఆహ్వానం అందిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ వెల్లడించారు. 2014కు ముందుకు జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం వచ్చేదన్నారు. 2014 తర్వాత ఈ సంప్రదాయం కొనసాగినప్పటికీ.. ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనన్నారు. ఇదిలాఉంటే, జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణఅమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.

## ట్రంప్ ఆదేశాలతో కాల్పుల విరమణ

**భోపాల్(జనంసాక్షి):** ఆపరేషన్ సిందూర్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన భోపాల్‌లోని రవీంద్ర భవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ..ట్రంప్ బెదిరింపులకు ప్రధాని మోదీ లొంగిపోయారని.. నరేందర్.. సరెండర్ అనగానే భయపడ్డారు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ప్రకటించారంటూ మండిపడ్డారు. 1971 సంక్షోభ సమయంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నిర్ణయాత్మక వైఖరిని ప్రస్తావిస్తూ... ఇందిరాగాంధీ ఎవరికీ భయపడలేదన్నారు. యూఎస్ సెవెంత్ ఫ్లీట్ ముందుకు సాగినప్పుడు ఆమె నేను చేయవలసినది చేస్తానంటూ గట్టిగా చెప్పారంటూ రాహుల్ గుర్తు చేశారు. సరెండర్ కావడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు అలవాటే అంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వారికి లొంగిపోయే లేఖలు రాసే అలవాటు ఉందంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ లొంగిపోదు. గాంధీజీ, నెహ్రూజీ, సర్దార్ పటేల్.. వీరు లొంగిపోయే వ్యక్తులు కాదు, అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తులు " అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు.

## పాక్ గూఢచారి గగన్‌దీప్‌సింగ్ అరెస్టు

గుర్తించామని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. గగన్‌దీప్ సింగ్ గత ఐదేళ్లుగా ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ సింగ్ చావ్లాతో సంప్రదింపులు జరుపుతున్నాడని.. అతడి ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పీఐఓలు)తో పరిచయాలు చేసుకున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ చావ్లా, ఐఎస్ఐ సహకారంతో భారత్‌లో గూఢచర్య రాకెట్‌ను నడుపుతున్నాడని, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ ప్రణాళికలు తెలుసుకోవడానికి వీరిని ఉపయోగించుకున్నాడని పోలీసులు తెలిపారు. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌తోనూ అతడికి సంబంధాలు ఉన్నాయన్నారు. గగన్‌దీప్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని పరిశీలించగా.. దేశానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు, సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు లీక్ చేసిన ఆధారాలు లభించాయన్నారు. అంతేకాకుండా అతడికి 20మందికి పైగా ఐఎస్ఐ ఏజెంట్లతో పరిచయాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చర్యల వల్ల జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత దేశంలో ఉంటూ..పాక్‌కు గూఢచర్యం చేస్తున్న దేశద్రోహులను గుర్తించడానికి అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## నీట్-యూజీ పరీక్ష ప్రిలిమినరీ కీ విడుదల..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు మే 4న దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ (యూజీ) పరీక్ష ప్రిలిమినరీ కీ విడుదలైంది. ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లను అభ్యర్థుల ఈ-మెయిల్ ఐడీలకు పంపినట్లు ఎన్‌టీఏ అధికారులు మంగళవారం తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యర్థులు జూన్ 3నుంచి 5వ తేదీ వరకు అభ్యంతరాలు లేవనెత్తవచ్చని సూచించారు. అభ్యంతరాలు తెలిపేందుకు ఒక్కో ప్రశ్నకు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు లేవనెత్తిన అభ్యంతరాలను సబ్జెక్టు నిపుణుల ప్యానల్ సమీక్షించనుంది. గత నెల 4వ తేదీన జరిగిన నీట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా 20.8 లక్షలకు పైగా విద్యార్థులు హాజయ్యారు. 5,400కు పైగా కేంద్రాల్లో పటిష్ఠ భద్రత మధ్య ఈ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ నీట్ యూజీ పరీక్ష జరిగింది.



# 'బనకరచర్ల'ను ఒప్పుకునే ప్రసక్తేలేదు

అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఆ క్రమంలో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జల్‌శక్తి మంత్రికి లేఖలు రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో అవన్నీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి నదికి వరద పోటెత్తే క్రమంలో నీరు సముద్రం పాలవుతుంది. ఈ నేపథ్యంలో ఆ నీటిని ప్రజా ప్రయోజనాల కోసం మళ్లించాలని ఏపీలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భా గంగా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా ఆ వరద నీటిని రాయలసీమతోపాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మళ్లించాలని భావించింది. తద్వారా తాగు, సాగు నీటి అవసరాలు తీర్చవచ్చని చెప్పింది. ఆ క్రమంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై కేంద్రంతో ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు. అలాగే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను సైతం కేంద్రానికి లేఖ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో జూన్ 2వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శితోపాటు- ఆ శాఖ ఉన్నతాధి కారులతో ఏపీ జలవనరులు శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీ ప్రభుత్వ నీటి సలహదారు వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గురించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు సోదాహరణగా వివరించారు. ఈ సందర్బంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు ఏమైనా నష్టం జరిగే అవకాశముందా అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు.. ఏపీ అధికారులను ప్రశ్నించగా.. వాటికి సైతం రాష్ట్ర అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినట్లు- తెలుస్తుంది. ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం రూ. 81 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంపై ఇప్పటికే బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కె. కవిత అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను ఏపీ నిర్మిస్తుందని ఆమె ఇటీవల మీడియాలో మాట్లాడుతూ గుర్తు చేశారు. ఈ అంశంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

## చైనాతో కలిసి పనిచేయాలనుకుంటున్నాం

### ఆ దేశానికి యూనస్ విజ్ఞప్తి

**జనంసాక్షి:** చైనా అత్యధిక పెట్టుబడులు పెడితే తమ దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. చైనా- బంగ్లా వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన సదస్సును యూనస్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు బంగ్లాదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి చైనా వాణిజ్యమంత్రి వాంగ్ వెంటావో ప్రత్యేకఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యూనస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తయారీరంగంలో చైనా కంపెనీలు పేరుగాంచాయన్నారు. చైనాతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. తమ దేశంలో బీజింగ్ పెట్టుబడులు పెడితే దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందన్నారు. ఇక, దేశ ఆర్థికవృద్ధిని మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా తాము ఉన్నట్లు తెలిపారు. పెట్టుబడులు మెరుగుపరచడం,



చట్టాలను క్రమబద్ధీకరించడం, వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈసందర్భంగా బంగ్లాదేశ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని చైనా కంపెనీలకు సూచించిన ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌కు యూనస్ కృ తజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇటీవల యూనస్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొ న్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా భేటీ అయ్యారు. బంగ్లా ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి చైనా నుంచి పెట్టుబడులను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్ లో పాల్గొనడానికి చైనా కంపెనీలను బంగ్లాదేశ్ స్వాగతించింది. డ్రాగన్ ఇస్తున్న రుణాలకు వడ్డీలను తగ్గించాలని, ఆ దేశ నిధులు అందుతున్న ప్రాజెక్టులకు కమిట్‌మెంట్ ఫీజ్‌ను మాఫీ చేయాలని అన్నారు.

# భూములకు త్వరలో 'భూధార్'

**ఖమ్మం(జనంసాక్షి):** మనుషులకు ఆధార్ కార్డు లాగే భూములకు త్వరలో భూధార్ తీసుకువస్తాం అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తీసుకొచ్చామని అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం సదస్సుకు మంత్రులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల సదస్సులో మాట్లాడుతూ.. కంప్యూటర్ లో భూధార్ నంబర్ కొట్టగానే అన్నివివరాలు వస్తాయని, లైసెన్స్ డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని చెప్పారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని, రెవెన్యూ అధికారులు గ్రామాల్లోనే రైతుల సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. భూమి సమస్యలకు పరిష్కారాలు అభించక పదేళ్లపాటు రైతులు ఇబ్బంది పడ్డారని తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రైతుబంధు రూ. 7600 కోట్లు- చెల్లించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ ఇచ్చే స్థితిలో కూడా లేని పరిస్థితి నుంచి, ఇప్పుడు రైతులకు అన్ని వనరులు అందిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని, అధికారులను అక్కడికే వెళ్లొద్దని ఆదేశించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నష్టపోయిన రైతులకు నేరుగా పరిహారాలు అందించామని చెప్పారు. వ్యవసాయ యాంత్రికీకరణ, పంటల భీమా, డ్రిప్ ఇరిగేషన్ వంటి పథకాలకు రాష్ట్ర వాటా విడుదల చేయకుండా కేంద్రం 2,500 కోట్లు- ఆపేయడాన్ని విమర్శించారు. గతంలో రుణమాఫీ కూడా పూర్తిగా అమలు కాలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు విడతలుగా 2014లో ప్రకటించి 2018లో సగం మందికే చెల్లించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం రూ. 40,683 కోట్ల వ్యయం చేసి, మద్దతు ధరలు కల్పించిందన్నారు. సన్న రకాలకు ఎకరాకు రూ. 500 బోనస్ ప్రకటించి, పీడీఎస్ ద్వారా పంపిణీ ద్వారా పేద రైతులకు మేలు చేసినట్లు వివరించారు. కందులు, సోయాబీన్, జొన్న వంటి పంటల దిగుబడుల పరిమితిని పెంచి ప్రభుత్వమే కొనుగోలు చేసిందని తెలిపారు. రైతు భీమా కొనసాగిస్తూ, 2023 కంటే ఎక్కువ మంది రైతులను భీమా పరిధిలోకి తీసుకురాగలిగామని చెప్పారు. రైతుల ప్రీమియంలను కూడా ప్రభుత్వం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మట్టి పరీక్షలు, శిక్షణ కార్యక్రమాలు, డ్రిప్ పరికరాల పంపిణీ వంటి అన్ని పథకాలు పునరుద్ధరించామన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి రైతు పేరుతో విషప్రచారం చేస్తున్నారని, ఇది ప్రజలు నమ్మే స్థితిలో లేదన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. గత పదేళ్లలో రైతు సంక్షేమానికి తిలోదకాలు ఇచ్చిన వారే ఇప్పుడు ప్రభుత్వాన్ని నిందించడం సిగ్గుచేటన్నారు. ఇది పవిత్ర మైన కార్యక్రమమని, ఇది శుభసూచకమని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకే భూ భారతిని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. దొంగ పాస్ బుక్‌లకు కూడా రైతు భరోసా ఇవ్వాల్సిన పరిస్దితి ఏర్పడిందని, చెరువులు రహదారులు డొంకలు అన్నీ ఆక్రమణకు గురయ్యాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల సమయంలో ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని, ప్రజలకు ఇచ్చిన మాట మేరకు భూ భారతి తెచ్చామని మంత్రి చెప్పారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దేశ చరిత్రలో నిలచిపోతారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ధైర్యంగా ముందుకు వచ్చారని, తమకు రాజకీయం, అధికారం శాశ్వతం కాదని, ప్రజల సమస్యల పరిష్కారమే తమకు ముఖ్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రైతాంగానికి రూ. 36 వేల కోట్లు వారి అకౌంట్లలో వేశామన్నారు.

# అమెరికాలో భారతీయులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుంది

**అవసరమైన పక్షంలో న్యాయసహాయం కూడా అందిస్తాం**

**అమెరికా చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందే**

**మంచి మార్పు దిశగా విద్యార్థులు కృషి చేయాలి**

**డాలస్ పర్యటనలో విద్యార్థులతో కెటిఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయసహాయం అందించేందుకు బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామని తెలిపారు. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే అతనితోపాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురవుతుంద న్నారు చెప్పారు. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను, అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని సూచించారు. స్థానిక చట్టాలతో పాటు- ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. అమెరికాలోని డాలస్ పర్యటనలో ఉన్న కేటీఆర్.. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో, ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రిస్కు తీసుకున్నప్పుడు మాత్రమే కలలు సాకారం అవుతాయి అనడానికి కేసీఆర్ జీవితమే సాక్ష్యమని చెప్పారు. అమెరికా పోవాలన్నా, చదువు కోవాలన్నా ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యే వాళ్లమన్న కేటీఆర్.. ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 ఏండ్లు పూర్తవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలని చెప్పారు. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేశారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని తెలిపారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కేసీఆర్‌పై ప్రశంసల కురిపించారని చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేథోవలస (ఇసశ ఉసశ) మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు. ఇకపోతే అక్కడ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

- రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె.సురేంద్రమోహన్..
- కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించిన కమిషనర్




**వరంగల్ ప్రతినిధి, జూన్ 3(జనంసాక్షి):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ సంచాలకులు, సహకార శాఖ రిజిస్ట్రార్ కె. సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ ప్రభాకర్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్షించి సమర్థ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరు వైకల్యం బారిన పడకుండా ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ప్రాంతంలో ఐదు ప్రమాదాలు జరిగితే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజు 70 ప్రమాదాలు 20 మరణాలు సంభవిస్తున్నాయని, దేశంలో మన రాష్ట్రం ఐదో స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాలలు కళాశాలలు యూనివర్సిటీలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఎన్సిసి వలె రోడ్ సేఫ్టీ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లో ఏర్పాటు చేయాలని, కొత్తగా నిర్మించదున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లో కూడా ఇది తప్పనిసరిగా ఉండేలా చూడాలని రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మాదిరిగా ఎలక్ట్రానిక్ ఎన్ఫోర్స్మెంట్ సిస్టం అమలు చేస్తూ ఏఎన్పిఆర్ కెమెరాల కొత్త సాఫ్ట్వేర్ ద్వారా వాహన నంబర్ ఆధారంగా వాహనం పూర్తి వివరాలు సేకరించాలని అన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం ఏర్పాటుకు వెంటనే భూసేకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. హైదరాబాదులో ప్రమాదాల నివారణకు నిర్వహించే శిక్షణకు జిల్లా నుండి విద్యా వాలంటీర్లను పంపాలన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్, టెస్టింగ్ ట్రాకింగ్, వెహికల్ ట్రాకింగ్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాలను ఫిట్నెస్ను ప్రభుత్వం నిర్దేశించిన 30 పారామీటర్ తో చెక్ చేయాలన్నారు. ఓవర్ లోడింగ్ వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలి మాట్లాడుతూ ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 70 ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, అందులో 60 జాతీయ రహదారి, 10 ఇతర రోడ్డులుగా గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అవగాహన కల్పించుట జిల్లాలో తొమ్మిది కళాశాలల్లో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ క్లబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీసీపీ ప్రభాకర్ మాట్లాడుతూ 246 ఏఎన్ పిఆర్ (ఆటోమేటిక్ నేమ్ ప్లేట్ రికగ్నైజేషన్)కెమెరాలను అమర్చి నిత్యం పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా, పట్టణంలో రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించడం జరుగుతున్నదని అన్నారు. అంతకుముందు రవాణాశాఖ కమిషనర్ సురేంద్రమోహన్ను కలెక్టర్ డాక్టర్ సత్య శారద శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లాల రవాణాశాఖ అధికారులు పురుషోత్తం, శోభన్ బాబు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎన్ హెచ్ఎ ఐ టీం లీడర్ సంపత్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉత్సవాలను అవమానిస్తారా?

- ఫిషర్మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్

**హైదరాబాద్, జూన్ 3 (జనంసాక్షి) :** తెలంగాణ ఉత్సవాలను అవమానిస్తారా? అని ఫిషర్మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. కేసీఆర్కు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం కనిపించదా? అని ప్రశ్నించారు. గాంధీభవన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడుగా కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. కేటీఆర్, కేసీఆర్ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం తల తాకట్టు పెట్టి, చావు నోట్లో తల పెట్టిన అన్న కేసీఆర్ ఎక్కడ? అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీ ఉత్సవాలకు ఎందుకు రాలేదని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉంటే ఓర్వలేక కొంత మంది నాయకులు విదేశాలలో తిరుగుతున్నారని, కేటిఆర్ టెక్సాస్ లో గింటన్ అనే ఊరు మరో గుంటూరు అంటున్నాడని, గుంటూరు పేరు కేటీఆర్ నోట్లో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. టెక్సాస్ లో తెలంగాణ పరువును కేటిఆర్ బజారున పెట్టాడని,, తెలంగాణ లో ఏ ప్రాంతం కేటిఆర్ కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. టెక్సాస్ లో తల దాచుకోవడానికి కేటిఆర్ విల్లా కొన్నాడని, తప్పు చేస్తే ఇక్కడ దాచుకున్న వదిలి పెట్టే ప్రసక్తి లేదని, ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం సెటిల్ చేయడానికి కేటిఆర్ విదేశాలకు పోయాడని, విదేశాలలో ఎన్ని చిల్లర వేశాలు వేసినా కూడా ప్రజల ఆశీర్వాదం సీఎం రేవంత్ రెడ్డికి ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి కోతల ప్రభాకర్ రెడ్డికి లేదని, కొత్త ప్రభాకర్ రెడ్డి సలహాలు,ఆలోచనలు కేటిఆర్ కు బీఆర్ఎస్కు నాయకులకు ఇవ్వాలని సూచించారు. 2023 లో బీఆర్ఎస్కు ప్రతిపక్ష హోదా వచ్చిందని, 2028 ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా రాకుండా ప్రజలు చూసుకుంటారని తెలిపారు.

## తాపీమేస్త్రీకి 20 ఏళ్ల జైలు

- బాలికపై అత్యాచారం కేసు

**హైదరాబాద్,జూన్ 3 (జనంసాక్షి) :** సరూర్నగర్ పీఎస్లో నమోదైన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో రంగారెడ్డి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురానికి చెందిన దర్శనం నాగరాజు.. అబ్దుల్లాపూర్మెట్లో ఉంటూ తాపీమేస్త్రిగ్రా పనిచేసేవాడు. సరూర్నగర్ పరిధిలో ఉండే మైనర్ బాలికను 2024లో పెళ్లి పేరుతో తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో యాక్ట్తో పాటు చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసిన సరూర్నగర్ పోలీసులు నాగరాజును అరెస్టు చేసి జైలుకు తరలించారు. దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేసిన విచారణాధికారి సైదిరెడ్డి... కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు.. నాగరాజుకు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.6 లక్షల పరిహారం ప్రకటించింది. కేసు నమోదైన అనతి కాలంలోనే నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన విచారణాధికారి, న్యాయవాదులు, కోర్టుకు.. బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సే నో టూ ప్లాస్టిక్!

- పీసీబీ పోస్టరును మంత్రి కొండా సురేఖ విడుదల
- ఈ మహత్తర ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యవ్వాలని మంత్రి పిలుపు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత స్టేట్ గా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని.. పర్యావరణాన్ని నష్టపరచొద్దని మంత్రి చెప్పారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పోస్టరును మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2025 సందర్భంగా "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్తో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... ఈ పోస్టర్లు పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. స్థిరమైన పద్ధతులను అవలంభించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, సరైన వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని, వ్యక్తులు పాల్గొనేలా ప్రోత్సహించి ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ సూచించారు. పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో, స్థిరత్వాన్ని ప్రోత్సహించడంలో రాష్ట్రం ప్రభుత్వ నిబద్ధతను మంత్రి నొక్కి చెప్పారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో టీజీ పీసీబీ మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి

- జిల్లాలో విత్తనాలు,ఎరువులు, యూరియా, డిఏపి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- పట్టణం అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయండి
- ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 3 (జనం సాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామ్ చందర్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డిఎఫ్ఓ విశాల్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. వీరబ్రహ్మాచారి లతో కలిసి రాష్ట్ర, ఉమ్మడి జిల్లా, మహబూబాబాద్ అధికారులతో జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద వాడికి సొంత ఇంటి నిర్మాణం అని ఈ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలని ద్రుడ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. జిల్లాలోజూన్ పదవ తారీకు వరకు ప్రోసిడింగ్ కాపీలు మంజూరు చేసి బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసిన అన్నిటికీ డబ్బులు వెంటనే ఇవ్వాలని సూచించారు, గత పది సంవత్సరాల నుండి పేదవారికి సొంత ఇల్లు నిర్మాణ పథకం ప్రవేశ పెట్టలేదని, ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కావలసిన ఇసుక రిచ్ ద్వారా ప్రభుత్వ నిబంధనల కూపన్లను జారీ చేయాలన్నారు. ప్రస్తుత వానకాల పరిస్థితుల దృశ్య జిల్లాలో తగినన్ని ఎరువులు, సిద్ధంగా ఉంచుకోవాలని, కల్తీ ఎరువులు అమ్మకాలు చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు వరి ధాన్యంతో పాటు హార్టికల్చర్ ఇతర వాణిజ్య ఉద్యానవన పంటల వేటకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లాలో జేఎన్టీయూ, మెడికల్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, హార్టికల్చర్ యూనివర్సిటీ లకు కేటాయించిన స్థలాలను స్వాధీనపరిచి పనుల పురోగతిలో ఉన్న త్వరితగతిన పూర్తి చేయాలని అందుకు తగిన ప్రణాళికలు వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా ను విద్యా హబ్ గా తీర్చిదిద్దాలన్నారు, కేవలం విద్యుత్ ద్వారా మాత్రమే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. గిరిజన జిల్లా ఆయన మహబూబాబాద్ లో బంజారా భవన్ నిర్మాణానికి స్థల సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామ్ చందర్ నాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు తీసుకోవాల్సిన ప్రణాళికలపై వివరించారు, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ సలహాదారులు, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు తెలిపిన సూచనల ప్రకారం ఎలాంటి డివియేషన్ లేకుండా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు.

## సీఎం ప్రజావాణి చొరవ

- మృతుని కుటుంబానికి అందిన రూ. 4 లక్షల పీఎఫ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీఎం ప్రజావాణి చొరవతో పాల ప్రవీణ్ అనే మృతుని కుటుంబానికి నాలుగు లక్షల రూపాయల ప్రావిడెంట్ ఫండ్ అందింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణికి మృతుని తల్లిదండ్రులు పాల నాగేశ్వరరావు, రామలక్ష్మి వచ్చి ఈ విషయాన్ని తెలిపారు. తమను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు మృతుని తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ లోని జగద్గిరిగుట్టకు చెందిన పాల ప్రవీణ్ ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తుండగా ఐదేళ్ళ క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగిన లాభం లేకపోవడంతో మూడు నెలల క్రితం సీఎం ప్రజావాణి కి వచ్చి సమస్యను వివరిస్తూ మృతుని తల్లిదండ్రులు పిటిషన్ ఇచ్చారు. సీఎం ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ల ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగి ప్రైవేట్ సంస్థ, పీఎఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. మృతుడు ప్రవీణ్ కు రావాల్సిన రూ. 4 లక్షల పీ ఎఫ్ డబ్బులు ఇప్పించారు.

## రామేశ్వరానికి ప్రత్యేక రైలు

**హైదరాబాద్, జూన్ 3 (జనంసాక్షి) :** తమిళనాడులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామేశ్వరం వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. చర్లపల్లి - రామనాథపురం మధ్య ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. చర్లపల్లి-రామనాథపురం (07695) రైలు ఈ నెల 11 నుంచి 25 వరకు ప్రతి బుధవారం రాకపోకలు సాగిస్తుందని చెప్పింది. అలాగే, రామనాథపురం నుంచి చర్లపల్లి (07696) రైలు ఈ నెల 13 నుంచి 27 వరకు ప్రతి శుక్రవారం రైలు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, చెంగల్పట్టు, విల్లుపురం, చిదంబరం, సిర్కాజీ, మయిలదుతురై, తిరువూర్, తిరుతురైపూండి, అదిరంపట్టణం, పుదుకొట్టై అర్ణతాంగి, కారైకుడి, శివగంగ, మానమాదురై స్టేషన్లలో రైలు ఆగుతుందని పేర్కొంది. రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్లు ఉన్నాయని వివరించింది.

## దశ, దిశ చూపగలిగే శక్తి జర్నలిజానికే సొంతం!

- సీనియర్ పాత్రికేయులు శ్రీ నృసింహ భారతిస్వామి



**గుంటూరు, జూన్ 3 (జనంసాక్షి) :** బాధ్యత కలిగిన జర్నలిజం సమాజ శ్రేయస్సుకు ఉపకరిస్తుందని, అసలు సమాజానికి దశ, దిశ చూపగలిగే శక్తి ఒక్క జర్నలిజానికే వుందని సీనియర్ పాత్రికేయులు శ్రీ నృసింహ భారతిస్వామి అన్నారు. 1978 నుంచి రెండు దశాబ్దాల పాటు గుంటూరు నగరంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి పత్రికల్లో బ్యూరో చీఫ్ గా పనిచేసిన చిలకలపూడి పుండరీకాక్షుడు.. 2015లో పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి శ్రీ విద్యా నృసింహ భారతిస్వామి సమక్షంలో వీరు సన్యాసం స్వీకరించారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో నెలకొల్పిన పుష్పగిరి పీఠానికి అధిపతి అయ్యారు. నాలుగు దశాబ్దాలకు పైగా పుష్పగిరి పీఠానికి, శ్రీ విద్యా నృసింహ భారతిస్వామికి విశేష సేవలందించారు. శ్రీ నృసింహ భారతిస్వామి తన పర్యటనలో భాగంగా గుంటూరు వచ్చినపుడు, పూర్వాశ్రమంలో సమకాలీనుడైన సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, ఏపీయుడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.కె.మోహన్ రావుతో పాటు స్వామీజీని కలిశారు. ఈ సందర్భంగా శ్రీ నృసింహ భారతిస్వామి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటకాలంలో ఆంధ్రపత్రిక, జాగృతి, కృష్ణా పత్రిక, ఆంధ్రకేసరి తదితర పత్రికలు ప్రజల పక్షాన క్రియాశీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. పుండరీకాక్షుడు ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేశారని ఈసందర్భంగా నిమ్మరాజు తెలిపారు. తరువాత తాను జిల్లా కన్వీనర్, కార్యదర్శి, అధ్యక్షునిగా, ఆపై నాలుగు దఫాలు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన సందర్భాన్ని కూడా స్వామీజీతో నిమ్మరాజు నెమరువేసుకున్నారు.

## బుగ్గమఠం భూములపై ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, జూన్ 3 (జనంసాక్షి) :** బుగ్గమఠం భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. బుగ్గమఠం భూముల అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజరు కరోల్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా పెద్దిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్పై సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్ పై వారం రోజుల్లోగా పిటిషనర్ రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం గడువు ఇచ్చింది. అప్పటివరకు భూములపై యధాతథ స్థితి కొనసాగించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## నేడు జాగృతి మహాధర్నా

**హైదరాబాద్, జూన్ 3 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు కాళేశ్వరం ప్రాజెక్ట్పై కమిషన్ నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా తెలంగాణ జాగృతి భారీ ధర్నాకు పిలుపునిచ్చింది. జూన్ 4న బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ మహాధర్నా ఇందిరా పార్క్ వద్ద జరగనుంది. ఈ ధర్నాను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వయంగా నేతృత్వం వహించనున్నారు. కేంద్ర సంస్థలు కేసీఆర్పై టార్గెట్ చేసినట్లు ఆరోపిస్తూ, ఇది రాజకీయ కుట్రగా అభివర్ణిస్తూ జాగృతి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనుంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్కు సంబంధించి కేసీఆర్కు నోటీసులు రావడం, దానిపై తెలంగాణ భవనుల నుండి కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ మహాధర్నా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ మాజీ సీఎం ప్రతిష్టను దెబ్బతీయాలని జరుగుతున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాగృతి ఈ నిరసన చేపడుతోందని కవిత పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో జాగృతి కార్యకర్తలు, తెలంగాణ సంస్కృతి సంఘాల ప్రతినిధులు, నాయకులు భారీగా పాల్గొనే అవకాశం ఉంది. అధికార సంస్థల నిర్ణయాలను ప్రశ్నించే స్థాయిలో ఇది కీలక కార్యక్రమంగా మారనుంది.


## దళిత విద్యార్థుల పేరుతో లూటీ

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్పై కాగ్ నివేదిక
- ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేయాలి
- పీసీసీ అధికార ప్రతినిధి సామా రామ్మోహన్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 3 (జనంసాక్షి) :** తెలంగాణలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. పీసీసీ అధికార ప్రతినిధి సామా రామ్మోహన్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్పై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత విద్యార్థుల సంక్షేమ పథకాల పేరుతో నిధులను పక్కదారి మళ్లించారని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్లోని గాంధీ భవన్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దళిత పిల్లల పేర్ల మీద వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను ఈ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లూటీ చేశారని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు చెప్పి...ఆయన రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 240 మంది విద్యార్థులకు కోడింగ్ నేర్పించడానికి ఏకంగా నాలుగు కోట్లు- ఖర్చు చేశారని చెబుతున్నారని, ఇది నమ్మదగిన విషయం కాదన్నా సామా రామ్మోహన్ రెడ్డి. మూడు సంస్థల పేరుతో కోడింగ్ శిక్షణ చేపడతామన్నా, కేవలం రెండు సంస్థలకే అనుమతులు తీసుకున్నారు అంటూ మండిపడ్డారు. ఈ-టెండర్ ప్రక్రియ చేపట్టకుండా కోర్సులకు ఖర్చులు చేసినట్టు రామ్మోహన్ ఆరోపించారు. ఐఐటీ-, జేఈఈ ఆన్లైన్ కోర్సుల పేరుతో రూ. 20 కోట్లు ఖర్చు చేశారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా లక్షా ఇరవై వేల మందికి ఉచితంగా కోడింగ్ శిక్షణ ఇస్తున్నామని, ఇది ప్రభుత్వం చేపట్టిన పారదర్శక కార్యక్రమమని వివరించారు. ఈ ఆరోపణలన్నీ కేంద్రం కాగ్ నివేదికలో పేర్కొన్న విషయాలేనని తెలిపారు. దళిత విద్యార్థుల పేరుతో భారీగా నిధులు మళ్లించారని, అంబేద్కర్ పేరు చెప్పుకుంటూ, ఆయన రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వమే విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇతర అంశాలపై కూడా ఆయన స్పందించారు. గత పదకొండు ఏళ్లలో ఎస్సీ గురుకులాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ సాధించలేకపోయారని, ప్రస్తుతం మాత్రం అన్ని సీట్లు భర్తీ అవుతున్నాయని తెలిపారు. యూనిఫాం, దుప్పట్ల వంటి అవసరమైన సదుపాయాలనూ మరవకుండా ప్రవీణ్ వదిలి పెట్టలేదని విమర్శించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో కేంద్రం పొందు పరిచిన అంశాలనే తాము బయట పెడుతున్నామన్నారు. కోడింగ్ విధానంపై ఏడాదికి రూ. 4 కోట్లు- ఖర్చు చేశారని వివరించారు. 240 మంది పిల్లలకు కోడింగ్ చేస్తే రూ. 4 కోట్లు అవుతాయా..? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. మూడు సంస్థల పేరుతో కోడింగ్ నేర్పిస్తానంటూ రెండు సంస్థల నుంచే అనుమతి తీసుకున్నారని గుర్తు చేశారు. దీనికి ఆర్థిక శాఖ అనుమతి కూడా లేదన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# భారత దౌత్య వైఫల్యాలు



పహల్గాం ఉగ్రదాడికి కారణమై, ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్ ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెడతామని మోదీ ప్రభుత్వం ప్రతిజ్ఞ చేసింది. అయితే, ఆ వాగ్దానాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. గానీ, కార్యరూపం దాల్చలేదు. మిగతా దేశాల విషయం అలా ఉంచితే, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మిత్ర దేశాల మద్దతును కూడా మోదీ ప్రభుత్వం కూడగట్టలేక పోయింది. మరో వైపు, ఇంతకాలం మిత్రులుగా ఉన్న పొరుగు దేశాలు కూడా చైనా వలలో చిక్కుకొని భారత్‌కు క్రమంగా దూరమవుతున్నాయి. ఇలా మొత్తంగా 11 ఏండ్ల పాలనలో విదేశాంగ విధానంలో, విదేశీ దౌత్యంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి.

మోదీ ఆప్త మిత్రుడైనప్పటికీ (పైకి చెప్పుకోవడం )ఆపలేదు. భారత్–పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తొలి నుంచీ భిన్న వైఖరినే అవలంబించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల్లో తాము జోక్యం చేసుకోబోమని మొదట అమెరికా చెప్పుకొచ్చింది. అయితే, 24 గంటలు కూడా తిరక్కముందే.. భారత్–పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, అందుకు తాను మధ్యవర్తిత్వం వహించానని

ఇరుదేశాల కంటే ముందే.. ట్రంప్ స్వయంగా ప్రకటిం చారు. యుద్ధ విరమణకు సంబంధించిన ప్రకటన చేస్తూ.. పాకిస్తాన్ ను, భారత్ ను ట్రంప్ ఒకేగాటిన కట్టడంతో పాటు ఇరుదేశాలను ఉద్దేశించి 'కామన్సెన్స్' అనే వ్యాఖ్యలను చేశారు. ట్రంప్ ను తన ఆప్తమిత్రుడిగా చెప్పుకొనే మోదీ.. ఈ విషయంపై ఒక్కమాట కూడా మాట్లాడకుండా మౌనం వహించారు. అసలు అమెరికా వైఖరిని ఏ మాత్రం ప్రశ్నించే సాహసం చేయలేదు. వీటన్నింటిని విశ్లేషించి చూస్తే, పాకిస్తాన్ ను దోషిగా నిల బెట్టే విషయంలోనూ... అమెరికా సాహాయాన్ని తీసు కోవడంలోనూ మోదీ దౌత్యం ఏమాత్రం పనిచేయలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, ఆర్థిక, ఆహార, రాజకీయ సంక్షోభంతో కొట్టుమిట్టా డుతున్న పాకిస్థాన్ కు ఐఎంఎఫ్ నుండి బెయిల్ అవుట్ ప్యాకేజీ దక్కకుండా అడ్డుకోవడం లోనూ (అమెరికా అధ్యక్షుడు ట్రాంప్ పరోక్ష హస్తం ఉంది) మోదీ ప్రభుత్వం విఫలమైంది..

**ఇరుగు పొరుగు దేశాలతోనూ అంతే..**

ఈ 11 ఏండ్ల పాలనలో ప్రధాని మోదీ విదేశాంగ విధానంలో, దౌత్య సంబంధాలను నెర పడంలో దారుణం గా విఫలమయినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్ కు పొరుగున ఉన్న దాదాపు అన్ని మిత్ర దేశాలూ ఇప్పుడు భారత్ కు దూరమై చైనాకు అను కూలంగా మారడాన్ని దీనికి ఉదాహరణగా చూడొచ్చు. మాల్దీవుల్లో ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భారత్ కు వ్యతిరేకిగా పేరుపొందిన మహమ్మద్ ముయిజ్జు గెలిచి అధ్యక్షుడయ్యారు. చైనా నుంచి పెద్దయెత్తున రుణాలు వస్తుండటంతో వీలుచిక్కినప్పు డల్లా భారత్ పై ఆయన విమర్శలు చేస్తూనే ఉన్నారు. సరిహద్దు కయ్యాలతో భారత్‌లో ఉద్రిక్తతలకు కారణమవుతున్న పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌తో, చైనాతో లోగుట్టు మైత్రీ బంధం బహిరంగ రహస్యమే. ఇక, బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం, గతంలో చైనాతో సరిహద్దు వివాదాలను ఎదుర్కొన్న భూటాన్ తో పాటు, మారిషస్ కూడా చైనా లోని కమ్యూనిస్ట్ ప్రభుత్వంతో ఇప్పుడు సత్సంబం ధాల కోసం ఉవ్విళ్లూరుతున్నాయి. శ్రీలంకలో తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనుర కుమార దిసనాయకే మార్క్సిస్ట్ నేత, మొత్తంగా భారత్ చుట్టూరా ఉన్న పొరుగు దేశాలన్నీ ఇండియాను కాదని చైనా స్నేహ హస్తాన్ని కోరుకొంటున్నాయి. దీంతో చైనా కుయుక్తులను తిప్పికొట్టడంలో దౌత్యపరంగా మోదీ విఫల చెందారని విశ్లేషకులు అభి ప్రాయపడుతున్నారు.

**యూఏఈ .. కొలంబియాలు కూడా :**

యూనిఫైడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కు, భారత్ కు మధ్య దశాబ్దాలుగా మంచి దౌత్య సంబంధాలు ఉన్నాయి. అయితే, పహల్గాం దాడులు జరిగిన సమయంలోనే యూఏఈ ఉప ప్రధాని, విదే శాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జయాద్ పాకిస్థాన్ లో పర్యటించడం అందరినీ షాక్ కు గురిచేసింది. అంతేకాదు. ఇరు దేశాలు ఉద్రి క్తతలకు పాల్పడకుండా శాంతి చర్చలు చేప ట్టాలని యూఏఈ మొక్కుబడిగా ప్రకటించడం. కాల్పుల విరమణ ప్రకటన చేయడానికి అమెరికాతో యూఏఈ సంప్రదింపులు జరిపినట్టు వార్తలు రావడం. పలు అనుమానాలకు తావిస్తున్నది. అంతే కాదు.. యూఏఈ దౌత్యం అద్భుతమంటూ పాకిస్తాన్ బహిరంగంగానే ప్రశంసించింది. భారత్ కు మిత్ర దేశంగా ఉన్న యూఏఈ.. ఇలా భారత వ్యతిరేక చర్యలకు పాల్పడుతుంటే మోదీ సర్కారు ఏం చేస్తున్నదన్న వాదనలు పలువురు తెరమీదకు తీసుకొస్తున్నారు. ఇక, భారత్–పాక్ ఉద్రిక్తతలపై తొలుత చైనా స్పందిస్తూ.. తాము ఎల్లప్పుడూ ఉగ్ర వాదానికి వ్యతిరేకమని స్పష్టం చేసింది. అయితే, కాల్పుల విరమణ తర్వాత మాత్రం.. పాకిస్తాన్ కు అన్ని విషయాల్లో అండగా ఉంటామని ప్రకటించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకమన్న చైనా.. అదే ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్తాన్ కు సపోర్ట్ చేయడమేంటి? దీన్ని మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా ఎందుకు అడ్డుకోలేకపోయింది? అనే సందే హాలను పలువురు దౌత్యవేత్తలు లేవదీస్తు న్నారు. ఇక, 26 మంది ప్రాణాలు కోల్పోయిన పహల్గాం ఉగ్రదాడిపై ఏ మాత్రం స్పందించని భారత్ మరో మిత్ర దేశం. కొలంబియా.. ఆపరేషన్ సిందూర్ కారణంగా పాకిస్తాన్ లో జరిగిన ప్రాణ నష్టంపై విలవి ల్లాడిపోయింది. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని సంతాపం కూడా వ్యక్తం చేసింది. దీన్ని కూడా మోదీ ప్రభుత్వం మొదట ఖండించ లేదు. సర్వత్రా విమర్శలు రావడంతో శశిధ రూర్ నేతృత్వంలోని బృందం కొలంబియాపై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో ఆ ప్రకటనను కొలంబియా వెనక్కి తీసుకొంది. మొత్తంగా ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. పహల్గాం ఉగ్రదాడి విషయంలో అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్తాను దోషిగా నిలబెట్టడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# యూరో బలం.. డాలర్ పతనం

## బంగారం ధర పెరుగుదల.. కారణాలు, పరిణామాలు



ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈరోజు అమెరికా డాలర్ విలువ గణనీయంగా కంపించింది. ఇదే సమయంలో యూరో కరెన్సీ, బంగారం ధరలు పెరిగాయి. ఈ మార్పులకు కారణాలు ఏమిటి ? డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయా? ఈ విశ్లేషణలో ఈ ప్రశ్నలకు సమగ్రమైన సమాధానాలు వెతకాల్సి ఉంది. డాలర్ విలువ తగ్గడానికి మూడు ప్రధాన కారణాలు కనపడుతున్నాయి. మొదటిది, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించడం. వడ్డీ రేట్లు తగ్గినప్పుడు విదేశీ పెట్టుబడులు తగ్గుతాయి. ఫలితంగా డాలర్ డిమాండ్ తగ్గిపోతుంది. రెండవది, అమెరికా ఆర్థిక వృద్ధి నెమ్మదించడం. జీడీపీ వృద్ధి రేటు క్షీణించడంతో డాలర్ పై నమ్మకం సడలింది. మూడవది, ట్రంప్ టారిఫ్ విధానాలు చైనా, యూరోపియన్ యూనియన్ల పై విధించిన ఎక్కువ పన్నులు అమెరికన్ ఎగుమతులను గణనీయంగా తగ్గించాయి. ఇది డాలర్ డిమాండ్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

యూరో కరెన్సీ బలపడటానికి ప్రధాన కారణం డాలర్ బలహీనత. పెట్టుబడిదారులు డాలర్ కు బదులుగా యూరోలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. యూరోపియన్ యూనియన్ ఆర్థిక స్థిరత్వం కూడా యూరోను బలపరిచింది. బంగారం ధరలు పెరగడానికి రెండు కారణాలు. డాలర్ విలువ తగ్గినప్పుడు బంగారం ధరలు స్వాభావికంగా పెరుగుతాయి. అదనంగా, ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితి పెరిగినందున పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తిగా బంగారాన్ని ఎంచుకుంటున్నారు.

ట్రంప్ టారిఫ్ వ్యూహం మాత్రమే ప్రధాన కారణంగా డాక్టర్ విలువ విఫలమైందని చెప్పలేము. కానీ ఇది అనేక అనుకోని ప్రతికూల ప్రభావాలను సృష్టించింది. చైనా, యూరోపియన్ యూనియన్ అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలను విధించాయి. ఫలితంగా అమెరికన్ ఎగుమతులు కూడా బాగా తగ్గాయి. అనేక కంపెనీలు తమ తయారీ యూనిట్లను ఇతర దేశాలకు మార్చుకోవడంతో అమెరికాలో ఉద్యోగాలు కూడా ప్రభావితమయ్యాయి. ట్రేడ్ వార్ భయంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి.

చివరికి, డాలర్ విలువ పతనం కావడం, యూరో కరెన్సీఅలాగే బంగారం ధరలు పెరగడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెద్ద మార్పులకు సూచనలుగా కనిపిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ విధానాలు కొన్ని ప్రయోజనాలు తెచ్చినప్పటికీ, దీర్ఘకాలికంగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు హాని కలిగిస్తాయని ఆర్థిక నిపుణులు, వాణిజ్య సంస్థలు హెచ్చరికలు జారీచేసినా, ట్రంప్ మొండిగా వాటిని లక్ష్యపెట్టలేదు. భవిష్యత్తులో ఈ పరిస్థితులు ఎలా మారుతాయో జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# నక్సలైట్లు దేశభక్తులు



ఆపరేషన్ సిందూర్!
ఆపరేషన్ కగార్!
దేశమంతా కంగారు!
ఉగ్రవాదం! నక్సలిజం!
ఒకరు దేశద్రోహులు
మరొకరు దేశభక్తులు!

ద్రోహుల్ని శిక్షించాలి!
దేశభక్తుల సంగతే
కాస్త ఆలోచించాలి!

వాళ్ళు అడిగేది ఏంటి?
స్వేచ్ఛ, సమానత్వం!
వివక్షలులేని సమాజం!

నువ్వు కార్పొరేట్లపక్షం!
వాళ్ళు ప్రజలపక్షం!
అదేకదా నీ భయం!

ఆదివాసీలకేంకావాలి?
జల్ జంగిల్ జమీన్!
నువ్వు సిద్ధంగా లేవు!

ఇట్టి తరుణం లో

శాంతి చర్చలే నయం!
అవే నీకు అభయం!

తుడిచిపెట్టేస్తానంటావ్!
ఇది ప్రజాస్వామ్యం!
'మను రాజ్యాంగం'
కాదు!

నేను ప్రజల్లో ఒకడిని
ప్రజాస్వామ్యవాదిని!
నక్సలైట్లుదేశభక్తులు!

**తమ్మినేని అక్కిరాజు**
**హైదరాబాద్**

# ఒకరికోసం అందరం

మనిషి సంఘజీవి
విభిన్న మనస్తత్వాలతో
విభిన్న సామాజిక ఆర్థిక
నేపథ్యాల్లో జీవిస్తున్నాం

మనిషి ఆలోచనల్లో
అభిరుచుల్లో విభిన్న
అభిప్రాయాలుండడం
ప్రకృతి సహజం

విభిన్న సామాజిక
సాంస్కృతిక
మూలాలు ఉన్న వారు
జీవించే సమాజంలో
అందరూ కలిసి
జీవించేటపుడు
బేదాభిప్రాయలు
తప్పవు

కోపాలు తాపాలు
తప్పులు అహం
అహంకారం అధికారం
ఆదిపత్యవాదం
సహజం

సంఘ స్ఫూర్తికి విఘాతం
కలుగకుండా తప్పు చేసిన
వ్యక్తి తన తప్పు
తెలుసుకునేలా చేయడం
మళ్ళీ ఆ తప్పు
జరుగకుండా
చూడడం
సామాజిక బాధ్యత

ఎవరికి వారు ఏకాకిగా
బతుకుతున్న
ఉరుకుల పరుగుల
సమాజంలో

ఓర్పు మార్పు
సహనం
సమన్వయత
సౌభ్రాతృత్వ
భావన పరివ్యాప్తి
ద్వారా సామాజిక
ఐక్యత సహానుభూతి
మానవత్వం
మనుషులను కలిపే
మంత్రం కావాలి

అవగాహనతో సామాజిక
బంధాల బలోపేతానికి
కృషి చెయ్యాలి

నాకోసం కాదు మన కోసం
అనేది జీవనశైలి కావాలి
జనం మనంగా బతుకాలి
బతుకాలి ఇతరులను
బతికించాలి

నేను ఉన్నాను అంటే
కారణం మనం ఉన్నాం
అనే భావన
ముఖ్యమైంది
వ్యష్టి భావన కన్నా
సమష్టి భావన మిన్న

తప్పు చేసిన వ్యక్తిని
శిక్షించే కంటే గతంలో
తప్పు చేసిన వ్యక్తి
చేసిన మంచి పనులు
గుర్తు చెయ్యాలి

తప్పు చేసిన వ్యక్తి
పశ్చాత్తాపం
చెందేలా చేయాలి
తప్పు చేసిన వ్యక్తిని
శిక్షించడం కన్నా వారిని
తిరిగి సమాజం
ఆమోదించేలా చూడాలి

తప్పు చేసిన వారిలో
వాస్తవాలను అంగీకరించి
తప్పులు పునరావృతం
కాకుండా జాగ్రత్త పడాలి
మనిషిని శిక్షించే కంటే
మనిషిలో మార్పుకు
మానసిక పరిపక్వతకు
కావలిసిన వాతావరణం
సృష్టించాలి
సంస్కరణలతో
మనిషిలో నేర రహిత
ప్రవృత్తిని పెంచి
హింసా రహిత సమాజ
స్థాపన అందరి సామాజిక
బాధ్యత కావాలి



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం 'సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్ 9440245771

# ఎవరికీ ఋణపడి ఉండకండి

*జీవితంలో సామాజిక, నైతిక విలువలను స్పష్టంగా వివరిస్తాయి. స్వావలంబన, కృతజ్ఞత, సూటి మాటలకు తగిన స్పందన, పరస్పర గౌరవం, ధర్మం ఇవన్నీ సమాజంలో సామరస్యాన్ని, సానుకూల సంబంధాలను పెంపొందిస్తాయి. ఈ సూత్రాలను ఆచరణలో పెట్టడం ద్వారా వ్యక్తులు తమ జీవితాలను మాత్రమే కాక, సమాజాన్ని కూడా ఉన్నతంగా మార్చగలరు.*

జీవితంలో ఋణం అనేది కేవలం ఆర్థిక స్వభావం మాత్రమే కాదుబీ అది భావోద్వేగ, సామాజిక, నైతిక బాధ్యతలను కూడా సూచిస్తుంది. ఎవరి దయాదా క్షిణ్యాల మీద ఆధారపడకుండా, స్వావలంబనతో జీవించడం ఒక గొప్ప ఆదర్శం. స్వావలంబన అనేది మనిషి యొక్క ఆత్మగౌరవాన్ని, స్వేచ్ఛను రక్షిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి తన కష్టార్జితంతో జీవనం సాగిస్తూ, ఇతరుల సహాయం లేకుండా తన లక్ష్యాలను సాధిస్తే, అది అతని ఆత్మవిశ్వాసాన్ని, సమాజంలో గౌరవాన్ని పెంచుతుంది. ఋణం అనేది కొన్నిసార్లు ఆర్థిక రూపంలో కాక, సామాజిక ఒత్తిడిగా కూడా వస్తుంది. ఉదాహరణకు, ఒక స్నేహితుడు మీకు సహాయం చేస్తే, ఆ సహాయాన్ని గుర్తుంచుకోవడం, సమయం వచ్చినప్పుడు తిరిగి ఆ సహాయాన్ని అందించడం ద్వారా ఋణం తీర్చుకోవచ్చు. అయితే, ఎవరి దయాదాక్షిణ్యాల మీద జీవించడం అనేది ఒక వ్యక్తి యొక్క స్వతంత్రతను హరిస్తుంది. సమాజంలో స్వావలంబన ఒక గొప్ప విలువగా పరిగణించబడుతుంది, ఎందుకంటే అది మనిషిని ఇతరులపై ఆధారపడకుండా, తన సొంత బాటలో నడిచేలా చేస్తుంది.

**శుభాకాంక్షలు తెలిపిన వారికి కృతజ్ఞతలు చెప్పండి**


మన జీవితంలో శుభ సందర్భాలలో, కష్ట సమయాలలో మనకు మద్దతుగా నిలిచే వారు, శుభాకాంక్షలు తెలిపే వారు మన బంధాలను బలోపేతం చేస్తారు. కృతజ్ఞత చెప్పడం అనేది కేవలం ఒక ఔపచారికత కాదుబీ అది మన హృదయంలోని గౌరవాన్ని, ఆదరణను వ్యక్తం చేసే మార్గం. ఉదాహరణకు, మీ పుట్టినరోజున లేదా వివాహ వార్షికోత్సవంలో శుభాకాంక్షలు చెప్పిన వారికి ఒక సాధారణ "ధన్యవాదాలు" చెప్పడం వల్ల ఆ సంబంధం మరింత గాఢమవుతుంది. కృతజ్ఞత అనేది సమాజంలో సానుకూల భావనలను పెంపొందిస్తుంది. సమకాలీన సమాజంలో, సోషల్ మీడియా వేదికలలో కూడా శుభాకాంక్షలు తెలియజేయడం సర్వసాధారణం. ఒక వ్యక్తి మీ పోస్ట్‌కు లైక్ చేయడం లేదా శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా మీ పట్ల తమ ఆదరణను చూపిస్తే, దానికి స్పందించడం ద్వారా మీరు వారి ఆదరణను గౌరవిస్తారు. ఈ చిన్న చిన్న చర్యలు సమాజంలో పరస్పర గౌరవాన్ని, సహకారాన్ని పెంచుతాయి.

**సూటి పోటు మాటలన్న వారికి కాల్చి వాత పెట్టండి**

జీవితంలో కొందరు సూటిగా, సత్యాన్ని మాట్లాడతారు, కానీ అది కొన్నిసార్లు కఠినంగా, బాధాకరంగా అనిపించవచ్చు. అయితే, ఆ సూటి మాటలు తరచూ మన మేలు కోసమే ఉంటాయి. అలాంటి వారికి సరైన సమాధానం ఇవ్వడం అనేది ఒక కళ. ఉదాహరణకు, ఒక స్నేహితుడు మీ పనిలో లోపాలను సూటిగా ఎత్తి చూపితే, దానిని వ్యక్తిగతంగా తీసుకోకుండా, ఆ విమర్శను స్వీకరించి, మీ పనిని మెరుగు పరచుకోవడం మంచిది. అయితే, ఒకవేళ ఆ సూటి మాట లు దురుద్దేశంతో, హాని కలిగించే ఉద్దేశంతో చెప్పబడితే, వాటికి తగిన రీతిలో సమాధానం ఇవ్వడం అవసరం. ఇక్కడ "కాల్చి వాత పెట్టండి" అనేది బలమైన, నిశ్చితమైన స్పందనను సూచిస్తుంది. ఇది శారీరక హింసను సూచించ దు, కానీ మీ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేలా, సమర్థ వంతంగా సమాధానం ఇవ్వడాన్ని సూచిస్తుంది. సమాజం లో, ముఖ్యంగా వృత్తి జీవితంలో, రాజకీయ సందర్భాలలో, సూటి మాటలు తరచూ వివాదాస్పదంగా మారవచ్చు. అటువంటి సందర్భాలలో, హుందాగా, ఆత్మవిశ్వాసంతో స్పందించడం వల్ల మీ స్థానం బలపడుతుంది.

**పరవాలేదు.. వారికి మీరు ఇచ్చే దాన్ని బట్టి వారి స్పందన కూడా ఉంటుంది**

మనం ఇతరులతో ఎలా వ్యవహరిస్తామో, వారు మనతో అలాగే వ్యవహరిస్తారు. ఇది సామాజిక సంబంధాలలో ఒక ప్రాథమిక సూత్రం. మీరు ఇతరుల పట్ల గౌరవంగా, దయతో వ్యవహరిస్తే, వారు కూడా మీ పట్ల అదే దయ, గౌరవంతో స్పందిస్తారు. ఉదాహరణకు, ఒక సహోద్యోగికి మీరు సహాయం చేస్తే, ఆ సహాయం వారు గుర్తుంచుకుని, సమయం వచ్చినప్పుడు మీకు తిరిగి సహాయం చేసే అవకాశం ఉంది. ఈ సూత్రం కర్మ సిద్ధాంతంతో కూడా ముడిపడి ఉంటుందిమనం ఏది ఇస్తామో, అదే మనకు తిరిగి వస్తుంది. సమకాలీన సమాజంలో, ఈ సూత్రం



సోషల్ మీడియా సంబంధాలలో కూడా వర్తిస్తుంది. మీరు సానుకూలమైన, ఉత్తేజకరమైన కంటెంట్‌ను పంచుకుంటే, ప్రజలు దానికి సానుకూలంగా స్పందిస్తారు. అదే సమయంలో, మీరు విమర్శలు, నెగెటివ్ కంటెంట్‌ను పంచుకుంటే, అదే రీతిలో స్పందనలు వస్తాయి.

ఎవరు మనకేది ఇచ్చారో, తిరిగి వారిది వారికివ్వడం ధర్మం ధర్మం అనేది సామాజిక, నైతిక బాధ్యతను సూచిస్తుంది. ఎవరైనా మనకు సహాయం చేస్తే, ఆ సహాయాన్ని తిరిగి అందించడం ద్వారా ధర్మాన్ని పాటించినవారమవుతాం. ఉదాహరణకు, ఒక పొరుగువాడు మీ కుటుంబానికి కష్ట సమయంలో సహాయం చేస్తే, మీరు వారికి సమయం వచ్చినప్పుడు తిరిగి సహాయం చేయడం ధర్మం. ఈ సూత్రం సమాజంలో పరస్పర సహకారాన్ని, సామరస్యాన్ని పెంచుతుంది. ఆధునిక సమాజంలో, ఈ ధర్మం వ్యాపార సంబంధాలలో కూడా కనిపిస్తుంది. ఒక కంపెనీ తమ కస్టమర్లకు మంచి సేవలను అందిస్తే, కస్టమర్లు వారి విశ్వాసాన్ని, వ్యాపారాన్ని తిరిగి అందిస్తారు. ఈ విధంగా, ధర్మం అనేది ఒక సామాజిక ఒప్పందంలా పనిచేస్తుంది, ఇది పరస్పర విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది.

**కలం : తన్వీ**
హైదరాబాద్, 7093938342



## కాలం ఫలం

మామిళ్ల కాలం
మండె ఎండకాలం
మధుర రసాల పానీయల కాలం
ఉక్కతో ఉస్సూరు నిట్టూర్పులకు
లస్సీతో ఉషారు షికారు
నల్లని నిరసన పుచ్చకాయల్లో
ఎర్రని తిరుగుబాటు తీపిదనాలు
ప్రకృతి మార్పు
ఆశలబంధాల పెద్ద కూర్పు...


కంటికి దూరం గమ్యం
పాదాల చెంతకు గమ్యం
చేరడమే ప్రదాన లక్ష్యం
కాలంతో సమాధానం...

కాలంతో చీకటి వెలుగు నీడలు
ఫలాల కాలం జాడలు
తుపానులనుఅధికమించాలి
రుచులను రసమయంగా అనుభవించాలి
ఎంత అవసరమో అంతే జుర్రుకునాలి
తెలివితోనే అడుగులు వేయాలి...

అంతట వెలుగైతే భరించలేరు
అంతట చీకటైతే జీవించ లేరు
బొమ్మ బొరుసే జీవితం
కమ్మని కలల రసమయమేజీవితం

**రేడియమ్**
9291527757

# నోషనల్ సీనియారిటీ విధానంలో ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వండి



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలకు కౌన్సిలింగ్ విధానము ప్రవేశ పెట్టినప్పుడు తొలుత కేడరు వారిగా బదిలీలు, ఆ తర్వాత కేడర్ వారి పదోన్నతులు, ఆఖరుగా నియామకాల ద్వారా కొత్త ఉపాధ్యాయులను మిగిలిపోయిన వేకెన్సీలలో పోస్టింగ్ ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం 1998లో అమల్లోకి తెచ్చింది. ఆ షెడ్యూల్ ప్రకారమే కొద్దికాలం నెలనెలా పదోన్నతులు ఇచ్చే విధానం కూడా ఉండేది. ఖాళీ అయిన పోస్టులకు వెంటనే ఉపాధ్యాయులు నియామకం జరగడంతో బోధన ఆటంకం లేకుండా జరిగే పరిస్థితి ఉండేది.

జిల్లా పరిషత్ / ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏడు సబ్జెక్టుల బోధన జరుగుతున్నప్పటికీ ఐదు సబ్జెక్టులకే ప్రత్యేకంగా స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయుడు ఉండేవారు. ఇంగ్లీషు మరియు భౌతిక రసాయన శాస్త్ర సబ్జెక్టుల బోధనకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఉపాధ్యాయులు లేరు. ఆ మేరకు గురుకులాల్లో ప్రత్యేకంగా ఇంగ్లీషు, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల బోధనకు 7 పోస్టులతో కూడిన ప్రత్యేక స్టాఫ్ ప్యాటర్న్ ఉంది. అదే స్టాఫ్ ప్యాటర్న్ జిల్లా పరిషత్ /ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరిన నేపథ్యంలో 2001 సంవత్సరంలో ప్రభుత్వం ఒక విధానం నిర్ణయం తీసుకొని, కొత్త స్టాఫ్ ప్యాటర్న్ అమలు చేయడానికి ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఇంగ్లీషు, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కావలసిన అర్హతలను నిర్ణయించే ఉత్తర్వులను ఆలస్యంగా ప్రభుత్వం ఇచ్చింది. అప్పటికే డిఎస్సి 2002 నోటిఫికేషన్ వచ్చి పరీక్షలు జరిగాయి. ఫలితాలు వచ్చే క్రమంలో ఇన్ సర్వీస్ టీచర్లకు పదోన్నతులు ఆలస్యమైతే, డి.ఎస్.సి 2002 వారికి ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్ పోస్టుల్లో నియామకాలు ఇస్తే వారే సీనియర్లుగా మారుతారనే ఆందోళనను ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాయి. కనుక పదోన్నతుల తర్వాతే డి.ఎస్.సి నియామకాలు చేయాలని కోరిన మేరకు ప్రభుత్వం అంగీకరించింది. కానీ నూతన నియామకాల కన్నా ముందే అర్హతలను నిర్ణయించి 2002 మే నెలలో తగిన ఉత్తర్వులు ఇచ్చి విద్యా సంవత్సరం ప్రారంభించే లోగా పదోన్నతులు పూర్తిచేయాలని , ఆ తర్వాత నూతన నియామకాలు జరుపాలని ప్రభుత్వం పదోన్నతులు, నియామకాల కౌన్సిలింగ్ కోసం షెడ్యూల్ విడుదల చేసింది. కానీ పదోన్నతులకు ఉపాధ్యాయుల అర్హతల విషయంలో కొందరు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ను ఆశ్రయించగా పదోన్నతుల కౌన్సిలింగ్ షెడ్యూల్ వాయిదా పడింది. ఈలోగా డీఎస్సీ 2002 ఫలితాలు వచ్చాయి. స్కూల్ అసిస్టెంట్ అర్హతల కొరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ట్రిబ్యునల్ కొన్ని షరతులతో అనుమతించింది . ఇక కౌన్సిలింగ్ షెడ్యూలు అమలు చేయడమే తరువాయి. 1989, 1994, 1976, 1998 డిఎస్సి బ్యాచుల సెకండ్ గ్రేడ్ టీచర్లను నిరాశకు గురిచేస్తూ ప్రభుత్వం పదోన్నతుల షెడ్యూల్ ను వాయిదా వేస్తూ 15.9.2002 నాడు ఆదేశాలిచ్చింది.

పదోన్నతుల షెడ్యూల్లో జాప్యంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరే పరిస్థితి లేదని, కనీసం నూతన నియామకాలు పూర్తిచేసి ఉపాధ్యాయుల కొరత తీర్చే ప్రయత్నం చేయాలని, డీఎస్సీ నియామకాల కోసం కౌన్సెలింగ్ షెడ్యూలు ను ప్రభుత్వం విడుదల చేసింది. కానీ రంగారెడ్డి జిల్లాకు చెందిన పదోన్నతి పొందబోయే కొంతమంది సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు ముందు డీఎస్సీ 2002 వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తే ఇన్సర్వీస్ టీచర్లమైన తాము జూనియర్లుగా మారే ప్రమాదం ఉందని మరోసారి సమస్యను అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. ఆ మేరకు ట్రిబునల్ స్పందించి OA 8812 /2022 ద్వారా వారి సీనియార్టీ తుదితీర్పుకు లోబడి ఉండాలని, డిఎస్సీ 2002 వారి నియామకాలను షరతులతో ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ మేరకు డిఎస్సి 2002 నియామక పత్రాలను the seniority will be fixed subject to the outcome of result on OA No 8812/2002 " అనే షరతుతో ఇస్తూ 2002 అక్టోబర్ 17 నాడు పాఠశాలలో రిపోర్టు చేయుటకు ఆదేశాలిచ్చింది.

తరువాత అక్టోబర్ 20 నుంచి 24 వరకు పదోన్నతుల కోసం ప్రభుత్వం 16 -10 -2002 నాడు కౌన్సిలింగ్ షెడ్యూలు ను విడుదల చేసింది. వీరంతా నవంబర్ 1వ తేదీన విధుల్లో చేరాలని కూడా వివరణ ఇచ్చింది. అయితే పదోన్నతులకు నూతన నియామకాలకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉన్నప్పటికీ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారము పదోన్నతులు పొందిన వారే సీనియర్లుగా మారుతారని ఉన్నతాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకత్వాలు చెప్పారు.

కానీ 2009,2018, 2024లో జరిగిన ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియార్టీ లిస్టులలో ఆనాటి ట్రిబ్యునల్ ఉత్తర్వులను పట్టించుకోకుండానే డిఎస్ సి 2002 నూతన నియామకపు వారినే సీనియర్లుగా పరిగణించి పదోన్నతులు ఇచ్చారు. ఈ విషయాన్ని పలుమార్లు బాధిత ఉపాధ్యాయులు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. దీనితో మనోవేదన గురైన కొందరు పదోన్నతులు పొందబోయే ఉపాధ్యాయులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా డీఎస్సీ 2002 వారి కంటే ముందు నోషనల్ గా సీనియార్టీని పరిగణించాలని సూచించింది. అయినను ప్రభుత్వం జాప్యం చేస్తూ నోషనల్ సీనియార్టీ ఇవ్వకపోవడంతో వీరు పదోన్నతుల్లో తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది. పదోన్నతుల విషయాల్లో కూడా నష్టాన్ని పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7000 మంది ఉపాధ్యాయులకు ఈ అన్యాయం జరుగుతుంది. కనుక ప్రభుత్వం స్పందించి డీఎస్సీ 2002 బ్యాచ్ ఉపాధ్యాయుల కంటే ముందు ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల సీనియార్టీని పరిగణించడం ద్వారా న్యాయం చేస్తూ, కోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయాలని వారు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి, కోర్టు ధిక్కారం జరుగకుండా చర్యలు తీసుకోవాలి. సర్వీసులో సీనియర్లుగా ఉన్న వారికి సహజ న్యాయం చేయాలి.



వెనిగళ్ళ సురేష్,
99595 27340
అధ్యక్షుడు, టిపిటిఎఫ్,
నిజామాబాద్ జిల్లా శాఖ

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- చిన్నా, పెద్ద తేడాలేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి
- ఇబ్రహీంపట్నం డివిజన్ టీడబ్ల్యుజేఎఫ్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు



**ఇబ్రహీంపట్నం, జూన్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో గడిచిన ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు అనేకరకాల సమస్యలతో సతమతమవుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమరాశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టిడబ్ల్యూజేఎఫ్ ఇబ్రహీంపట్నం డివిజన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య జిల్లాలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లోనే కొనసాగుతోందని, కొన్ని ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చినా జిల్లా వ్యాప్తంగా ఇవ్వాల్సి ఉందన్నారు. జర్నలిస్టులో ఇళ్ల స్థలాలతో పాటు ఇతరేతర ప్రధాన సమస్యలన్నింటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎక్కడికక్కడ ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాలపరిమితి విషయంతో పాటు విధివిధానాల రూపకల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న పెద్ద పత్రికలను తేడా లేకుండా జర్నలిస్టులందరికీ అక్రిడియేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డులను అందజేయాలని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీని వర్తింపజేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగిందని, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి జర్నలిస్టులందరికీ ఫీజు రాయితీ లెటర్లు అందజేయాలని కోరారు జిల్లా జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. జర్నలిస్టు సంక్షేమమే కేంద్రంగా ప్రస్తుత అకాడమీ పెద్దలు పనిచేయాలని కోరారు.

### నూతన కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సిలివేరు యాదగిరి, పల్నాటి జగన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పంది శ్రీను, జుబ్బూరి కుమార్, గుండె మోని శివకుమార్, సహాయ కార్యదర్శులుగా ఎర్ర లింగం, నలపరాజు సైదులు, కోశాధికారిగా ఆలంపల్లి రవీందర్, ప్రచార కమిటీ సభ్యులుగా కందుకూరి నగేష్ ఎన్నికయ్యారు. త్వరలో జరుగుతున్న జిల్లా కమిటీకి ఇబ్రహీంపట్నం ప్రాంతం నుంచి పంది వెంకటేష్ పంది క్రాంతి కుమార్, దుబ్బాక యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జోగు శ్రీనివాసులు ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ప్రతిపాదించింది. ఈ సమావేశంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు చిలువేరు సురేష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూభారతి



**చౌడాపూర్, జూన్ 3 (జనం సాక్షి) :** చౌడపూర్ మండల కేంద్రంలో మల్కాపూర్, గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో పరిగి శాసన సృభులు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని ఏం ఎల్ ఎ స్పష్టం చేశారు. ప్రస్తుతం మండలంలోని , రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 11వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, వహీదా కాతున్ నేతృత్వంలో, ప్రతి రోజు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని ఏంఎల్ఎ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహిసిల్దార్ వహీదా కాతున్ ఏంపిడిఒ సోమలింగం ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అశోక్ కుమార్,నర్సి రెడ్డి,గోపాల్ నాయక్,శేకర్ రామ్మోహన్ శర్మ,దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు తమ వంతు పాత్ర పోషించాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, జూన్ 3 (జనం సాక్షి) :** కాలనీల సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ సి బ్లాక్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్షేమ సంఘం సభ్యులు ప్రజాప్రతినిధులకు అధికారులకు మధ్య వారధిగా ఉండాలన్నారు. సంఘం సభ్యులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు రుద్ర అశోక్, వేణు యాదవ్, వడ్డెర సంఘం నాయకులు ఎత్తరి మారయ్య, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కే బాబు, నాగరాజు, వెంకటయ్య, లాలయ్య, రాజశేఖర్, రమేష్, సోమేశ్, అంజయ్య నగర్ సి బ్లాక్ నూతన కమిటీ అధ్యక్షులు ఏ గురువయ్య, ఉపాధ్యక్షులు ఎం పాండు, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, కోశాధికారి అశోక్ గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు



**చేవెళ్ల, జూన్ 3 (జనంసాక్షి) :** భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ...చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో నాలుగు మండలాల్లో 8 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా రైతుల నుంచి 332 వినతులు వచ్చాయి. వాటిలో 27 దరఖాస్తులు పరిష్కరించి అక్కడికక్కడే ప్రొసీడింగులు అందజేసినట్లు చేవెళ్ల ఆర్డిఓ చంద్రకళ తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో చేవెళ్ల తాసిల్దార్ కృష్ణయ్య నేతృత్వంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 124 వివిధ రకాల భూ సమస్యలు వచ్చాయని అందులో 4 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించిన జరిగిందని తెలిపారు. అదే విధంగా నాయబ్ తహశీల్దార్ నేతృత్వంలో మండలంలోని ముడిమ్యాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ భూసమస్యలున్న రైతుల నుంచి 43 దరఖాస్తులు స్వీకరించిన్నట్లు తెలిపారు. భూ సమస్యలపై దరఖాస్తులను ఆర్డీవో స్వీకరించారు. రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ సాధ్యం



**కాప్రా, జూన్ 3 (జనంసాక్షి) :** వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాప్రా సర్కిల్ పరిధిలోని గాంధీ కాలనీలో సర్కిల్ డిసి జగన్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తారీకు వరకు నిర్వహించే కార్యాచరణ కార్యక్రమాన్ని శానిటేషన్,ఎంటమాలజీ విభాగాల కార్మికులకు వివరిస్తూ పలు సూచనలను సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దోమల నిర్మూలన మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు నూతన కార్యాచరణ చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి సర్కిల్ డిసి జగన్ డివిజన్ వన్ కార్పొరేటర్ శివమణి స్వర్ణ రాజు సనిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్,ఎంటమాలజీ ఏఈ రమేష్ల ఆధ్వర్యంలో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. కార్యక్రమం అనంతరం గాంధీనగర్ కాలనీలలోని పలు ఇండ్లలో నీటిని నిలువలను పరిశీలించి సేకరించిన లార్వాపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెంగ్యూ,మలేరియా, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఇన్సెట్ కలెక్టర్లు, సిబ్బంది, శానిటేషన్ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు,కార్మికులు, తదితరులు పాల్గొని వన్ డే వన్ వార్డ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతును రాజు చేయడమే రేవంత్ సర్కార్ ధ్యేయం

- మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల వేణుగోపాల్



**కీసర, జూన్ 3 (జనం సాక్షి) :** విత్తన స్వయం సమృద్ధి యే లక్ష్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృత నిశ్చయంతో ప్రవేశపెట్టిందన్న మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల వేణుగోపాల్. మంగళవారం కీసర మండల కేంద్రంలో నిర్వహించిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 వేల గ్రామాల్లో ఉన్న 40 వేల మంది రైతులకు విత్తన కిట్లను గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం నాణ్యమైన విత్తనాలను అందిస్తుందని, అభ్యుదయ రైతులకు ఐదు ప్రధాన పంటలకు సంబంధించిన వరి, కంది, పెసర, మినుము, జొన్న వంటి నాణ్యమైన విత్తనాల కిట్లను పంపిణీ చేస్తుందని, రేవంత్ రెడ్డి సర్కార్ కృతనిశ్చయంతో చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రైతే రాజుగా జీవించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పాటుపడుతుండని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్, కీసర సహకార బ్యాంక్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, కీసర మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహణ అధ్యక్షులు రామిడి విజయ రెడ్డి మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తార్నాక నుండి కీసర ఓఆర్ఆర్ వరకు మెట్రో రైల్ విస్తరించాలి



**కాప్రా, జూన్ 3 (జనం సాక్షి) :** తార్నాక నుండి కీసర ఓఆర్ఆర్ వరకు మెట్రో రైలు విస్తరించాలని కాప్రా సర్కిల్ బిజెపి నాయకులు మంగళవారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తార్నాక నుండి కీసర ఓ ఆర్ ఆర్ వరకు తీవ్ర ట్రాఫిక్ తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ దారి గుండా రోజు వేలాదిమంది ప్రయాణం చేస్తూ ఉంటారు. గతంలో తార్నాక నుండి ఈసీఐఎల్ చౌరస్తా వరకు మెట్రో ప్రతిపాదన చేయడం జరిగింది.కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. ఈ విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని, ఎంపి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మెట్రో రైల్ విస్తరించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు డి. నాదం, నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం. లక్ష్మణ్ గౌడ్ తాళ్ల. ఆనంద్ గౌడ్, ఎం గణేష్ ముదిరాజ్, విద్యాసాగర్, అప్పి, బొల్లా శ్రీనివాస్, రత్తపురం వెంకటేష్, పి. రాజు, రామకృష్ణ,జహంగీర్, సాయి కిరణ్లు పాల్గొన్నారు.

# నిబంధనలమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



**మర్పల్లి, జూన్ 3 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం చేయాలి ఎంపీడీవో రాజ మల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మర్పల్లి మండలంలోని గుండ్ల మర్పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు జయమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని లేనియెడల వారికి బిల్లు మంజూరు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వాణిశ్రీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గొల్ల బీరప్ప, కుమ్మరి సిద్దయ్య, సలీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్ల రవి, విట్టల్ ,గొల్ల రాజప్ప,తదితరులు పాల్గొన్నారు.

# శివరాంపల్లి వద్ద అడ్డంగా ఉన్న ప్రహరీని తొలగించాలని వినతి



**రాజేంద్రనగర్, జూన్ 3 (జనం సాక్షి) :** శివరాంపల్లి రైల్వే ఎల్సి 8 నంబర్ వద్ద ప్రజలు ప్రయాణించే రోడ్డుకి అడ్డంగా ప్రహరీని తొలగించాలని మంగళవారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైల్వే జిఎం ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ రోడ్డుకి అడ్డంగా ప్రహరీ నిర్మించేటప్పుడు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కి స్థానిక ప్రజల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. ఈ సమస్యపై గత నెలలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కార్పొరేటర్ స్పందించి ప్రజల రవాణా సౌకర్యార్థం ఇబ్బందిగా ఉన్న ప్రహరీని తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్ యూత్ అధ్యక్షులు ఎ. రాఘవేందర్ యాదవ్ రాజేష్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, ఎ. సూర్యం, జి. రాజు, ప్రవీణ్, దుర్గేష్ లక్ష్మీ రాజ్, భూదేవి, సరిత, మహేష్, అరుణ రెడ్డి, కొంపల్లి, జగదీష్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు పరిష్కారం

- ఎమ్మార్వో రవీందర్ దత్



**శంషాబాద్, జూన్ 3 (జనంసాక్షి) :** రెవెన్యూ సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సును శంషాబాద్ మండలం ముచ్చింత ల్ గ్రామంలో రెవిన్యూ అధికారులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రవీందర్ దత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ,తమ సిబ్బందితో కలిసి ముచ్చింతల్ గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి తమ గ్రామం వద్దకే రెవెన్యూ అధికారులు వచ్చారని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో రవీందర్ దత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా ముచ్చింతల్ గ్రామంలో ఉండే భూ సమస్యలు వారసత్వం, వివిధ భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం భూభారతి 2025 చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. గ్రామంలోని భూ సమస్యలు పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూభారతి పోర్టల్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వ్యవసాయ భూముల నిర్వాహన కోసం భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్ ను మూడో తారీకు నుంచి 20 తేదీ వరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని భూసమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు అధిక ప్రాధాన్యత

- సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్ రెడ్డి



**మర్పల్లి, జూన్ 3 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసిందని సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తో కలసి రైతులకు జొన్న, కంది, జిలగ, జనము విత్తనాల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న కంది జొన్న విత్తనాలు గ్రామానికి ఒక బ్యాగ్ చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందని ప్యాకెట్ ధర 50 రూపాయల ని అదేవిధంగా జలగ 30 కేజీల బస్తా 2050 రూపాయలు, 40 కేజీల జన్మము విత్తనాల బస్తా 2500 ఉందని క్లస్టర్ కు ఒక బ్యాగ్ చొప్పున విత్తనాలు వచ్చాయని తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రం సమర్పించి సహకార సంఘంలో జిలుగ జనుము విత్తనాలను కొనుగోలు చేయవచ్చని రైతులకు పేర్కొన్నారు. కంది విత్తనాలను విత్తనోత్పత్తి కొరకు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ పసియోద్దీన్, పట్లూర్ మాజీ ఎంపీటీసీ మహేష్, ఏఈఓ నీరజ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 జూన్ 2025

# జడ్చర్లలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు

- మరో 9 రోజుల్లో ప్రారంభం కానున్న పాఠశాలలు
- కార్పొరేట్ మాయలో పడొద్దు అంటున్న విద్యావేత్తలు



**జడ్చర్ల, జూన్ 3 (జనం సాక్షి) :** కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ కోసం తెలంగాణ ప్రభుత్వం చట్టం తీసుకురావాలని జడ్చర్ల పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. జడ్చర్ల పట్టణంలో రోజు రోజుకు పుట్టగొడుగుల్లా కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయని, పట్టణంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్య వ్యాపారాన్ని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ వాసులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం చట్టం తీసుకు రాకపోతే ఫీజుల నియంత్రణ ఉండదని, ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సమస్యలను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించ వలసిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడ్డారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలలో పేద, మధ్య తరగతి పిల్లలను చదివించ డానికి లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోయారు. ఫీజులతో పాటు, పుస్తకాల వ్యాపారం, డ్రెస్సులు, షూ, టై, తదితర వాటిని ప్రైవేటు స్కూళ్లలోనే తీసుకోవాలని నిబంధనలు ఉంటున్నాయని, చాలా మంది పేదలు అప్పులు చేసి మరీ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలలో చదివి స్తున్నారని, ప్రతి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో 25 శాతం మందికి ఉచితంగా సీటు ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఏ పాఠశాల అమలు చేయడం లేదని, ప్రభుత్వాలు చట్టం తీసుకు రాకపోవడం వల్లనే ఫీజుల నియంత్రణ లేకుండా పోయిందని, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం ఎవరికి వారు అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నారని, విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వం స్పందించి ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చట్టం తీసుకురావాలని, ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో తరగతుల వారిగా ఫీజుల వివరాలు తెలిపే విధంగా బోర్డును ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మరో 9 రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ మాయలో పడి డబ్బులు వృధా చేసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

# అందరం కలిస్తేనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, జూన్ 3 (జనంసాక్షి) :** అందరం కలిసి ముందుకెళితే వనపర్తి పట్టణం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని, వనపర్తి పట్టణంలో చేపట్టే రోడ్ల విస్తరణ కు ప్రతి ఒక్కరు సహకరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు.మంగళవారం ఉదయం వనపర్తి పట్టణంలోని పానుగల్ రోడ్డులో గల 22, 23 వార్డుల లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రోడ్డు విస్తరణలో నివాసాలను కోల్పోతున్న బాధిత కుటుంబాలను నేరుగా కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు.వనపర్తి ఆర్డీఓ, తాసిల్దార్, మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో బాధితులను కలిసిన ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలోనే బాధితులకు కావలసిన వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గత బిఆరెస్ పార్టీ పాలనలో రోడ్ల విస్తరణకు అంకురార్పణ చేశారని నాడు ఎన్నో హామీలను గుప్పించి అడుగడుగునా తమను మోసం చేసి పోయారని ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారి గోడును వెళ్ళబోతున్నారు. బాధితుల నష్టాన్ని బట్టి కావలసిన పరిహారాన్ని అందించాలని వారు కోరారు. ఇప్పటికే కొంతమందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని అవి ఉపయోగానికి పనికి రాకుండా ఉన్నాయని,వాటిని సరిచేసి ఇవ్వాలని,వృద్ధులైన తమకు సెకండ్ ఫ్లోర్ థర్డ్ ఫ్లోర్లలో ఇండ్లను కేటాయిస్తే,వెళ్లలేకపోతున్నామని వారు వాపోయారు.తమకు అనుకూలమైన చోట ఇప్పించాలని వారుకు ఎమ్మెల్యేను కోరారు. బాధితుల నుంచి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు వెడల్పు చేయడం తప్పనిసరి అనీ,దానికి అందరూ సహకరించాలని, రోడ్డు వెడల్పులో ఇండ్లను కోల్పోతున్న ప్రతి ఒక్కరికి వారి వారి నష్టానికి తగినట్లుగా తగిన సహాయ సహకారాలు అందజేస్తామని, వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ మాజీ కౌన్సిలర్లు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్ కడెచూర్ పరిశ్రమల కాలుష్యం అరికట్టాలి

- అఖిల పక్షం నాయకులు



**కృష్ణ, జూన్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ సరిహద్దులోని కృష్ణ మండలం, కర్ణాటకలోని సైదాపూర్ – కడేచూర్ పరిశ్రమల కారణంగా కాలుష్యం కోరల్లో చిక్కుకుందనీ అఖిల పక్షం నాయకుడు గురుజాల్ శివరాజ్ పాటిల్ ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం అఖిల పక్షం నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివరాజ్ పాటిల్ మాట్లాడుతు పరిశ్రమల కారణంగా జల చరాలు, వ్యవసాయ భూములు తీవ్రంగా కలుషితం అవుతున్నాయని అన్నారు. కాలుష్యం అరికట్టకపోతే మండలం పరిధిలోని రానున్న రోజుల్లో సర్వనాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి నష్టం: వ్యవసాయ భూముల విలువ గణనీయంగా తగ్గిపోతోందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రదేశం నివాసయోగ్యంగా మారుతుందన్నారు. తెలంగాణపై ప్రభావం కడేచూరులోని కాలుష్యం కలిగిన నీరు మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలంలోని పలు గ్రామాలకు చేరుతోందనీ తర్వాత అది భీమా నదిలో కలుస్తోందనీ ఈ పరిణామం పక్కనున్న రాష్ట్రాలకు కూడా పర్యావరణ అత్యవసర పరిస్థితిని కలిగించవచ్చునని ఆందోళన వ్యక్తం చేశారు.భవిష్యత్ ప్రమాదాలు ఇప్పుడే చర్యలు తీసుకోక పోతే, మరో ఐదేళ్లలో: త్రాగునీరు పూర్తిగా కలుషిత మవుతుందనీ, వ్యవసాయానికి ఉపయోగించే నీరు మలినమవుతుందన్నారు. రసాయనిక పరిశ్రమలను తక్షణమే మూసివేయాలనీ, పరిశ్రమలకు ఇచ్చిన పర్యావరణ అనుమతులను రద్దు చేయాలనీ,తక్షణ కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ సమస్యపై ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి స్పందించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి తక్షణ పరిష్కారం తీసుకోవాలని కోరారు.

# డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి

- జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే గూడెం



**పటాన్‌చెరు, జూన్ 3 (జనం సాక్షి) :** బల్దియా పరిధిలోని భారతి నగర్, పటాన్చెరు, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని.. నూతన పారిశుద్ధ్య వాహనాలు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సహకారం అందించాలని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్‌ను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్‌తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మూడు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ పనులపై చర్చించారు.

పారిశుద్ధ విభాగంలో దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉద్యోగులు, చనిపోయిన వారి స్థానాల్లో నూతన ఉద్యోగులను నియమించాలని కోరారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్, వార్డ్ ఆఫీస్ నిర్మాణ పనులు చాలా రోజులుగా నిలిచిపోయాయని.. వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పూర్తయితే ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలకు ఆధునిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ హేమంత్ అతి త్వరలో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎస్ఈ శంకర్ నాయక్, డి ఈ నరేందర్, దేవేందర్, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలు లేని రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంద్ గౌడ్




**మాగనూర్, జూన్ 3 (జనం సాక్షి) :** కల్తీ విత్తనాలు లేని రాష్ట్రంగా తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం పేరున మంగళ వారం స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశానుసారం స్థానిక రైతు వేదికలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో ఎఓ సుదర్శన్ గౌడ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు నాణ్యమైన విత్తనాల ను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా 10 కేజీల వరి విత్తనాలు, 3 కేజీల కందులు మాగనూరు మండలంలో ప్రతి గ్రామానికి ముగ్గురు రైతులను ఎంపిక చేసి పంపిణీ చేశారు.ఆ రైతులు పండించిన పంటలతో రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు అందించి నకిలి విత్తనాలు లేని రాష్ట్రంగా రూపొందించడం జరుగుతుందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఓ సుదర్శన్ గౌడ్, ఎ ఈఓ లు పవన్ .రాదిక రైతులు వంశీ, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టం తో రైతుల సమస్యలు పరిష్కారం

**బిజినేపల్లి, జూన్ 3 (జనం సాక్షి) :** భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయిందని తహసిల్దార్ సిహెచ్ రవికుమార్ అన్నారు. అల్లిపూర్, ధర్మాపూర్, బోయాపూర్ గ్రామాల్లో మంగళవారం భూభారతి చట్టం రెవిన్యూ సదస్సులను నిర్వహించారు. తహసిల్దార్ సిహెచ్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి తోడ్పడతాయన్నారు. భూభారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ కీలకంగా మారిందని చెప్పారు. అన్యాయం జరిగితే ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ స్థాయిల్లోనూ అప్పిలు చేసుకునే అవకాశం భూభారతి చట్టంలో కల్పించారని వివరించారు. భూభారతి చట్టం రావడం వల్ల రైతుల సమస్యలు పరిష్కారం త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బుధవారం గంగారం గుడ్ల నర్వ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు వివరించారు. సదస్సులో పిఎసిఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, దాసర్ల సైదులు, వెంకటస్వామి రెవిన్యూ సిబ్బంది భారతి భాయ్ రేఖ తేజస్విని రాఘవేందర్ నిరంజన్ బాలరాజ్ అరుణ మాధవి రమేష్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి



**వనపర్తి బ్యూరో, జూన్ 3 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్య సంస్థలలో ఉచిత విద్యను అందించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ, డిఐఈఓ లను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ రావు, సీనియర్ పాత్రికేయులు ఊషన్న లు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ఏడాది అందించే విధంగా ఈ ఏడాది కూడా ఉచిత విద్యను అందించే విధంగా ప్రైవేట్ పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని కలిసి జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు రాయితీతో కూడిన విద్యను అందించే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. అనంతరం ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి వినోద్ కుమార్ ను కలిసి ప్రవేట్ జూనియర్ కళాశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు మన తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ బి.రాజు, వార్త స్టాఫ్ రిపోర్టర్ విజయ్, ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ టి అరుణ్ రాజ్, ఎన్టీవీ అంజి, 99 టివి వే టు న్యూస్ నరసింహ రాజ్, బిగ్ టీవీ అరుణ్,మనం డివిజన్ రిపోర్టర్ దాచ హరీష్,ఉర్దూ రిపోర్టర్ కమల్,6టివి ముక్తర్,ఎన్ ఎం టివి జియా,మన తెలంగాణ రిపోర్టర్ ,సురేష్, ఫోటో గ్రాఫర్ మహేష్ సింగ్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతిలో అధిక దిగుబడులు

- కృషి విజ్ఞాన కి కేంద్రం శాస్త్రవేత్త రవికుమార్




**చిలప్‌చెడ్, జూన్ 3 (జనంసాక్షి) :** రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తూ రసాయన మందులు వాడటం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞానక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్, ఐఐఆర్ఆర్ డాక్టర్ జేసుదాసు మాట్లాడుతూ చిలప్ చేడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం వానకాలం పంటల సాగు యాజమాన్య పద్ధతులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరిగింది. పంట సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు విత్తనాలు కొనేముందు అప్రమత్తంగా ఉండాలని, విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని చెప్పారు. డ్రోన్లతో ఎరువులు రసాయనాలు స్ప్రే చేయటం వల్ల సమయం, ఖర్చు తగ్గుతుందని సూచించారు వరిలో అధిక దిగుబడులను ఇచ్చే సన్నరకం విత్తనాలు కే ఎన్ ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, బిపిటి5904, దొడ్డు రకాలు జేజిఎల్ 24423, ఆర్ఎన్ఆర్ 28361, ఎన్ ఎం 118 రకాలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు.

# సమైక్యతా స్ఫూర్తిని కొనసాగించండి

- కల్నల్ రమేష్ సరియాల్ సూచన
- గీతంలో ముగిసిన ఎన్ సీసీ శిబిరం



**పటాన్‌చెరు, జూన్ 3 (జనంసాక్షి) :** ఎన్‌సీసీ క్యాడెట్లంతా ఐక్యత, క్రమశిక్షణతో మెలగాలని, సమైక్యతా స్ఫూర్తిని కొనసాగించాలని సంగారెడ్డిలోని 33 (టీ) బెటాలియన్ ఎన్ సీసీ క్యాంప్ కమాండెంట్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్ సరియాల్ సూచించారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గత పదిరోజులుగా నిర్వహిస్తున్న శిబిరం ముగింపు సమావేశంలో ఆయన క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిబిరం క్యాడెట్లను నిజంగా మార్చివేసిందని, వారిని బలమైన వ్యక్తిత్వంతో, లోతైన జాతీయ భావంతో సన్నద్ధం చేసిందని పేర్కొన్నారు. ఈ పది రోజుల ప్రయాణానికి ఇది ముగింపు కాదని, ఒక కొత్త ప్రారంభంగా ఆయన అభివర్ణించారు. ఐక్యత, క్రమశిక్షణ, స్థితిస్థాపకత యొక్క విలువలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దీని నిర్వహణకు ఆమోదించి, అత్యద్భుత సౌకర్యాలను కల్పించిన గీతం యాజమాన్యం, ఈ శిబిరాన్ని సజావుగా, సురక్షితంగా నిర్వహించడానికి తోడ్పడిన అసోసియేట్ ఎన్ సీసీ అధికారులు (ఏఎన్ఓలు), పీఐలు, పౌర సిబ్బందికి కల్నల్ సరియాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్య అతిథులుగా గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఏ.ఫిలిఫ్ హాజరయ్యారు. జీవితంలో క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను వర్మ నొక్కి చెబుతూ, చీమలు అనుసరించే క్రమశిక్షణ, సంఘటిత జీవనంపై ఓ కథను ఉటంకించారు. యూనిఫాం గుర్తింపునే కాకుండా, స్థితిస్థాపకత, సమగ్రత, కరుణ, క్రమశిక్షణను కూడా అలవరుస్తుందని అంబికా చెప్పారు. దాదాపు 650 మంది క్యాడెట్లు పాల్గొన్న ఈ సమగ్ర శిక్షణా శిబిరాన్ని- నాయకత్వం, క్రమశిక్షణ, వ్యక్తిత్వం, జట్టుకృషి, జాతీయ సమైక్యత యొక్క లోతైన భావాన్ని పెంపొందించేలా రూపొందించారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు యోగాతో ప్రారంభమై, శారీరక శిక్షణ, డ్రిల్ సెషన్లు, రోల్ కాల్, ఆతిథ్య ఉపన్యాసాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిసేది. ఈ ఉత్సవాలలో సుబేదార్ మేజర్ రామ్ హరి గుర్జార్, కెప్టెన్ పి.విజయ, లెఫ్టినెంట్ ఆర్.మహేందర్ రెడ్డి, లెఫ్టినెంట్ యాదగిరి, జె.శంకరయ్యతో పాటు గీతం ఎన్ సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ పది రోజుల శిబిరం కేవలం జ్ఞాపకాలను మాత్రమే కాకుండా, బలం, విశ్వాసం, దేశానికి సేవ చేయాలనే అచంచలమైన స్ఫూర్తిని నింపింది. నిర్మాణాత్మక శిక్షణ యొక్క పరివర్తన శక్తికి, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ యొక్క శాశ్వత ప్రభావానికి నిదర్శనంగా నిలిచింది.

# కరాటే ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి బ్యూరో, జూన్ 3 (జనంసాక్షి) :** కరాటే విద్యార్థుల్లో,యువతలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శ్రీరంగాపురం పోలీస్టేషన్లో హోంగార్డ్ గా పనిచేస్తున్న శ్రీనివాసులు పెబ్బేరు పట్టణ కేంద్రంలో కరాటే శిక్షణా శిబిరాన్ని నిర్వహించి స్థానిక విద్యార్థినీ, విద్యార్థులకు, కరాటేను నేర్పించారు. తను నేర్పించిన శిక్షణ శిబిరం కరాటేలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు వారి వారి స్థాయికి తగ్గట్లుగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కరాటే విద్యార్థులకు బెల్టుల, సర్టిఫికెట్స్ తెలియజేశారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ కరాటే సాధన చేయడంవల్ల విద్యార్థి యొక్క నైపుణ్యాలు మరియు జ్ఞానాన్ని వారి జీవనవిధానం పనితీరు పట్టుదలను పెంచుతాయని. కరాటే బెల్ట్ ప్రదానం ఒక ప్రేరణగా పనిచేస్తుందన్నారు. కరాటే శిక్షణ ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి సహాయపడుతుంది ఇది ఒక వ్యక్తిలో ధైర్యం ఆత్మవిశ్వాసం మరియు నమ్మకాన్ని పెంచుతుందని కరాటే మానసిక, సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచగలవని తెలియజేసారు. కరాటే శిక్షణ పొందడం ద్వారా లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ధైర్యాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. భయాన్ని నిరాశను తగ్గిస్తుందని సవాళ్ళను ఎదుర్కోవడానికి కావలసిన ధైర్యాన్ని కరాటే పెంచుతుందని వారు తెలియజేశారు. మానసిక దృఢత్వం పొందవచ్చు శరీరాన్ని బలంగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు మనసును ప్రశాంతంగా ఒత్తిడిని ఆందోళనను తగ్గించుకోవడానికి కరాటే తోడ్పడుతుందని వారు ఈ సమావేశంలో పేర్కొన్నారు. ఈ బెల్టులు కరాటేలో వారి స్థాయిని సూచిస్తాయని భవిష్యత్తుకు ప్రేరణనిస్తాయని ఈ కార్యక్రమం మా పోలీస్ డిపార్ట్ మెంట్ నుండు జరగడం గర్వంగా ఉందని కరాటే శిక్షణ ఇచ్చిన హోంగార్డ్ శ్రీనివాసులును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ విధంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కరాటే ఉచితశిక్షణ విద్యార్థిని విద్యార్థులకు నేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, క్లూస్ టీం ఎస్సై, రవి సాగర్, శిక్షణ ఎస్సైలు, వేణుగోపాల్, దివ్యా, హోంగార్డ్ శ్రీనివాసులు పోలీస్ సిబ్బంది కరాటే శిక్షణ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు

- **జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, జూన్ 3 (జనం సాక్షి):** భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఆధారంగా రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిన భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం భూపాలపల్లి మండలం, వజినేపల్లి గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సును ఆకస్మిక తనిఖీ చేసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంపై ఏప్రిల్ మాసంలో అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. అనంతరం రేగొండ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి విజ్ఞాపనలు, సలహాలు, సూచనలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ నెల 3వ తేదీ 20వ తేది వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా సదస్సుకు వచ్చిన ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ రామస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**భూ భారతి సహాయక కేంద్రం పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూ భారతి సహాయక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం పరిశీలించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో సిబ్బంది పని తీరును, ప్రజలకు అందుతున్న సేవలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 3వ తేది నుండి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు భూ సంబంధిత సమస్యలు వేగంగా పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యర్థనలను సమయానికి పరిశీలించి, సంబంధిత తహసీల్దార్ కు సిఫారసు చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు నిష్పక్షపాతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలో నమోదు అయిన ఫిర్యాదులు, వాటి పరిష్కార స్థితిని కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేసి వచ్చిన దరఖాస్తును రిజిస్టర్ లో నమోదులు చేయాలని స్పష్టం చేశారు. కార్యాలయ పని వేళల్లో ప్రజలు సహాయక కేంద్రాన్ని సందర్శించి సలహాలు, సూచనలు పొందాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు హరిహర, శ్రీనివాస్, ఈడీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.



## సంచార జాతి బిడ్డకు ప్రతిభా పురస్కారం

- **చదువుతోనే జీవితంలో వెలుగు**

**సారంగాపూర్ జూన్ 3(జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓడ్ కుల సంచారజాతి బిడ్డ చవాన్ అర్షితకు మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కార్యదర్శి సైదులు చేతుల మీదుగా హైదరాబాద్ లో మంగళవారం ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల విద్యార్థుల్లో జిల్లా తృతీయ ర్యాంకు 573 సాధించడంతో ప్రతిభా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా హర్షితకు కుటుంబ సభ్యులతో పాటు ఓడ్ కుల రాష్ట్ర సంఘం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆమెను సంఘం తరపున ప్రత్యేకంగా సత్కరించనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు.

## విద్యుద్ఘాతంతో మహిళ మృతి



**తొర్రూరు, జూ న్ 3 (జనం సాక్షి) :** తొర్రూరు పట్టణ కేంద్రంలో మున్సి పాలిటీ ఆఫీస్ వద్ద ఉన్న ఓ ఇంట్లో పని మనిషిగా (కూలీ చేస్తుండగా) బట్టలు ఉతికి ఇనుప తీగ (దండం ) పై ఆరేస్తుండగా అదే ఇనుప తీగకు ఉన్న కరెంటు సర్వీస్ వైర్ ఉండడంతో షాక్ కు గురై మండలం లోని పత్తే పురం గ్రామానికి చెందిన ఓరుగంటి శైలజ (35) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త వీరేశ్ తో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోని భర్త, పిల్లలకు తగిన న్యాయం చేయాలని మృతదేహంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. భర్త వీరేష్ ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాంజీ నాయక్ తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో సర్వీసింగ్ సెంటర్ దగ్ధం



**భీమదేవరపల్లి, జూన్ 3 (జనం సాక్షి) :** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని అనిల్ సర్వీసింగ్ సెంటర్ లో షార్ట్ సర్క్యూట్తో సోమవారం అర్ధరాత్రి చెలరేగిన మంటలతో ఎనిమిది లక్షల మీద ఆస్తి నష్టం వాటిల్లు నట్టు బాధితుడు శ్రీ రామోజ్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుచేసి బైక్ కార్ రిపేరింగ్ చేసే విధంగా ఒక సర్వీస్ సెంటర్ ను హనుమకొండ రోడ్డుకు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న తరుణంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దుకాణంలో ఉన్న కంప్రెసర్ మిషన్ సర్వీసింగ్ త్రీ ప్రెస్ మీటర్ వాకింగ్ క్లీనర్ బ్లోయర్స్ తో పాటు ఇటీవలే కొరువులు చేసిన వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయిందని కన్నీళ్ల పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## స్నేహ సంఘాల పని తీరు భేష్

- **రాష్ట్ర జెండర్ ప్రాజెక్టు డైరెక్టర్ జమున**



**చెన్నారావుపేట, జూన్ 3(జనం సాక్షి):** స్నేహ సంఘాల పని తీరు భేష్ అని రాష్ట్ర జెండర్ ప్రాజెక్టు డైరెక్టర్ జమున అన్నారు. మండలంలో నడుస్తున్న స్నేహ బాలిక సంఘాల పనితీరును పరిశీలించడానికి రాష్ట్ర ప్రాజెక్టు టీం సభ్యులు మండలంలోని జల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జండర్ ప్రాజెక్టు డైరెక్టర్ జమున, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్స్ సరిత, లింగయ్యగౌడ్, జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రేణుకా దేవిలు పర్యటించారు. స్నేహ సంఘాలు ఏర్పాటు చేసుకున్న అంశాలను, స్నేహ సంఘాల ద్వారా నేర్చుకున్న విషయాలను, పిల్లలకు ఉన్న అవగాహనను స్వయంగా పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ సంఘం ప్రతినిధులతో జండర్ టీం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను రాష్ట్ర పర్యటన బృందం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జమున మాట్లాడుతూ స్నేహ టీం ద్వారా బాలికలు నేర్చుకున్న అంశాలు, జీవితంలో ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. విద్యతో పాటు బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, న్యూట్రిషన్, ఈ క్వాలిటీ, సెక్యూరిటీ, సేఫ్టీ, మొదలగు అంశాలు ఇప్పటినుండి తెలుసుకోవడం ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడమే కాకుండా రాబోయే సమాజంలో కీలక భూమిక పోషించే నాయకులను తయారు చేసిన వారం అవుతామని తెలియజేశారు. అడిషనల్ డి ఆర్ డి ఓ రేణుక దేవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరంగల్ జిల్లాకు మాత్రమే స్నేహ సంఘాలు పైలట్ ప్రాజెక్టు గా చేపట్టే అవకాశం వచ్చిందని ఈ అవకాశాన్ని వరంగల్ జిల్లా సిబ్బంది పూర్తి స్థాయిలో కష్టపడుతూ రాష్ట్ర ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ఇంప్లిమెంటేషన్ అయ్యే విధంగా ముందుకు నడిపించడంలో సిబ్బంది కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భవాని, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు ముక్కెర ఈశ్వర్, సుధాకర్, అశోక్, సిసి మంజుల, అస్మా, పర్వీన్, స్నేహ సంఘాల బాలికలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## దున్నుకుని వాళ్లకి అన్ని హక్కులు కల్పించి పట్టాలిస్తాం

- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి , జూన్ 3 (జనం సాక్షి):** దున్నుకునే వాళ్ళకి అన్ని హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం గణపురం మండలం బుద్ధారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యపై దరఖాస్తులు ఇవ్వాలని ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా తహసీల్దార్ విచారణ నిర్వహించి పట్టా జారీ చేస్తారని తెలిపారు. తహసీల్దార్ పనిచేయకపోతే, ఆర్డిఓకు, కలెక్టర్ పిర్యాదు చేయొచ్చని, వీళ్లు కూడా పరిష్కరించకపోతే ప్రభుత్వం ఉచిత సేవలతో ల్యాండ్ ట్రిబ్యునల్ కు వెళ్లడానికి భూ భారతి చట్టంలో అవకాశం కల్పించామని అన్నారు. ప్రజలు ఇతరులకు సమాచారం అందించి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. భూ భారతిలో పట్టాలు ఇచ్చి హక్కులు కల్పిస్తా మని తెలిపారు. ప్రజలు భూ భారతి సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సర్వే నెంబర్ లో రెండెకరాల భూమి ఉంటే ఒక ఎకరం మాత్రమే నమోదు జరిగిందని మిగతాది సర్వే నంబర్లు నమోదుగాక రైతుల ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మనభూమి వేరొకళ్ళు దున్నుకుంటుంటే ఎవరికి చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఏర్పడిందని అలాంటి అలాంటి సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వం తెచ్చిన ధరణిని రద్దు చేసి భూ మాత చట్టం తెచ్చినట్లు తెలిపారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని ఏ రెవెన్యూ అధికారి దగ్గరికి వెళ్లినా పరిష్కరించలేక అనేక ప్రజలు అవస్థలు పడ్డారని అలాంటి పరిస్థితులలో రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన విధంగా ధరణి రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే పారదర్శకమైన భూ భారతి చట్టం తీసుకొస్తామని ప్రకటించారని, ప్రకటించిన ప్రకారం శాసన సభ ఆమోదం ద్వారా ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు వివరించారు. కన్నతల్లి లాంటి భూమికి పట్టాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని అలాంటి భూమిని ఈరోజు చుట్టుపక్కల రైతులతో విచారణ నిర్వహించి భూమి మోకాలో ఎవరు ఉన్నారని తెలుసుకొని ఆ భూమికి పట్టాలు చేసే అధికారం ప్రభుత్వం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఒక రూపాయి లంచం లేకుండా ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా పారదర్శకంగా పట్టాలిచ్చే కార్యక్రమం భూభారతి చట్టం ద్వారా చేపడుతున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకుని పట్టా పాసు పుస్తకాలు తీసుకొని రైతు భరోసా, రైతు బీమా, బ్యాంకు రుణాలు పొందాలని ఆయన సూచించారు. విక్రయించుకోవటానికి అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి గ్రామ పాలన అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహణకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారాం గ్రామ సభలు జరుగుతాయని స్పష్టం చేశారు. జూన్ 3 నుంచి 20 తేది వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని అన్నారు.

## హరిత వనాల పెంపకంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..**



**వరంగల్ ప్రతినిధి, జూన్ 3 (జనం సాక్షి):** హరితవనాలు పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరిగి పర్యావరణ సమతుల్యత కాపాడి జీవకోటికి మొక్కల పెంపకం దోహదపడుతుందని మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హరిత మహోత్సవం 2025 సంవత్సరాలకు సంబంధించిన జిల్లా పరిధి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద డి.ఎఫ్.ఓ అనుజ్ అగర్వాల్ పాల్గొని జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025- 2026 సంవత్సరానికి గాను లక్ష్యాలను సాధింపులపై వివిధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ వారి వారి శాఖల లక్ష్యాల సాధింపులపై కార్యాచరణ ప్రణాళికను మూడు రోజుల్లోగా తయారుచేసి నివేదికల సమర్పించవలసిందిగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. హరితవనాల పెంచడం వలన పర్యావరణ సమతుల్యతను కాపాడడం, వానలు వాపస్ వచ్చేలా చేయడం, వాతావరణంలో ప్రాణవాయువును పెంచడం, కోతులకు పక్షులకు ఆహారాన్ని సమకూర్చేలా హరితవనాలను పెంచి జీవకోటికి మనుగడకు మొక్కలు పెంచడం ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అంతరించిపోతున్న వృక్ష సంపద వలన మానవ మనుగడకే ప్రమాదమని అది గమనించి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఐదు మొక్కలు పెంచినట్లయితే ప్రాణవాయును మన చుట్టూ ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదాని గుర్తు చేశారు. 2025-2026 సంవత్సరానికి ప్రభుత్వం ఆమోదించిన వివిధ శాఖల వారీగా వన హొత్సవ మొక్కల పెంపకంకి 31,04,272, కాగా 25,51,248 లక్ష్యంగా నిర్ణయించారని, ఈ లక్ష్యాల సాధింపులపై జిల్లా అధికారులు వారి వారు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి మూడు రోజుల్లో ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా జిల్లా ఫారెస్ట్ అధికారి అనూస్ అగర్వాల్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు కొన్ని శాఖలు పూర్తి చేయలేదని, ఈ సంవత్సరం వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయవలసిందిగా సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. మొక్కలు నాటడమే లక్ష్యం కాకుండా వాటిని జియో టాకింగ్ చేసి మొక్కలు నాటిన ఫోటోలు వీడియోలు అప్లోడ్ చేస్తూ నిరంతరం పర్యవేక్షణలో మొక్కలను పెంచాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జెడి అగ్రికల్చర్ అనురాధ, డి సి ఓ నిరజతో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో కరోనా కలకలం



**వరంగల్, జూన్ 3 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లాలో కరోనా కలకలం సృష్టిస్తోంది. వరంగల్‌లో ఓ ప్రైవేటు- ఆస్పత్రిలో ఆరుగురుకి కరోనా పాజిటివ్ వచ్చినట్లు- తెలుస్తోంది. తీవ్రమైన దగ్గు, జ్వరం, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగడంతో కరోనా నిర్ధారణ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చినట్లు- తెలుస్తోంది. దీంతో వరంగల్ ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని నెటిజన్లు కోరుతున్నారు. వరంగల్‌ను కం-టైన్‌మెంట్ జోన్ ప్రకటిస్తే బాగుంటుందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

## భూభారతి సత్వర పరిష్కారం

- **ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా**



**నేరడిగొండ, జూన్ 3 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, భూ యాజమాన్య హక్కులు కాపాడటానికి, రైతులకు భూమికి సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం రోజున మండలంలోని అరెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సు మూడవ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ లో పరిష్కారం కానీ అనేక సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారి సాదా బైనమ సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరిస్తామని, ఈ నెల 20 వరకు జరిగే భూభారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి తహసిల్దార్ ఎంఏ కలిమ్ ఆర్ఐ నాగోరావు రెవెన్యూ సిబ్బంది రవీందర్ ఎంసి శంకర్ గ్రామస్తులు నాయకులు రాథోడ్ కమల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పోడు రైతుల భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలి

- **ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 3 (జనంసాక్షి) :** గిరిజన రైతులు సాగు చేసుకుంటున్నా అటవీ భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గల కలెక్టరేట్ ఎదుట గత 6 రోజులుగా ధర్నా చేస్తున్న ఆదివాసి గిరిజన సంఘాలు, రైతులకు మద్దతు తెలిపారు. జిల్లా లో గల అనేక మండలాల్లో రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నా భూములకు ప్రభుత్వం గతంలో ప్రతి రైతుకి పట్టాలు మంజూరు చేస్తామని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం గిరిజన రైతులను అటవీ అధికారులు అడ్డుకుంటూ వారి భూములను సాగు చేయకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి సైతం ప్రతి సమావేశంలో పోడు భూములు సావు చేసుకుంటున్నా రైతులకు పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు గుర్తు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆదిమ గిరిజన భూ రక్షణ పోరాట కమిటీ, రాజ్ గోండ్ సేవా సమితి, గొండ్ వాన పంచాయతీ రాయి సెంటర్ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూ భారతి నూతన రెవెన్యూ చట్టం


- **జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 03(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం - 2025, రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు నుండి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేయనైనదని జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా దంతాలపల్లి మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని అన్నారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి ఉదయం 9 నుండి 4 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) వీరబ్రహ్మాచారి కురవి మండలం తిరుమలపురం, మొగిలిచర్ల, రెవెన్యూ గ్రామాలలో జరుగుతున్న సదస్సులను పరిశీలించారు. ప్రజలకు అనువైన ప్రదేశాలు గ్రామపంచాయతీ, రైతు వేదికలు, తదితర ప్రదేశాలలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలతో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సదస్సులు నిర్వహిస్తూ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం


- **ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**



**రాయపర్తి, జూన్ 3 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. రాయపర్తి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పంపిణి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, నిరుపేద కుటుంబాలైన నిజమైన లబ్ధిదారులకు ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేసిన పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ మరికొద్ది రోజులలో తెల్ల రేషన్ కార్డులు, ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలు ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, బ్లాక్ అధ్యక్షుడు హామ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు స్థానిక ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 జూన్ 2025

# కొండమల్లేపల్లి బీజేపీలో రాజీనామాల ప్రకంపనలు



**కొండమల్లేపల్లి, జూన్ 3 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీలో కొంతమంది నాయకుల స్వార్థంతో బిజెపిను సర్వనాశనం చేస్తున్నారని పార్టీ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకుండా మమ్మల్ని అడుగడుగున అవమానిస్తూ కొంతమంది నాయకుల వర్గపోరులో మిమ్మల్ని పార్టీ నుండి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ మాజీ ఎంపిటిసి చెనగోని శివ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు బోడ అంజి యాదవ్ పార్టీ పదవులకు, బిజెపి ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామాలు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి చెనగోని శివ గౌడ్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా బిజెపి కార్యకర్తగా పనిచేస్తూ ఎన్నో అవమానాలు, బాధలు భరిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఆర్ఎస్ఎస్ హిందుత్వ వాదానికి కట్టుబడి జైలు శిక్షలు అనుభవించి బిజెపి బలోపేతానికి మా శాయశక్తులా కృషి చేశామని పార్టీ పరంగా సహాయ సహకారాలు లేకున్నా బిజెపి పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేశానన్నారు. దేవరకొండ, చింతపల్లి, పీఏ పల్లి, డిండి మండలాలకు సంబంధించిన కొంతమంది నాయకుల స్వార్థపు ఆలోచనలతో పార్టీని వర్గాలుగా విభజించి పార్టీ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకుండా మమ్మల్ని ఘోర అవమానాలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండమల్లేపల్లి మండలంలో అధికార పార్టీలకు ధీటుగా బిజెపి బలోపేతానికి గ్రామ గ్రామాన బిజెపి జెండా విస్తరించాలని పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేశామన్నారు. భారతీయ జనతా పార్టీపై మమకారం ఉన్నప్పటికీ కొంతమంది నాయకుల స్వార్థపు ఆలోచనలతో ఇష్టం లేకున్నా బలవంతంగా పార్టీ నుండి దూరం కావాల్సి వస్తోందని ఎన్నో ఏళ్లుగా భారతీయ జనతా పార్టీ జెండా మోసిన కార్యకర్తలు పార్టీ నుండి దూరమైతుంటే బిజెపి జిల్లా నాయకత్వం కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 23 ఏళ్ల పాటు పార్టీలో ఉన్న నాయకులు బిజెపి పార్టీ కోసం పని చేస్తూ జైలు శిక్షలు అనుభవించి తమ వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి పార్టీ కోసం ప్రాణాలను పణంగా పెట్టామని పార్టీని వీడుతున్నందుకు బాధ కలుగుతున్న బిజెపి రాష్ట్ర జిల్లా నాయకత్వం వెంటనే దృష్టి సారించి అవకాశవాదులను స్వార్థపరులను ఏరి పారేయాలని నిజమైన బిజెపి నాయకులను కాపాడుకుంటూ మండలంలో బిజెపి పార్టీని బలోపేతం చేయాలని బిజెపి నాయకత్వానికి సూచిస్తూ మండలంలో బిజెపి పార్టీలో మాకు సహకరించిన కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు భారతీయ జనతా పార్టీతో మాకు ఎలాంటి సంబంధాలు కానీ పార్టీలో చేరాలని ఆలోచనలు కానీ ఉండవని అన్నారు. బిజెపిలో మాకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన బాలు నాయక్



**దేవరకొండ, జూన్ 3 (జనంసాక్షి) :** దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నియోజకవర్గానికి 200కోట్ల రూపాయల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వెనుకబడిన ఎస్టీ నియోజకవర్గానికి రాజీ లేకుండా అన్ని వర్గాల్లో అభివృద్ధి పరచాలని కోరారు. వీరితోపాటు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి



**తుంగతుర్తి, జూన్ 3 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నందలాల్ పవార్ సూచించారు.తుంగతుర్తి మండలంలోని గొట్టిపర్తి వెంపటి గ్రామాలలో ఏర్పాటుచేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్లను మంగళవారం కలెక్టర్ తేజస్ ఆకస్మికంగా పరిశీలించి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా ధాన్యం కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. కలెక్టర్ వెంట డిఆర్డిఓపిడి వీవీ అప్పారావు, ఆర్డీఓ వేణుమాధవ్, డిఎస్ఓ రాజేశ్వరరావు, తహసిల్దార్ దయానంద్, ఎంపీడీవో శేష్ కుమార్,ఐకెపి సిబ్బంది ఉన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**దేవరకొండ, జూన్ 3 (జనం సాక్షి) :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్డీఓ ఎస్ రమణారెడ్డి తెలిపారు. రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని ఆర్డీవో సూచించారు.

## మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్



**ఖమ్మం, జూన్ 3 (జనంసాక్షి) :** బక్రీద్ పండుగ పర్వదినాలను శాంతియుత వాతావరణంలో కులమతాలకు అతీతంగా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ..ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలోన సీక్వెల్ ఫంక్షన్ హాల్ లో పీస్ కమిటీ సభ్యులతో మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వివిధ మత పెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించి పోలీసు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యకు తమవంతు సహకాహరం అందజేస్తామని అన్నారు. సమావేశంలో ఏసీపీ రమణమూర్తి, సిఐలు కరుణకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా సీపీఐ జెండా

- సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి



**దేవరకొండ, జూన్ 3 (జనం సాక్షి) :** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ జెండా నిలబడి పోరాడుతుందని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం గొట్టుముక్కల లో జరిగిన సీపీఐ దేవరకొండ మండల 14వ మహాసభ లో ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య,ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, మండల కార్యదర్శి దేపా సుదర్శన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**తుంగతుర్తి, జూన్ 3 (జనం సాక్షి) :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో వేణు మాధవ్ సూచించారు. మండల పరిధిలోని గానుగబండ, కేశవపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆర్డీవో పాల్గొనీ రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని ఆర్డీవో స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి



**పెన్‌పహాడ్, జూన్ 3 (జనం సాక్షి) :** భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తుందని కావున రైతులు ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ లాలు నాయక్ సూచించారు. మండల పరిధిలోని మాచారం, నాగులపహాడ్ గ్రామాలలో మంగళవారం తహసిల్దార్ లాలు నాయక్ పర్యవేక్షణలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, ప్రజలు తమ యొక్క భూ సమస్యల పరిష్కారానికై దరఖాస్తులు సమర్పించారు. తహసిల్దార్ మాట్లాడుతూ నాగులపహాడ్ గ్రామంలో మొత్తం 26 దరఖాస్తులు అందగా వాటిలో మిస్సింగ్ సర్వేనెంబర్ కు సంబంధించినవి 5, సాదా పేపర్ అప్లికేషన్లు 21 అందాయని తెలిపారు. అదేవిధంగా మాచారం గ్రామంలో మొత్తం 93 అప్లికేషన్లు స్వీకరించామని వాటిలో సర్వే నంబర్లు మిస్సింగ్ సర్వే నెంబర్ కు సంబంధించినవి 24, సాదా పేపర్ దరఖాస్తులు 49, అసైన్డ్ ల్యాండ్ అప్లికేషన్లు 17, పరిధి దిద్దుబాటు అప్లికేషన్లు 03 ఉన్నాయని వీటన్నిటిని పరిశీలించి పరిష్కరిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాధారెడ్డి, ఎంఆర్ఐ రంజిత్ రెడ్డి, ఎంపీఎస్ఓ బి. నవీన్, జూనియర్ అసిస్టెంట్ లు షేక్ నజీర్, ఎస్. పుష్పలత, రికార్డు అసిస్టెంట్ మామిడి సైదులు, ఆపరేటర్ ఎస్.కె సలీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశ చరిత్రలో అరుదైన చట్టం భూభారతి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**మధిర, జూన్ 3 (జనం సాక్షి) :** దేశ చరిత్రలో అరుదైన చట్టం భూభారతి.. రైతుల భూములు సర్వే చేయించి సంపూర్ణంగా సరిహద్దులు గుర్తించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ఈ చట్టం లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గం ములుగుమాడులో భూభారతి చట్టం కింద పైలెట్ సర్వే ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ రైతాంగం ఎదురుకుంటున్న సమస్యలకి భూభారతి చట్టం ద్వారా శాశ్వత పరిష్కారం చూపిస్తాం అన్నారు. ఇప్పటివరకు రైతులు తమ భూ సమస్యల కోసం రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు ఇకపై ఆ పరిస్థితి ఉండదు అని భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి భారీ సభలు నిర్వహిస్తూ మరోవైపు సిఎల్పీ నేతగా తాను పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా చెప్పినట్టుగా ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో వేసాం, ప్రజలకు అనువైన చట్టాన్ని తీసుకువచ్చా అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, జిల్లా వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, పలువురు ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 3 (జనంసాక్షి) :** సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు, వైద్యాధికారులు, ఉప జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు.జిల్లాలో ఎక్కడ కూడా డెంగ్యూ, చికెన్ గునియా, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల వంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కోటిరత్నం, కోదాడ డిప్యూటీ డిఎంహెచ్ఓ జయమానూరి, డాక్టర్ నాజియా, డాక్టర్ శ్రీశైలం, వైద్య అధికారులు, ఆర్ బిఎస్ కె సిబ్బంది, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

- భూభారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే జారే



**అశ్వరావుపేట (చంద్రుగొండ), జూన్ 3 (జనం సాక్షి) :** మొదటి విడతలో అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది ఈ కార్యక్రమానికి అశ్వరావుపేట ఎమ్మెల్యే జర ఆదినారాయణ పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. భూభారతి నూతన రవి రెవిన్యూ చట్టం అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ఆదినారాయణ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ధరణి వ్యవస్థ వల్ల అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డ వారికి భూభారతి ఒక వరం అని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్లు హక్కుల నిర్ధారణ రికార్డుల నిర్వహణ బట్టి కీలక అంశాల్లో రైతులకు స్పష్టత లేకపోవడంతో పలు ఇబ్బందులు గురయ్యారని ఈ సమస్యలకు పరిష్కారమే భూభారతి చట్టం అని తెలిపారు. భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వీటిని ప్రతి ఒక్కరు వినియోగించుకొని తమ సమస్యల పరిష్కారానికి భూభారతిని వినియోగించుకోవాలన్నారు. చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఆయా గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు అందజేశారు. గ్రామపంచాయతీలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, తుమ్మలపల్లి సురేష్ ,చిన్నంశెట్టి మహేష్, ఇస్లావత్ రుక్మిణి ,బడుగు శంకర్ చాపల మడుగు నోహర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని 32 గ్రామాల్లో మొదలైన రెవెన్యూ గ్రామసభలు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 3 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025 రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుండి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి, భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గరిడేపల్లి మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు రెవెన్యూ గ్రామాలలో ముందుగా ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపరచడం జరుగుతుందని తెలిపారు.మంగళవారం జిల్లాలోని తిరుమలగిరి మండలంలో గల జలాల్ పురం గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు.సదస్సులో దరఖాస్తులు స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సదస్సులో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చామంతి, డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, ఆర్డీఓ వేణుమాధవ్, డిపిఓ యాదయ్య, తహసిల్దార్ హరిప్రసాద్ , ఆర్ఐ జాజిరెడ్డి ,జూనియర్ అసిస్టెంట్ అనిత, అజయ్, వినోద్,శ్రీశైలం, సిబ్బంది పాల్గొన్నారు.

## తలసేమియా బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



**ఖమ్మం టౌన్, జూన్ 3 (జనంసాక్షి) :** నిత్యం నెత్తుటి యుద్ధం చేస్తున్న చిన్నారులకు సకాలంలో రక్తం అందించి ఆదుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 6 వ తేదీ న తన పుట్టినరోజు సందర్భంగా తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరాన్ని ఖమ్మం వీడియోస్ కాలనీలోని శ్రీబాలాజీ ఎస్టేట్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల సేమియా వ్యాధికి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గం అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ పిల్లలు తల సేమియా బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 500 యూనిట్ల రక్తం సేకరించి తలసేమియా పిల్లలకు అందిస్తామన్నారు.. అందరూ విధిగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. శ్రీ బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న జరిగే రక్తదాన శిబిరానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

## డిప్యూటీ సీఎం బట్టి చొరవతో చింతకానికి బస్సు సౌకర్యం

- ప్రారంభించిన తహసీల్దార్ కూరపాటి అనంతరాజు




**చింతకాని, జూన్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చొరవతో ఖమ్మం నుండి చింతకాని మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించడం తో మంగళవారం జెండా ఊపి బస్సును ప్రారంభించడం జరిగిందని తాసిల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు. భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చింతకాని నుండి ఖమ్మం కు వెళ్లాలంటే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతూ ఉన్న విషయం డిప్యూటీ సీఎం దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆర్ఎం తో మాట్లాడి ఫోన్ కాల్ తో బస్సుని ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు బస్సుతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా ప్రయాణం చేయొచ్చని దేనికి మహిళలకి సువర్ణ అవకాశాలు పెంచడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో చింతకాని ఎస్ఐ షేక్ నాగుల మీరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడిపల్లి భాస్కరరావు ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు కన్నెబోయిన గోపి కూరపాటి కిషోర్ ఓర్సు.వీరభద్రం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ పాషా కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున్ దేవాలయం కమిటీ చైర్మన్ ఎడ్లపల్లి శ్రీనివాసరావు మండల కాంగ్రెస్ నాయకులు ఓర్సు వీరభద్రం సిపిఐ నాయకులు జమ్మల జితేందర్ రెడ్డి షేక్ మజీద్, కాసిం తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## టాటా హారియర్ ఈవీ విడుదల..!

**ఒక్కసారి ఛార్జి చేస్తే 627 కిలోమీటర్ల ప్రయాణం**



టాటా మోటార్స్ తన ఫ్లాగ్‌షిప్ కార్లలో ఒకటైన హారియర్‌లో విద్యుత్తు వేరియం ట్‌ను మంగళవారం భారత మార్కెట్లోకి లాంచ్ చేసింది. ఇప్పటికే సోషల్ మీడియా లో విడుదల చేసిన కారు లుక్స్ ఆ టోమొబైల్ ప్రియులను ఆకర్షించాయి. విలాసవంతమైన పవర్‌ఫుల్ కార్లలో లభించే పలు ఫీచర్లను వినియోగదారులకు టాటా ఈవీ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాలుగు వర్ణాల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. వాటిల్లో ఎంపవర్డ్ ఆక్సైడ్, నైనిటాల్ నక్టర్న్, ప్రిస్టైన్ వైట్, ప్యూర్ గ్రే ఉన్నాయి. ఇక పూర్తిగా నలుపు రంగులోని స్టెల్త్ ఎడిషన్ కూడా టాటా విక్రయించనుంది. దీని బ్యాటరీ ప్యాక్‌కు లైఫ్‌టైమ్ వారెంటీ ఉందని టాటా పేర్కొంది. ఈ కారు ఎక్స్ షోరూమ్ ప్రారంభ మోడల్ ధర రూ. 21.49 లక్షలుగా ప్రకటించింది. ఈ కారు బుకింగ్స్ జులై 2వ తేదీ నుంచి మొదలు పెట్టనున్నట్లు టాటా ప్రతినిధులు తెలిపారు. టాటా హారియర్ ఈవీ 0–100 స్పీడును కేవలం 6.3 సెకన్లలో అందుకొని ఈ శ్రేణిలో వేగవంతమైన ఈవీగా నిలిచింది. డ్రిఫ్ట్, బూస్ట్ మోడ్‌లో డ్యూయల్ మోటార్ క్యూడబ్ల్యూడీ (క్వాడ్ వీల్ డ్రైవ్) నాలుగు చక్రాలకు శక్తిని సరఫరా చేస్తుంది. ఇక డ్రైవింగ్‌లో శాండ్, రాక్ క్రాల్, బూస్ట్‌మోడ్, ట్రాన్స్‌పరెంట్ మోడ్, ఆఫ్ రోడ్ అసిస్ట్ వంటివి ఆరు రకాల మోడ్‌లు ఉన్నాయి. ముఖ్యంగా ట్రాన్స్‌పరెంట్ మోడ్‌లో వాహనం కింద రోడ్డును నేరుగా స్క్రీన్‌లో వీక్షించే అవకాశం ఉంది. ఇది ఆఫ్‌రోడ్ ప్రయాణాలకు బాగా ఉపయోగపడుతుంది. ఒక కారులో నుంచి మరో కారుకు ఛార్జింగ్ చేసుకొనే అవకాశం దీనిలో ఉంది. హారియర్ ఈవీని ఒక్కసారి ఛార్జి చేస్తే 627 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఎంఐడీసీ సర్టిఫై చేసింది. సుదూర ప్రయాణాలకు ఇది అనుకూలంగా ఉంటుంది. దీనిని ఫాస్ట్ ఛార్జింగ్‌లో పెడితే కేవలం 15 నిమిషాల్లో 250 కిలోమీటర్లు ప్రయాణానికి సరిపడేలా బ్యాటరీ సిద్ధమవుతుంది. దీనిలో మాప్లస్ ఆటోఈవీ ఇంటిగ్రేషన్తో డ్రైవర్‌కు సమీపంలోని ఛార్జర్స్ తెలుస్తాయి. ఈ ఎస్‌యూవీలో తొలిసారి 14.5 అంగుళాల శామ్‌సంగ్ నియో క్యూఎల్ఈడీ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అమర్చారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

## ఆల్‌టైం గరిష్ఠాన్ని తాకిన బ్యాంక్ నిఫ్టీ..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఆరంభంలోనే తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. దీంతో ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు.. చివరకు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,492.50 పాయింట్ల (క్రితం ముగింపు 81,373.75) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ ఇంట్రాడేలో 81,774.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రధాన షేర్లలో అమ్మకాలతో డీలా పడిన సూచీ 80,575.09 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 636 పాయింట్ల నష్టంతో 80,737 వద్ద ముగిసింది. నిఫ్టీ 174 పాయింట్ల నష్టంతో 24,542.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, బజాజ్‌ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఇండస్ఇండ్ బ్యాంక్, టీసీఎస్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎంఅండ్ఎం షేరు మాత్రమే లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.56 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,355 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ఆల్‌టైం గరిష్ఠానికి బ్యాంక్ నిఫ్టీ:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రధాన షేర్లు రాణించడంతో బ్యాంక్ నిఫ్టీ ఆల్ టైం గరిష్ఠాన్ని తాకింది. ఉదయం 9:30 గంటల సమయంలో 56,161.40 వద్ద తాజా రికార్డును నెలకొల్పింది. తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో నష్టాల్లోకి జారుకుంది.

**కారణాలు ఇవే..:** కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థాగత మదుపర్లు గత రెండు ట్రేడింగ్ సెషన్ల నుంచి వరుసగా అమ్మకాలకు దిగారు. సోమవారం రూ. 2,589 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇది స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి పెంచింది. అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 0.57 శాతం పెరిగి 65 డాలర్లకు చేరింది. ఒపెక్ం దేశాల నుంచి ఊహించిన దానికంటే తక్కువ ఉత్పత్తి నమోదు కావడం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ ఆందోళనలు.. వంటివి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీకి సంబంధించిన నిర్ణయాలు జూన్ 6న వెలువడనున్నాయి. గత రెండు సమావేశాల్లో రెపో రేటును ఆర్‌బీఐ తగ్గించింది. మరోసారి కూడా ఈ రేట్లు తగ్గనున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ ద్రవ్యోల్బణంపై ఆందోళనలు నెలకొన్నాయి.

## యూపీఐ లావాదేవీల రికార్డ్

**మే నెలలో రూ. 25.14 లక్షల కోట్లు**

న్యూఢిల్లీ: పేద, ధనిక తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ అత్యంత చేరువైన యూపీఐ లావాదేవీలు గత నెలలో సరికొత్త రికార్డ్ నెలకొల్పాయి. మే నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ. 25.14 లక్షల కోట్లను తాకింది. 2024 మే నెలలో నమోదైన రూ. 20.44 లక్షల కోట్ల విలువైన లావాదేవీలతో పోలిస్తే వార్షికంగా 23 శాతం వృద్ధి నమోదైంది. అంతక్రితం నెల అంటే ఈ ఏప్రిల్‌లో నమోదైన రూ. 23.94 లక్షల కోట్లతో చూసినా వీటి విలువ 5 శాతం ఎగసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరే షన్ (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన తాజా గణాంకాలివి. పరిమాణంలోనూ లావాదేవీల సంఖ్య 1,789.3 కోట్ల నుంచి 1,867.7 కోట్లకు పెరిగింది. కాగా.. రోజువారీ లావాదేవీల విలువ ఈ ఏప్రిల్‌తో చూస్తే రూ. 79,831 కోట్ల నుంచి రూ. 81,106 కోట్లకు బలపడింది.




## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.25
వరంగల్ ₹ 5.27

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 90,800 (22 క్యారెట్లు)
₹ 99,060 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,11,100

## కైనెటిక్ ఎలక్ట్రిక్ టూ-వీలర్ బిజినెస్ ప్రెసిడెంట్‌గా వాసుదేవన్

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ 'కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ %ఢ% పవర్ సొల్యూషన్స్' ఈ రోజు(మంగళవారం) తన ఎలక్ట్రిక్ ద్విచక్ర వ్యాపారానికి అధ్యక్షుడిగా జయప్రదీప్ వాసుదేవన్ నియామకాన్ని ప్రకటించింది. 25 సంవత్సరాలకు పైగా ఆటోమొబైల్ పరిశ్రమలో అనుభవజ్ఞుడైన 'వాసుదేవన్', ద్విచక్ర వాహన వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి సిద్ధంగా ఉన్న కీలకమైన సమయంలో బోర్డులోకి వస్తున్నారని కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ సంస్థ తెలిపింది. ఈ ఏడాది చివర్లో విడుదల కానున్న హై పవర్ ఎలక్ట్రిక్ స్కూటర్‌తో సహా రాబోయే అనేక ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్ వ్యూహానికి 'వాసుదేవన్' నాయకత్వం వహిస్తారని కంపెనీ తెలిపింది. కైనెటిక్ గ్రీన్‌కు సంబంధించిన %జు–ాబఋ%, దాని ప్రస్తుత శ్రేణిలోని ఇతర ద్విచక్ర వాహన ఉత్పత్తుల అమ్మకాలు, డీలర్‌షిప్ నెట్‌వర్క్ విస్తరణపై ఆయన దృష్టి పెడతారని కంపెనీ వర్గాలు తెలిపాయి. కైనెటిక్ గ్రీన్‌లో చేరడానికి ముందు 'వాసుదేవన్'..రాయల్ ఎన్‌ఫీల్డ్, హిందుస్తాన్ మోటార్స్, %ూఖీజు% వంటి ప్రముఖ పేరొందిన కంపెనీలతో సంబంధాలు కలిగి ఉన్నారు.



## మైక్రోసాఫ్ట్‌లో లేఆఫ్‌లు


**300 మందికి జాబ్‌కట్ చేసిన సంస్థ**

ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ మైక్రోసాఫ్ట్ తాజాగా 300 మంది ఉద్యోగులకు లేఆఫ్స్? ప్రకటించినట్లు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. మే నెలలో దాదాపు 6,000 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలిపిన కొన్ని రోజుల్లోనే ఇలా మరో 300 మంది ఉద్యోగాలు కట్ చేయడం ఆందోళన కలిగిస్తుంది. ఈ తొలగింపులు సంస్థ విస్తృత సంస్థాగత పునర్నిర్మాణానికి అనుగుణంగా ఉన్నాయని కంపెనీ తెలిపినట్లు బ్లూమ్‌బర్గ్ చెప్పింది. ఈ లేఆఫ్స్ ద్వారా కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, దీర్ఘకాలిక ప్రాధాన్యతలపై వనరులను కేంద్రీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఇటీవల టౌన్‌హాల్‌లో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ఉద్యోగుల తొలగింపులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ లేఆఫ్స్ పనితీరుకు సంబంధించినవి కావని, వ్యూహాత్మక మార్పులో భాగంగా ఉన్నాయని తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాలను మైక్రోసాఫ్ట్ వేగంగా విస్తరిస్తోంది. దాంతో ఏఐ మౌలిక సదుపాయాలు, దాని అభివృద్ధి కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వివిధ ప్రాజెక్ట్‌ల్లో దాదాపు 30% కోడ్ రాయడానికి సహాయపడుతుందని సత్య నాదెళ్ల చెప్పారు. ఇది ఆటోమేషన్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌పై అధికంగా ఆధారపడడాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు.

ఉద్యోగులపై ప్రభావం

మైక్రోసాఫ్ట్ తాజాగా ప్రకటించిన లేఆఫ్స్‌లో ఏ కేటగిరీ ఉద్యోగులను తొలగించిందో పేర్కొననప్పటికీ, మునుపటి తొలగింపులో ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లను లక్ష్యంగా చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడంలో ఏఐ అసిస్టెడ్ కోడింగ్ టూల్స్‌ను మైక్రోసాఫ్ట్, మెటా ప్లాట్‌ఫామ్స్‌తో సహా ఇతర సంస్థలు ఎంచుకుంటున్నాయి.

# పెయింటర్ల పనితనానికి గుర్తింపు




ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ అకాడమీ ద్వారా శిక్షణ 'కామ్యాబీ కే రంగ్' సీజన్ 6లో మెరిసిన వైజాగ్‌కు చెందిన గణిరాజు సిరిపురం ప్రతి మనిషి తన జీవితాన్ని రంగులమయం చేసుకోవాలనుకుంటారు. అందుకు సరైన అవకాశం రావాలి. అయితే అలాంటి అవకాశాలు వాటంతటవే వస్తాయని కూర్చుంటే మాత్రం ఎప్పటికీ విజయం వరించదు. జీవితంలో కెరియర్ పరంగా ఎదిగేందుకు వచ్చే ప్రతి మలుపును అవకాశంగా మలుచుకోవాల్సిందే. వివిధ రంగులను కలబోసి ప్రత్యేక రంగులు సృష్టించేవారికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. అందుకు కొన్ని కంపెనీలు ప్రత్యేకంగా పెయింటర్లకు శిక్షణ ఇస్తున్నాయి. వాటిని తన జీవితంలో ఎదిగేందుకు అవకాశంగా మలుచుకున్నవారిలో విశాఖపట్నానికి చెందిన గణిరాజు సిరిపురం ఉన్నారు. అందుకు ప్రముఖ పెయింట్ కంపెనీ ఏషియన్ పెయింట్స్ అందించిన ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ అకాడమీ ద్వారా చాలా మందికి శిక్షణ ఇస్తోంది. ఇందులో రంగుల కలయికతో ప్రదేశానికి తగినట్లుగా, కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఎలాంటి రంగులు తయారు చేయాలో, ఎలాంటి డిజైన్‌లను ఇష్టపడుతున్నారో వంటి అంశాలను తెలియజేస్తూ ఇంటీరియర్ డిజైన్ కన్సల్టెన్సీ (ఐడీసీ) వంటి ఆధునిక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో గణిరాజు సిరిపురం 'కామ్యాబీ కే రంగ్' సీజన్ 6లో ప్రతిభ కనబరిచారు.

పాఠాలు నేర్చుకున్నారు.. జీవితాలు మార్చుకున్నారు..గణిరాజు ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కంపెనీ తెలిపింది. ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ అకాడమీ ద్వారా పాఠాలు నేర్చుకొని తమ జీవితాలను మార్చుకున్న కాంట్రాక్టర్ల స్ఫూర్తిదాయక కథలు ఎన్నో ఉన్నాయని చెప్పింది. సీజన్ 6లో గణిరాజు ప్రతిభ కనబరిచినట్లు తెలిపింది. ఇప్పటివరకు వివిధ సీజన్‌ల్లో ఢిల్లీకి చెందిన జునైద్ కాజ్మీ, గుజరాత్‌లోని మధపార్‌కు చెందిన అమృత్ బెన్, వారణాసి నుంచి బంటి బింద్ ముందువరుసలో ఉన్నారని చెప్పింది. ఏషియన్ పెయింట్స్ ప్లాట్‌ఫాం ద్వారా సంస్థ లక్షల మందికి ప్రేరణ ఇస్తుందని కంపెనీ తెలిపింది. వారిలో విశాఖపట్నంకు చెందిన గణిరాజు సిరిపురం ఒకరు. పట్టుదలతో తన జీవితాన్ని విజయగాథగా మార్చుకున్న ఆయనకు చిన్నప్పటి నుంచి చదువుపై మక్కువ ఎక్కువ. కానీ పేదరికంలో ఉన్న తన కుటుంబాన్ని పోషించడానికి బాధపడుతున్న తండ్రిని చూసి తన కలలను పక్కన పెట్టారు. కుటుంబాన్ని ఆదుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారు. దాంతో కుటుంబ పోషణ కోసం పెయింటింగ్ వేసేవారు. ఈ క్రమంలో వైవిధ్యంగా పెయింటింగ్ వేస్తూ తానకంటూ ప్రత్యేకంగా గుర్తింపు పొందారు.

పని పట్ల గౌరవం.. జీవితంపై స్పష్టత..: కాలక్రమేణా కస్టమర్ల అంచనాలు పెరుగుతున్న కొద్దీ తనను తాను మెరుగుపరచుకోవాలన్న ఆలోచనలో పడ్డారు. ఆ సమయంలో ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ అకాడమీ గురించి తెలుసుకున్నారు. ఈ ప్లాట్‌ఫాం ద్వారా ఇంటీరియర్ డిజైన్ కన్సల్టెన్సీ (ఐడీసీ) వంటి ఆధునిక శిక్షణ పొందారు. ఈ శిక్షణతో తనలో ఆత్మవిశ్వాసంతో పాటు పని పట్ల గౌరవం, జీవితంపై స్పష్టత వచ్చింది. ఈ ప్రోగ్రామ్‌లో మెలకువలు నేర్చుకుని వినియోగదారుల మన్ననలు పొందుతున్నారు. ఇప్పుడు గణిరాజు కేవలం పెయింటర్ మాత్రమే కాదు. ఒక కళాకారుడిగా తన కెరియర్‌లో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం తన పనికి ఒక గుర్తింపు ఉంది. ఈ వృత్తిలో ఆయన నైపుణ్యం కలిగిన వ్యక్తిగా స్థిరపడ్డారు. సరైన అవకాశం దొరికితే ఎటువంటి కష్టం వచ్చినా జీవితాన్ని రంగులమయం చేసుకోవచ్చని తన కథ చెబుతోంది.

ఎంతో మందికి స్ఫూర్తిదాయకం

ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ సింగిల్ మాట్లాడుతూ 'కామ్యాబీ కే రంగ్ అనేది సాధారణ క్యాంపెయిన్ మాత్రమే కాదు. వ్యక్తుల విజయాలను స్మరించుకునే ఒక ఉత్సవం. సాధారణ జీవితం సాగించే పెయింటర్లు కంపెనీ ప్రోగ్రామ్ ద్వారా సమాజంలో ఎదగడం చూస్తున్నాం. ఈ ప్రయాణం మాకు ఎంతో స్ఫూర్తిదాయకం. ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ అకాడమీ దేశవ్యాప్తంగా దాదాపు తొమ్మిది లక్షల మందికి శిక్షణ ఇచ్చింది. ఇప్పటివరకు 21 లక్షలకు పైగా ట్రైనింగ్ సెషన్లు నిర్వహించింది. ఈ శిక్షణలోని పెయింట్ అప్లికేషన్, వాటర్‌ప్రూఫింగ్, ఉడ్ ఫినిషెస్, మెషినరీ వాడకం, కస్టమర్ సర్వీస్ ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న 79 శాతం మంది తమ ఆదాయాన్ని పెంచుకున్నారు. 88 శాతం మంది తమ పనిలో మెరుగయ్యారు. 86 శాతం మందికి సామాజిక గౌరవం లభించింది' అన్నారు.



## వచ్చే ఐదేళ్లలో 50 ఎయిర్‌పోర్ట్‌లు ఏర్పాటు

**జనంసాక్షి:** దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేసి మొత్తం ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను 212కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం (ఐఏటీఏ) వార్షిక సమావేశంలో ఈమేరకు కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రకటన చేశారు. ఈ విస్తరణలో ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం కీలకంగా వ్యవహ రిస్తుందని నిపుణులు చెబుతున్నారు. దేశం అంతటా ప్రజలకు మరింత చౌకగా, అందుబాటు ప్రాంతాల్లో విమానప్రయాణం చేసేలా ఉడాన్ పథకం సంస్కరణలు తీసుకొస్తోంది. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి 619 కొత్త మార్గాలను నెట్‌వర్క్‌లో జోడించింది. ఇది చిన్న పట్టణాలు, నగరాలకు ప్రత్యక్ష విమాన కనెక్టివిటీని పొందేందుకు దోహదపడుతుంది. విమానాశ్ర యాల సంఖ్యను విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతోనే ఇది సాధ్య మవుతుందని మంత్రి చెప్పారు. ప్యాసింజర్ కనెక్టివిటీకి మించి భారత్ గ్లోబల్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్హాల్ (ఎంఆర్ఓ) హబ్‌గా కూడా నిలదొక్కు కుంటోంది. 2031 నాటికి ఎంఆర్ఓ విభాగం 4 బిలియన్ డాలర్లకు చేరు కుంటుందని అంచనా.

## 'మహా' నిర్ణయం

స్పందించాలనే విషయంపై వారికి అవగాహన ఉంటుందన్నారు. దీనికోసం విద్యార్థులకు మాజీ సైనికులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మాజీ సైనికులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశం పట్ల ప్రేమ పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారని విద్యాశాఖ మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అమలుచేయడానికి క్రీడా ఉపాధ్యాయులు, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ), స్కౌట్స్, గైడ్స్‌తో పాటు 2.5 లక్షల మంది రిటైర్డ్ సైనికుల సహాయం తీసుకుంటామని దాదా భూసే పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, అనంతరం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ ప్రతిపాదనను తీసుకువచ్చినట్లు తెలిపారు. పహల్గాం లోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవికంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన భారత ప్రభుత్వం ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకుంది. భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు, ఉగ్రవాద దాడులు వంటివి సంభవించినప్పుడు ప్రజలు, అధికారులు ఎలా వారి ప్రాణాలు కాపాడుకోవాలో అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ నిర్వహించింది.

# ఒక్క అనారోగ్యం ఆమె కళ్లు తెరిపించింది

**- అదే ఆమెను బతికేలా చేసింది..!**

**- ఇవాళ ఆమె లుక్ చూస్తే వహ్వా అనాల్సిందే..**



కొందరు చావు అంచులు దాక వెళ్లొచ్చి.. బతికొస్తుంటా రు. అలా ఆయురారోగ్యాలతో ఉన్నావారెందరో. ఒకరకంగా వారంతా ఆ అనారోగ్యం మేల్కొలుపుతో ఆరోగ్యవంతమైన జీవితం గడిపి స్ఫూర్తిగా నిలుస్తుంటారు. అలాంటి కోవకు చెందిందే ఈ డాక్టర్. అంతటి భయానక పరిస్థితి నుంచి బయటపడ్డ ఆమె లుక్‌ను చూస్తే కంగుతింటారు. ఈమెనే అనారోగ్యం బారినపడింది అనే సందేహం కలుగమానదు. ప్రస్తుతం ఆమె వృద్ధాప్యాన్ని తిప్పికొట్టి.. దీర్ఘాయువుతో ఎలా ఉండాలో చిట్కాలు చెబుతున్నారామె. మరీ ఆ డాక్టర్ ఆసక్తికర గాథ ఏంటో చూద్దామా..!. లండన్‌కి చెందిన 53 ఏళ్ల లైఫ్‌స్టైల్ వైద్య నిపుణురాలు డాక్టర్ అల్కా పటేల్‌ని చూస్తే 23 ఏళ్ల అమ్మాయిలా ఉంటుంది. ఆమె జీవ సంబంధమైన వయసు కేవలం 23 ఏళ్లేనని ఆమెనే స్వయంగా చెబుతున్నారు. మనలో కొందరూ ఏజ్ పరంగా చాలా పెద్దవాళ్లైన లుక్‌చూస్తే చిన్నవాళ్లలా ఉంటారు. అలా మనం కూడా ఉండొచ్చని అల్కా అంటున్నారు. మంచి ఆహారపు అలవాట్లు, సరైన జీవనశైలితో ఆరోగ్యాన్నే కాదు మన ఏజ్‌ని కూడా తగ్గించుకోవచ్చు అంటున్నారామె. ఆమె రెంబు దశాబ్దాలకు పైగా జనరల్ ప్రాక్టీషనర్ సేవలందించిన డాక్టర్ ఆమె. ఎక్కువ సమయం తన పేషెంట్ల బాగోగుల, కుటుంబ బాధ్యతలకు కేటాయించి తన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేశారామె. దాంతో సడెన్‌గా తన 39వ పుట్టనరోజున ఎడతెరగని జ్వరం బారినపడింది. సాధారణ జ్వరం కాస్త సివియర్ అయిపోయింది. నెమ్మదిగా అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. అసలు ఆమె ఏ వ్యాధితో బాధపడుతుందో వైద్యులకే అంతు చిక్కలేదు. ఇక లాభం లేదని అవయవాలు పనిచేసేలా కొన్ని శస్త్ర చికిత్సలు కూడా చేశారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆమె పరిస్థితి ఎంత ఘోరంగా అయిపోయిదంటే.. తన పిల్లలకు అమ్మగా తానేం చేయకుండానే చనిపోతాననే బెంగతో జీవచ్ఛవంలా అయిపోయింది. ఒకరకంగా ఆ అనారోగ్యం అల్కాకు తన ఆరోగ్యంపై ఫోకస్ పెట్టేలా చేసింది. ఎలాగైన తన పిల్లల కోసం ఈ అంతుచిక్కని వ్యాధిని ఎలాగైనా జయించాలనే ధైర్యాన్ని కూడగట్టుకుంది. అలా నెమ్మదిగా.. తగినంత విశ్రాంతి, పోషకాహారంపై దృష్టిపెట్టి తనను తాను బాగుచేసుకుంది. ఆ తర్వాత మరింత ఆరోగ్యంగా ఉండేలా.. వృద్ధాప్యాన్ని తిప్పికొట్టేలా ఆహారంపై ఫోకస్ పెట్టారు అలా ఆమె యవ్వనంగా మారడమే గాక పూర్తి ఆరోగ్యవంతమైన వ్యక్తిగా జీవించడం ప్రారంభించారు. ఆ అనారోగ్యమే తన కళ్లు తెరిపించిందని అంటారామె. పైగా ఇవాళ ఆమె దీర్ఘాయువు నిపుణురాలిగా సేవలందిస్తున్నారు కూడా. ఇక ఆమె ఆరోగ్యకరమైన వృద్ధాప్యాన్ని నిర్వహించడం కోసం ఆరింటిని తప్పనిసరిగా పాలోకండని సూచిస్తున్నారామె.

అవేంటంటే.. సూర్యకాంతిలో గడపటం: ప్రతిరోజు ఉదయం కనీసం ఒక్క నిమిషం సూర్యకాంతిలో గడపటం. ఓ పదిసెకన్లు కళ్లు మూసుకుని మీకోసం మీతో గడపాలట.

వాకింగ్: గుండె ఆరోగ్యం, శక్తిని పెంచడానికి ఓ 20 సెకన్ల పాటు నడవాలట. హైడ్రేటెడ్ ఉండటం: ప్రతి 30 నిమిషాలకు నీళ్లు తాగేలా శ్రద్ధ పెట్టడం

పొగడ్తలు, గర్వంగా ఫీలైన క్షణాలు: మిమ్మల్ని మెచ్చుకున్న వ్యక్తులను గుర్తుచేసుకోండి. అలాగే మీకు మద్దతు, సహాయం చేసేవారిని ప్రశంసించడం అలవాటు చేసుకోవాలట వర్కౌట్లు: శరీరంలో మంచి కదలికలు ఉండటం కోసం ఓం 50 సెకన్ల పాటు వాటికి సంబంధించిన వ్యాయామాలు చేయలట

బ్రీథింగ్ వ్యాయామాలు: నాడీ వ్యవస్థను శాంతపరిచేలా ప్రతి రోజు ఒక? గంట శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు చేయడం తదితరాలతో వ్యాయమాన్ని తిప్పికొట్టి ఆరోగ్యవంతంగానే కాకుండా నిత్య యవ్వనాన్ని సొంత చేసుకోగలమని చెబుతున్నారు డాక్టర్ అల్కా పటేల్.

## 15 రోజుల్లో వంట నూనెల ధరలు తగ్గింపు

ముడి వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు వారాల్లో రిటైల్ స్థాయిలో వంట నూనెల ధరలు 5–6 శాతం తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో దాదాపు 17 శాతం పెరిగిన వంట నూనె ధరలు ఎట్టకేలకు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఇది సింగిల్ డిజిట్‌కు చేరుకుంటుందని భావిస్తున్నట్లు ఇమామి అగ్రోటెక్ డైరెక్టర్, సీఈవో సుధాకర్ రావు దేశాయ్ తెలిపారు. తగ్గిన సుంకాల వల్ల కలిగే ప్రయోజనం మరో 15 రోజుల్లో రిటైల్ ధరల్లో ప్రతిఫలిస్తుందని భావిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లు ఇప్పటికే ధరలు తగ్గుముఖం పట్టే సంకేతాలను చూపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు తెలియజేస్తున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
4 జూన్ 2025
తెలంగాణ

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ
# ఇంచార్జి తాహసీల్దార్, డాక్యుమెంట్ రైటర్



**రాయికల్ జూన్3 (జనం సాక్షి) :** మండలంలోని సింగర్ రావు పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు...రాయికల్ పట్టణం లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించగా 10వేల రూపాయల లంచం తీసుకుంటూ ఇన్చార్జి తహసీల్దార్ జె.గణేష్ తో పాటుగా ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడినట్లు ఏసిబి డిఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని సింగర్ రావు పేట గ్రామానికి చెందిన వ్యవసాయ భూమి సర్వేనెంబర్ 991/5/1/2లో 1.025 భూమి పట్టా మార్పిడి విషయంలో బాధితుడిని 15వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం సాయంత్రం రాయికల్ పట్టణం లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల బృందం దాడులు నిర్వహించి తహసీల్దార్‌తో పాటుగా మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్‌ను అదుపులోకి తీసుకొని కరీంనగర్ లోని ఏసిబి ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచి,కేసు దర్యాప్తు కోసం తదుపరి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసిబి డిఎస్పీ వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో ప్రజలు అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 నందు, వాట్సప్ 9440446106 ద్వారా సంప్రదించాలని,బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డిఎస్పీ తెలిపారు.

## అంబేద్కర్ వర్సిటీలో ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులు

**హైదరాబాద్ :** డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ (హెచ్‌హెచ్‌సీఎమ్) కోర్సును అందించడానికి నగరానికి చెందిన మూడు విద్యాసంస్థలతో అంబేద్కర్ వర్సిటీ అవగాహహన ఒప్పందాలు కుదుర్చుకుంది. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. బీఆర్‌అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణి సమక్షంలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ విద్యాసంస్థలతో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. కార్పొరేట్ వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్న తరుణంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులో భాగంగా హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును అందించడంతో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ కోర్సులను అందించేందుకు గతంలో ఉన్న ఒప్పందాన్ని ప్రస్తుతం పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

# సహకరిస్తేనే.. సర్టిఫికెట్

- మైనర్ బాలికపై అత్యాచారయత్నం
- కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ యజమానికి దేహశుద్ధి
- పోలీసులకు బాలిక తండ్రి ఫిర్యాదు
- వికారాబాద్ పోలీస్ అదుపులో కంప్యూటర్ సెంటర్ యజమాని






వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 3 (జనం సాక్షి) : ఆడవాళ్లు అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే స్వతంత్రం వచ్చినట్లు లెక్క అన్నట్లు నాటి పెద్దల ముచ్చట.. కానీ పట్ట పగలు ఆడవాళ్లు ఒంటరిగా తిరగాల్లేరు అన్నది నేటి ముచ్చట. ఇది అక్షర సత్యం అన్నట్లు ఒక కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ యజమాని పట్టపగలే మైనర్ బాలికను పై అంతస్తులోకి పిలిచి సహకరిస్తేనే సర్టిఫికెట్ ఇస్తా అంటూ బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే వికారాబాద్ పట్టణంలో ఉన్న ఒక కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లో ఒక మైనర్ బాలిక 45 రోజుల కంప్యూటర్ శిక్షణ కోసం చేరింది. 3,500 రూపాయలు చెల్లించి రోజు కంప్యూటర్ లో శిక్షణ పొందుతుంది. దాదాపు 40 రోజులు శిక్షణ కాలం పూర్తి కావచ్చింది. శిక్షణ కోసం వచ్చిన మైనర్ బాలికపై కంప్యూటర్ సెంటర్ యజమాని నవాజ్ కన్నేశాడు. శిక్షణ పూర్తి వెళ్ళిపోయే లోపు బ్లాక్ మెయిల్ కు పాల్పడి నయానో భయానో లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. మంగళవారం యధావిధిగా కంప్యూటర్ శిక్షణ కోసం వచ్చిన మైనర్ బాలికను రెండో అంతస్తు నుంచి మూడో అంతస్తులోకి పిలిచి తనకు సహకరించి కోరిక నెరవేరుస్తూనే పూర్తి కాలం కోర్స్ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ ఇస్తానని లేకపోతే ఫెయిల్ సర్టిఫికెట్ ఇస్తానని బ్లాక్ మెయిల్ చేశాడు. మూడో అంతస్తు లో ఒంటరిగా ఉన్న మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మైనర్ బాలిక తండ్రి తమ కూతురు కంప్యూటర్ సెంటర్ కు వచ్చిందా అంటూ ఆమె స్నేహితురాలితో చరవాణిలో మాట్లాడి ఆరా తీశారు. మంగళవారం తాను క్లాసులోకి రాలేదని మైనర్ బాలిక తండ్రికి సమాచారం అందించారు. దీంతో అనుమానం వచ్చిన మైనర్ బాలిక తండ్రి కంప్యూటర్ సెంటర్ కు వచ్చి తమ కూతురు ఎక్కడని యజమానిని ప్రశ్నించారు. ఈరోజు మీ కూతురు క్లాస్ కు రాలేదని ఆటోల దగ్గరే ఏమైనా ఉండొచ్చేమో కనుక్కోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు. కంప్యూటర్ సెంటర్ యజమాని భయంతో వణికి పోవడాన్ని గమనించిన మైనర్ బాలిక బంధువులు కంప్యూటర్ యజమాని నావాజ్ కు దేహశుద్ధి చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అయినా కంప్యూటర్ యజమాని నిజం చెప్పకపోవడంతో బాలిక బంధువులు రెండో మూడో అంతస్తు లో వెతకగా ఒక గదిలో మైనర్ బాలిక రోగిస్తూ కనిపించింది. ఏం జరిగిందని బాలిక తల్లిదండ్రులు ఆరా తీయగా తాను లొంగి పోతేనే సర్టిఫికెట్ ఇస్తానని ఉద్యోగం ఇప్పిస్తానని లేకపోతే ఫెయిల్ అయినట్లు సర్టిఫికెట్ ఇస్తానని బ్లాక్ మెయిల్ పాల్పడి అత్యాచారయత్నానికి పాల్పడుతూ అసభ్యంగా ప్రవర్తించాడని తెలియజేసింది. దీంతో కుటుంబ సభ్యులు కంప్యూటర్ యజమానికి దేహశుద్ధి చేసి వికారాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కంప్యూటర్ యజమానిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా ఈ కంప్యూటర్ సెంటర్ యజమానిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా శిక్షణకు వచ్చిన బాలికలను బ్లాక్ మెయిల్ చేసి లొంగదీసుకోవడం. అసభ్యంగా ప్రవర్తించడం వంటి వికృత చేష్టలకు పాల్పడడంతో అనేకసార్లు పోలీసులకు బాలికలు ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై విచారణ జరిపారు. బాలికల పరువు దృశ్య వారి తల్లిదండ్రులు రాత ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు మందలించి వదిలివేశారు. కానీ కంప్యూటర్ యజమాని తీరు మారక మళ్ళీ బాలికలను లొంగదీసు కునే ప్రయత్నం చేసి రెడ్ అండ్‌గా పట్టుబడ్డాడు. దీంతో కంప్యూట ర్ శిక్షణ కోసం వచ్చే బాలికలు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధ్యత మైనర్ బాలిక తండ్రి పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# బక్రీద్ పండుగను శాంతియుతంగా, మత సామరస్యంతో జరుపుకోవాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 3 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగను శాంతియుతంగా మతసామరస్యంతో జరుపుకోవాలని, జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు.బక్రీద్ పండుగను శాంతియుతంగా,మత సామరస్యంతో జరుపుకోవాలని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్ కార్యాల యంలో ఈనెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్, పశుసంవర్ధక, రెవిన్యూ, రవాణా,మున్సిపల్ కమీషనర్స్ ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్‌తో కలిసి కలెక్టర్ శాంతి కమిటీ సమావేశం జరిగింది.బక్రీద్ పండుగ ఏర్పాట్ల గురించి, ప్రార్థనా స్థలాల పరిశుభ్రత, గోవుల అక్రమ రవాణాను నివారించడం, బందో బస్తు నిర్వహణ ఇతర సంబంధిత అంశాల గురించి చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా మత సామరస్యానికి చిహ్నంగా బక్రీద్ పండుగ నిర్వహించుకునేలా పటిష్ట ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నా రు. గోవుల అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీసుశాఖకు సూచించారు. గోవులను రక్షించడంలో భాగంగా పోలీస్ శాఖ వాహనాలనుసీజ్ చేసినప్పుడు గోవులను గోశాలకు తరలించినప్పుడు వాటికి ఆహారం అందించడానికి మున్సిపల్ శాఖ తరపున చర్యలు తీసుకోవాల న్నారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లకు మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు సహకారం అందించాలని తెలిపారు. ప్రార్ధనా స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని ఏదైనా చిన్న సమస్య తలెత్తినా వెంటనే పోలీసు లకు అధికారులకు తెలియజేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు ఏ వర్గానికి చెందిన వారైనా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అవసరమైతే పీడీ యాక్ట్ కూడా ప్రయోగించ డం జరుగు తుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.ఎక్కడైనా సమస్య ఉన్నట్ల యితే సంబంధిత పోలీసులకు సమాచారం అందిస్తే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామన్నారు
సోషల్ మీడియాలో వచ్చే వార్తలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే జిల్లాలో పోలీస్ అధికారులు దృష్టికి తీసుకురావాలని స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి విక్టర్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి ఆర్డీవో వీణ,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పోలీస్ యంత్రాంగం, రవాణా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణం తీసిన ఈత సరదా

## నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో ముగ్గురు యువకులు గల్లంతు

**నిజాంసాగర్ జూన్ 3 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఒక దుర్ఘటనలో ముగ్గురు యువకులు నీటిలో మునిగి గల్లంతయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్, ఎస్ఐ శివకుమార్ అందించిన వివరాల ప్రకారం, ఈ దుర్ఘటన యొక్క నేపథ్యం, కారణాలు, జరిగిన సంఘటనలు ఈ విధంగా ఉన్నాయి. సోమవారం ఉదయం, ఎల్లారెడ్డి మండలంలోని సోమార్‌పేట్ సమీపంలో పదకొండు మంది యువకులు క్రికెట్ ఆడేందుకు గుమిగూడారు. సాయంత్రం వేళకు, తీవ్రమైన ఎండవేడిమి, అలసట కారణంగా వారు సేదతీరేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌కు వెళ్లాలని నిర్ణయించారు. ఈ బ్యాక్‌వాటర్ సోమార్‌పేట్ మరియు మహమ్మద్ నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామం మధ్య ఉంది. సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగిన యువకులలో కొందరికి ఈత సరిగా రాకపోవడం, నీటి లోతును సరిగా అంచనా వేయలేకపోవడం వల్ల ఈ విషాదం సంభవించింది.

ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన మధుకర్ గౌడ్ (18), తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన నవీన్ (25), సోమార్‌పేట్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (17)నీటిలో మునిగి గల్లంతయ్యారు. మిగతా యువకులు ఒడ్డుకు దగ్గరగా స్నానం చేస్తుండగా, ఈ ముగ్గురు లోతైన ప్రాంతంలోకి వెళ్లడం వల్ల ఈ దుర్ఘటన జరిగింది. వారు నీటిలో మునిగిపోతున్నప్పుడు అరుస్తున్నా, సహాయం అందించడం సాధ్యపడలేదు. ఈ సంఘటన తర్వాత, మిగతా యువకులు గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో, వారు వెంటనే నిజాంసాగర్ మరియు ఎల్లారెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే, నిజాంసాగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సాయంత్రం 7:30 గంటల సమయంలో గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలను ప్రారంభించారు. రాత్రి చీకటి కారణంగా గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడినప్పటికీ, మంగళవారం ఉదయం మళ్లీ గాలింపు ముమ్మరంగా కొనసాగింది. ఈ క్రమంలో, మధుకర్ గౌడ్ మృతదేహం సోమవారం సాయంత్రమే లభించగా, నవీన్ మరియు హర్షవర్ధన్ మృతదేహాలు మంగళవారం ఉదయం గజ ఈతగాళ్ల ద్వారా వెలికితీయబడ్డాయి.
మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్, ఎస్ఐ శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ విషాద ఘటన స్థానిక గ్రామాలలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మృతుల కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నీటి వనరుల వద్ద భద్రతా చర్యలు లేకపోవడం, ఈత గురించి తగిన అవగాహన లేకపోవడం వంటి అంశాలు ఈ దుర్ఘటనకు కారణమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ, అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సంగీతంలో తండ్రీకూతుళ్ల గిన్నిస్ రికార్డు

**హైదరాబాద్ :** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరుణోదయ నగర్ కాలనీకి చెందిన దాసరి సురేశ్ బాబు, అతని కుమార్తె రియా రోస్లిన్ సంగీతంలో గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఆన్‌లైన్ కీబోర్డు మెలోడీ పోటీల్లో విజయం సాధించారు. ఈ పోటీలో 18 దేశాల నుంచి 1046 మంది కంటెస్టెంట్‌లు పాల్గొనగా.. దాసరి సురేశ్ బాబు, రియా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారి రిచర్డ్ స్టెన్నింగ్స్ వీరి ప్రతిభను గుర్తించారు. కాగా, సురేశ్‌బాబు ప్రస్తుతం ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగా.. రియా డాన్‌బాస్కో పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. సంగీతంపై ఆసక్తితో ఇద్దరూ హాలెల్ మ్యూజిక్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్నారు. ఈ క్రమంలోనే కీబోర్డు మెలోడీ పోటీల్లో పాల్గొని విజయం సాధించి గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో ఈ తండ్రీకూతుళ్లను బండగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కలిసి అభినందించారు. వారిని శాలువాతో సత్కరించారు.





# బోడుప్పల్ పెద్దకంచె దళితులకు న్యాయం చేయండి

- జిల్లా ఇన్చార్జీ మంత్రికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వినతి

**బోడుప్పల్-జనంసాక్షి :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దళితులకు చెందిన పెద్దకంచె భూములవిషయంలో తగిన న్యారా యాలని కోరుతూ మంగళవారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డిల తృత్వంలో రాష్ట్ర ఐటి, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. బోడుప్పల్లోని సర్వే నంబర్ 63 బై నుంచి 63 బై 25 వరకు ఉన్న 336 ఎకరాల భూమికి సంబంధించి ల్యాండ్ పుల్లింగ్ ప్రక్రియ ఆగిపోయిన విషయాన్ని మంత్రికి వివరించారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధరాబాబు హెచ్ఎండిఏ కమీషనర్కు, జిల్లా కలెక్టర్కు ఫోన్ ద్వారా పెండింగ్లో ఉన్న కోర్టు వివాదాన్ని పరిష్కరించి వెంటనే ల్యాండ్ పుల్లింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ల్యాండ్ పుల్లింగ్ విధానం ద్వారా దళితులకు ఎకరాలకు 600 గజాలు చొప్పున ఇవ్వాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా న్యాయస్థానంలో ఉన్న కేసును సత్వరమే పరిష్కరించే దిశగా స్తే వెకేట్ చేయించాలని సంబంధి అధికారులకు శ్రీధర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలంగా బోడుప్పల్ దళితులు ఎదుర్కొంటున్న పెద్దకంచె భూసమస్యను పరిష్కారం చేయాలవ్యయంతో ప్రత్యేక కృషి చేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి దళితులు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో బోడుప్ప కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు కామగల్ల నర్సింహ, చిన్నంగల కుమార్, చంటి శ్రీనివాస్, ఉప్పరి విజయ్ తదితరులు ఉన్నారు.

# దేశంలో మొట్టమొదటి కాస్మెటిక్ గైనకాలజీ విభాగం

**ఏర్పాటు చేసిన అంకుర ప్రీమియం విభాగమైన 9ఎం హాస్పిటల్**

**ఖైరతాబాద్, జూన్ 03 (జనంసాక్షి) :** సమగ్రమైన ఆసుపత్రి వాతావరణంలో భారత దేశంలో మొట్ట మొదటి పునర్నిర్మాణ, కాస్మెటిక్ గైనకాలజీ విభాగాన్ని అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ యొక్క ప్రీమియం విభాగమైన 9 ఎం హాస్పిటల్ ఏర్పాటు చేసింది. సురక్షితమైన, నొప్పిలేని, అధు నాతనమైన ఇంటిమేట్ వెల్నెస్(లైంగిక ఆరోగ్యం) పరిష్కారాల ద్వారా మహిళలకు సాధికారత కల్పిస్తుందని అంకుర, 9ఎం హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఇది మహిళల కోసం పూర్తిగా అంకితమైన సమగ్రమైన, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అని అన్నారు. నమ్మకమైన సంరక్షణ ఎలా అందించబడుతుందో పునర్నిర్వచించాలనే లక్ష్యం తో రూపొందించబడిన ఈ అత్యాధునిక విభాగం కరుణ, భద్రత, శాస్త్రీయ నైపుణ్యంపై ఆధారపడి కోతలేనట్టి, నొప్పిలేనట్టి, అత్యంత ప్రభావవంత మైన పరిష్కారాలను అందిస్తుందన్నారు. మార్గద ర్శక విభాగానికి మహిళల ఆరోగ్యం, లైంగిక ఆరో గ్య సంరక్షణలో అభిరుచి , నైపుణ్యం కలిగిన ప్రఖ్యాత సీనియర్ ప్రసూతి వైద్యులు మరియు కాస్మెటిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రతిభా నారాయణ్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు.

# రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్




**ఎడపల్లి, జూన్ 3 (జనంసాక్షి) :**
ప్రభుత్వం రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం ఎడపల్లి మండలం జంలం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల కోసం భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని అందులో భాగంగానే రైతుల సమస్యలు పరిష్కార దిశగా చేసేందుకు ప్రతీ మండలంలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సదస్సులలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను నేరుగా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్య పరిష్కారంకు చర్యలు చూపే విధంగా అధికారులు దృష్టి సారించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారుల సూచించిన తేదీలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని అందువల్ల రైతులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా తమ గ్రామంలో కేటాయించిన తేదీలలో రెవెన్యూ సదస్సులో హాజరై తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. భూ సమస్యల పరిష్కారంకు రెవెన్యూ శాఖలో ఎంతగానో దోహదపడతాయని ఈ సదస్సులో రైతులు ఇచ్చిన సమస్యకు ఎలాంటి రుసుము సైతం చెల్లించే అవకాశం ఉండదని అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల తహశీల్దార్ దత్తాత్రి, డిప్యూటీ తహశీల్దార్ అనుష, ఆర్ఐ ప్రకాష్, ఏఎస్ఓ ఆలియా, సాయిబాబా, జంలం శివారు రైతులు పాల్గొన్నారు. నేడు నిర్వహించిన రెవెన్యూ శాఖల 20 సమస్యలు పరిష్కార కోసం వచ్చినట్లు ఎడపల్లి మండలం తహశీల్దార్ దత్తాత్రి వివరించారు.

# సింగరేణి భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దాం

- అన్ని ఏరియాల్లోనూ నూతన గనుల సాధనకు ముమ్మర ప్రయత్నాలు
- ఆయా ఏరియాల ప్రస్తుత , భవిష్యత్ ప్రాజెక్టులపై జీఎంలకు సీఎండీ ఎన్.బలరామ్ సుదీర్ఘ సమీక్ష..
- కంపెనీ తొలిసారిగా కొత్తగూడెం ప్రధాన కార్యాలయం నుంచి ఒక్కో జీఎంతో ప్రత్యక్ష సమీక్ష



**గోదావరిఖని, జనంసాక్షి:**
సింగరేణి సంస్థలోని 12 ఏరియాల ప్రస్తుత గనుల పరిస్థితి, భవిష్యత్ లో చేపట్టబోయే గనుల సాధనకు అవలంబించాల్సిన కార్యాచరణపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం క్షేత్రస్థాయి లోకి వెళ్లి సమీక్షలు నిర్వహిస్తూ అధికారులు, ఉద్యోగులకు కర్తవ్య బోధచేస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ ప్రధాన కార్యాలయమైన కొత్తగూడెంలోనే ఉంటూ ఉద్యోగులందరినీ కలుస్తూ వారిలో స్ఫూర్తి నింపుతున్నారు.
ఇటీవల కంపెనీలోని మేనేజర్ స్థాయి అధికారులతో, అలాగే కంపెనీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ లైసన్ అధికారులతో, ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడిన సీఎండీ... మంగళవారం ఏరియా జీఎంలతో ఎప్పుడూ లేని విధంగా ఒక్కొక్కరితో ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహించి భవిష్యత్ పై దిశా నిర్దేశం చేశారు. ఏరియా జీఎంలతో తొలిసారిగా సుదీర్ఘంగా 10 గంటల పాటు ప్రత్యక్ష సమీక్ష నిర్వహించారు. కంపెనీ విస్తరణపై అలాగే కంపెనీ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంలో ఏరియా జీఎంలు పోషించాల్సిన పాత్రను కూలంకశంగా వివరించారు. ఆయా ఏరియాల్లో ఉన్న సమస్యలు, వాటికి సంబంధించిన పరిష్కారాలను సూచిస్తూ సమీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి సాధనలో కీలకమైన ఓవర్ బర్డెన్ తొలగింపులోనూ ఎదురయ్యే సమస్యలను తొలగించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లతోనూ అప్పటికప్పుడే మాట్లాడి వారి ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేశారు.
ఈ సందర్భంగా ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బొగ్గు నాణ్యత, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని స్పష్టం చేశారు. పనుల్లో సమర్థత ప్రదర్శించని వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
అలాగే నూతన గనులు లేకపోతే ఇల్లందు, మణుగూరు, బెల్లంపల్లి తదితర ఏరియాల భవిష్యత్ ఉండదని, ఈ నేపథ్యంలో నూతన గనుల కోసం కూడా ప్రయత్నాలు సాగించాలన్నారు. ముఖ్యంగా అటవీ అనుమతుల సాధనలో ఎలాంటి జాప్యం జరగకూడదన్నారు.
భూ గర్భ గనుల్లోనూ నష్టాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కంపెనీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శాంతిఖని, అడ్రియాలా లాంగ్ వాల్ ప్రాజెక్టులో నష్టాల నివారణకు ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు యంత్రాలతో షిఫ్ట్‌లో పూర్తి పనిగంటలు పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండే వారిని అవసరమైతే తొలగించాలని కూడా ఆయన ఆదేశించారు. గైర్హాజరు శాతాన్ని గణనీయంగా తగ్గించాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కూడా ఆయన సూచించారు. నైనీలో బొగ్గు ఉత్పత్తి పైనా ఈ సందర్భంగా సమీక్షించారు. బొగ్గు రవాణాను సాఫీగా చేయాలన్నారు. నాణ్యత పెంపుదల చర్యలో భాగంగా సత్తుపల్లి వద్ద ఒక కోల్ వాషెరీ ఏర్పాటుకు గల అవకాశాలను కూడా పరిశీలించాలని కోరారు. కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం డి.సత్యనారా యణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ మరియు పర్సనల్ కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ యస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ సి.పి.పి. ఎ.మనోహర్, ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లుపాల్గొన్నారు.

# పాకిస్తాన్ జట్టు భారత్‌కు వస్తుందా లేదా?




**హైబ్రిడ్ మోడల్:**
ఈ విధానాన్ని "హైబ్రిడ్ మోడల్" గా పిలుస్తారు. ఇది 2024-2027 కాలంలో ఇరు దేశాలు ఆతిథ్యం ఇచ్చే ఐసీసీ ఈవెంట్‌లలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌లకు వర్తిస్తుంది. గతంలో పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత జట్టు తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడినట్లుగానే, ఇప్పుడు పాకిస్తాన్ మహిళల జట్టు శ్రీలంకలో ఆడుతుంది.

మహిళల వన్డే ప్రపంచకప్ 2025కు సంబంధించిన తేదీలు, వేదికలను ఐసీసీ (అంతర్జాతీయ క్రికెట్ మండలి) తాజాగా ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ భారత్‌తో పాటు శ్రీలంకలో జరగనుంది. అయితే, రాజకీయ కారణాల వల్ల భారత్-పాకిస్తాన్ మధ్య ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో, పాకిస్తాన్ జట్టు భారత్‌కు వస్తుందా లేదా అనే ప్రశ్న తలెత్తింది. దీనిపై ఐసీసీ ఒక కీలక నిర్ణయం తీసుకోనుంది.ఇది అత్యంత ఆసక్తికరమైన, వివాదాస్పద అంశం. భారత్-పాకిస్తాన్ మధ్య ఉన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా, గతంలో ఛాంపియన్స్ ట్రోఫీ వంటి టోర్నమెంట్‌లలో కూడా ఇరుజట్ల మ్యాచ్‌లను తటస్థ వేదికలపై నిర్వహించారు. అదే విధంగా, మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో కూడా పాకిస్తాన్ జట్టుకు ఇదే వర్తిస్తుంది.పాకిస్తాన్ మ్యాచ్‌లు కొలంబోలో: ఐసీసీ, ఇరు దేశాల క్రికెట్ బోర్డుల (బీసీసీఐ, పీసీబీ) మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం, పాకిస్తాన్ జట్టు ఆడాల్సిన అన్ని లీగ్ మ్యాచ్‌లు శ్రీలంకలోని కొలంబో వేదికగా జరుగుతా యి. అంటే, పాకిస్తాన్ జట్టు భారత్‌కు పర్యటించ దు.నాకౌట్ మ్యాచ్‌ల పరిస్థితి: ఒకవేళ పాకిస్తాన్ జట్టు సెమీ-ఫైనల్స్ లేదా ఫైనల్‌కు అర్హత సాధిస్తే, ఆ మ్యాచ్‌లు కూడా కొలంబోలోనే జరుగుతాయి. మిగిలిన సెమీ-ఫైనల్ బెంగళూరులో, ఫైనల్ కూడా బెంగళూరులో జరుగుతుంది.
**టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్:** సెప్టెంబర్ 30న భారత్ ఆడనున్న తొలి మ్యాచ్ బెంగళూరులో జరుగుతుంది. సెమీ-ఫైనల్స్: మొదటి సెమీ-ఫైనల్ అక్టోబర్ 29న గువాహటి లేదా కొలంబోలో (పాకిస్తాన్ అర్హతపై ఆధారపడి) జరుగుతుంది. రెండో సెమీ-ఫైనల్ అక్టోబర్ 30న బెంగళూరులో జరుగుతుంది. నవంబర్ 2న ఫైనల్ బెంగళూరు లేదా కొలంబోలో జరుగుతుంది. మహిళల క్రికెట్‌కు ఊపునిచ్చే ఈ ప్రపంచకప్‌లో, ఇరు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు ఆటపై ప్రభావం చూపకుండా ఉండేందుకు ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక పరిష్కారంగా కనిపిస్తోంది. అభిమానులు మాత్రం ఇరుజట్ల మధ్య మైదానంలో నేరుగా పోటీని చూడాలని ఆశిస్తున్నారు.




- గతంలో నిరాశలు, ఈ సారి విజయం
- వ్యూహాత్మక ప్రక్షాళనతో టైటిల్ దిశగా
- ఆర్‌సీబీ బ్యాటింగ్, బౌలింగ్ సమతూకం
- ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్ ఓటమి
- కీలక ఆటగాళ్ల పాత్ర
- అహ్మదాబాద్‌లో ఉత్కంఠభరిత విజయం

*18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది! రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఐపీఎల్ 18వ సీజన్‌లో తొలిసారిగా టైటిల్‌ను సాధించింది. నరేంద్ర మోడీ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి, అభిమానుల నినాదం "ఈ సాలా కప్ నమ్దే"ను నిజం చేసింది. విరాట్ కోహ్లీ (43), కెప్టెన్ రజత్ పటీదార్ (26), జితేశ్ శర్మ (24), లివింగ్‌స్టోన్ (25) బ్యాటింగ్‌తో దూకుడు చేయగా, జోష్ హాజెల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, క్రునాల్ పాండ్యాల బౌలింగ్‌తో పంజాబ్ బ్యాటర్లను కట్టడి చేశారు. సమష్టి కృషితో ఆర్‌సీబీ ఈ చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది.*

# కల నిజమైంది

## 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

**మ్యాచ్ వివరాలు**
**ఆర్‌సీబీ:**
20 ఓవర్లలో 190/9 (కోహ్లీ 43, రజత్ 26 అర్ష్‌దీప్ 3/40, జెమీసన్ 3/48)
**పంజాబ్ కింగ్స్:**
20 ఓవర్లలో 184/7 (శశాంక్ 61, ఇంగ్లిస్ 39 క్రునాల్ 2/17, భువనేశ్వర్ 2/38)
18 ఏళ్ల నిరీక్షణ తర్వాత, ఆర్‌సీబీ సమష్టి కృషి, స్థిరమైన ప్రదర్శనతో టైటిల్ సాధించి, అభిమానులను ఆనందంలో ముంచెత్తింది.

ఒకటా.. రెండా.. ఏకంగా 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఎట్టకేలకు ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్, ఫాఫ్ డుప్లెసిస్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, జాక్ కలిస్, జహీర్ ఖాన్ వంటి స్టార్ ఆటగాళ్లు ఆడిన ఈ జట్టు, ఇప్పటివరకు టైటిల్ అందుకోలేక నిరాశలో మునిగింది. ప్రతి సీజన్‌లో "ఈ సాలా కప్ నమ్దే" అంటూ హుషారుగా ఊదరగొట్టిన ఆర్‌సీబీ అభిమానులు, కీలక సమయాల్లో జట్టు ఓటములతో నిరాశలో కూరుకుపోయారు. ఆర్‌సీబీ గత రికార్డు చూస్తే, మూడుసార్లు (2009, 2011, 2016) ఫైనల్‌లో, రెండుసార్లు (2015, 2022) క్వాలిఫయర్-2లో, మూడుసార్లు (2020, 2021, 2024) ఎలిమినేటర్‌లో ఓడిపోయింది. ముఖ్యంగా, 2016లో విరాట్ కోహ్లీ 973 పరుగులతో (నాలుగు సెంచరీలతో) అద్భుత ఫామ్‌లో ఉన్నప్పటికీ, టైటిల్ చేజారింది. ఆ సీజన్‌లో అభిమానుల నిరాశ అవర్ణనీయం. ఎట్టకేలకు, 18వ సీజన్‌లో ఆర్‌సీబీ తమ చిరకాల కలను నిజం చేసుకుంది. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన బాధలో ఉన్న అభిమానులకు ఈ విజయం ఆనందోత్సాహాలను అందించింది.

### వ్యూహాత్మక ప్రక్షాళనతో విజయం

ఈ సీజన్‌లో టైటిల్ సాధనే లక్ష్యంగా ఆర్‌సీబీ బృందం స్పష్టమైన ప్రణాళికతో బరిలోకి దిగింది. జట్టును సమూలంగా మార్చాలని నిర్ణయించి, వేలంలో ఆధునిక వ్యూహంతో ఆటగాళ్లను ఎంపిక చేసింది. రిటైన్ చేసిన కోహ్లీ, రజత్ పటీదార్, యశ్ దయాల్ అంచనాలను అందుకున్నారు. ఫిల్ సాల్ట్, కోహ్లీ ఓపెనింగ్‌లో మెరిశాగా, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్, లియామ్ లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ మిడిల్ ఆర్డర్‌లో రాణించారు. ఆల్‌రౌండర్లు టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్ లోయర్ ఆర్డర్‌లో దూకుడు కనబరిచారు. బౌలింగ్ విభాగంలో జోష్ హాజెల్‌వుడ్ వికెట్ల వేటలో ముందుండగా, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ అండగా నిలిచారు. స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ ప్రత్యర్థులను కట్టడి చేశారు. ఇలా, ప్రతి ఆటగాడు తమ పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించి, సమిష్టి కృషితో ఆర్‌సీబీ తమ కలను సాకారం చేసుకుంది.

### ఫైనల్‌లో పంజాబ్‌ను ఓడించి ఆర్‌సీబీ విజయం

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో, ఆర్‌సీబీ పంజాబ్ కింగ్స్‌ను ఆరు పరుగుల తేడాతో ఓడించి తొలి టైటిల్‌ను సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ 20 ఓవర్లలో 190/9 స్కోరు సాధించింది. కోహ్లీ (35 బంతుల్లో 43, 3 ఫోర్లు) నెమ్మదిగా ఆడినా, కెప్టెన్ రజత్ పటీదార్ (16 బంతుల్లో 26, 1 ఫోర్, 2 సిక్సర్లు), జితేశ్ శర్మ (10 బంతుల్లో 24, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), లివింగ్‌స్టోన్ (15 బంతుల్లో 25, 2 సిక్సర్లు) దూకుడుతో పోరాడే స్కోరును అందించారు. 191 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ 184/7 వద్ద ఆగిపోయింది. శశాంక్ సింగ్ (30 బంతుల్లో 61 నాటౌట్, 3 ఫోర్లు, 6 సిక్సర్లు), జోష్ ఇంగ్లిస్ (23 బంతుల్లో 39, 1 ఫోర్, 4 సిక్సర్లు) పోరాడినా, ఆర్‌సీబీ బౌలర్లు క్రునాల్ పాండ్యా (2/17), భువనేశ్వర్ కుమార్ (2/38) కీలక సమయంలో ఒత్తిడి సృష్టించి విజయాన్ని అందించారు.

### చెక్కు చెదరని సన్‌రైజర్స్ హైదరాబాద్ రికార్డ్!

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా నిరాశపర్చింది. డిఫెండింగ్ రన్నరప్‌గా భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే గత 9 ఏళ్లుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ అరుదైన రికార్డ్ ఒకటి చెక్కు చెదరకుండా ఉంది. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఎలిమినేటర్ మ్యాచ్ ఆడి టైటిల్ గెలిచిన ఏకైక జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది.ఐపీఎల్ 2016 సీజన్‌లో మూడో స్థానంలో నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఎలిమినేటర్‌లో కేకేఆర్‌ను ఓడించింది. క్వాలిఫయర్-1లో గుజరాత్ లయన్స్‌ను ఓడించి ఫైనల్ చేరింది. ఫైనల్లో ఆర్‌సీబీని చిత్తు చేసి టైటిల్ అందుకుంది. ఆ తర్వాత మరే జట్టు కూడా ఎలిమినేటర్ ఆడి టైటిల్ గెలవలేదు. ఈ ఏడాది ముంబై ఇండియన్స్ ఆ రికార్డ్ బ్రేక్ చేసేలా కనిపించినా.. క్వాలిఫయర్-2లోనే వెనుదిరిగింది.

## ఇంగ్లాండ్‌లో కెఎల్ రాహుల్ ఆగమనం

ఇంగ్లాండ్‌లో లయన్స్‌తో జరగనున్న రెండో అనధికారిక టెస్ట్ కోసం టీమ్ ఇండియా 'ఏ'తో చేరేందుకు కెఎల్ రాహుల్ తాజాగా అక్కడికి చేరుకున్నాడు. సీనియర్ ఆటగాళ్లైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు విరామం తీసుకోవడంతో, అనుభవజ్ఞుడైన మరియు ఆత్మవిశ్వాసం కలిగిన బ్యాట్స్‌మన్‌గా రాహుల్ జట్టులో కీలక పాత్ర పోషిస్తాడు. ముందస్తుగా ఇంగ్లాండ్‌కు చేరుకుని, రెడ్-బాల్ క్రికెట్‌కు సిద్ధమైనట్లు చాటాడు.
టీమ్ ఇండియా 'ఏ' తరఫున ఆడాలనే స్పష్టమైన లక్ష్యంతో, రాహుల్ స్వయంగా బీసీసీఐని కోరి, ఈ మ్యాచ్‌కు ఎంపిక చేయమని విజ్ఞప్తి చేశాడు. బోర్డు వెంటనే ఆమోదించింది. తెల్లని క్రికెట్ కిట్‌లో ఇంగ్లాండ్ గడ్డపై అడుగుపెట్టిన రాహుల్, అభిమానులను ఉత్సాహంతో నింపాడు.
జూన్ 6న నార్తాంప్టన్ కౌంటీ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యే నాలుగు రోజుల టెస్టులో రాహుల్ ఇండియా 'ఏ' తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్ అతనికి ప్రాక్టీస్‌తో పాటు, రానున్న ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు ఇంగ్లాండ్ స్వింగింగ్ పిచ్‌లపై పట్టు సాధించే అవకాశం. ఇంగ్లాండ్ పరిస్థితుల్లో ఆడటం తెలిసిన రాహుల్‌కు ఇది తెలివైన నిర్ణయం. సీనియర్ ఆటగాళ్లు లేనప్పుడు, అతని అనుభవం జట్టుకు సమతుల్య శక్తిగా నిలుస్తుంది.





## ప్రీ- క్వార్టర్స్‌లో సింధు

ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. చిరకాల ప్రత్యర్థి నొజొమి ఒకుహరను చిత్తుగా ఓడించి ప్రీ-క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం అదిరే ప్రదర్శనతో దూసుకెళ్లింది. అయితే.. ఫేవరెట్లుగా బరిలోకి దిగిన లక్ష్యసేన్, ప్రణయ్‌లు తీవ్రంగా నిరాశపరిచారు. పేలవ ప్రదర్శనతో ఇద్దరూ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ఈ మధ్యే మలేషియా, సింగపూర్ ఓపెన్‌లో విఫలమైన సింధు ఇండోనేషియా ఓపెన్‌లో చెలరేగుతోంది. తొలి రౌండ్‌లోనూ కఠినమైన ప్రత్యర్థిని ఓడించింది ఒలింపిక్ విజేత. జపాన్‌కు చెందిన నొజొమి ఒకుహరపై ఉత్కంఠ పోరులో 22-20, 21-23, 21-15తో గెలుపొందింది. నేను ఈమధ్య కాలంలో తొలి రౌండ్‌లోనే ఓడిపోతున్నా. సో.. ఇలాంటి ఉత్కంఠ మ్యాచుల్లో గెలుపొందడం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచేది అని సింధు తెలిపింది. 16వ రౌండ్‌లో భారత షట్లర్ ఆరో సీడ్ పోర్న్‌పవే చౌచ్‌వాంగ్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు అల్వి ఫర్హాన్ ధాటికి చేతులెత్తేశాడు. అనంతరం జరిగిన డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టిల జోడీ అదరగొట్టింది. ఇండోనేషియా జోడీ లియో రాలీ కర్నాండో, బగాస్‌ని చిత్తు చేస్తూ ప్రీ-క్వార్టర్స్‌కు చేరుకుంది.

# నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

- నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు సరఫరా చేస్తున్న ధనలక్ష్మి ఓవర్సీస్ కన్సల్టెన్సీ
- సర్టిఫికెట్ పొందిన నిందితులను అరెస్టు చేసిన ఎయిర్పోర్ట్ పోలీసులు
- నకిలీ సర్టిఫికెట్ల తయారుపై ఆరా తీస్తున్న పోలీసులు
- 121 నకిలీ డిగ్రీలు, 7 స్టాంపులు, 3 బ్యాంక్ పాస్‌బుక్‌లు స్వాధీనం
- రూ.10 లక్షల నగదు, 3 లాప్‌టాప్‌లు, 4 సెల్‌ఫోన్‌లు సీజ్
- ఇద్దరు అరెస్ట్, ఒకరు పరార్





**శంషాబాద్, జూన్ 3 (జనంసాక్షి):**
విదేశాల్లో విద్యాభ్యాసం కోసం నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు సరఫరా చేస్తున్న ధన లక్ష్మి ఓవర్సీస్ అబ్రాడ్ స్టడీ ఇన్ వీసా కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌తో సహా ఇద్దరు నిందితులను శంషాబాద్ ఎయిర్పోర్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక వ్యక్తి పరారీలో ఉన్నాడు. మంగళవారం శంషాబాద్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని బీ.ఎన్. రెడ్డి నగర్‌లోని టీచర్స్ కాలనీలో గత ఐదేళ్లుగా ఈ కన్సల్టెన్సీ నడుస్తోంది. 2021లో కేరళకు చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడి, నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు తయారు చేసి విదేశాలకు పంపే వ్యవహారం మొదలైంది. విదేశాల్లో చదవాలనే కోరిక ఉన్నా, అకడమిక్‌గా బలహీనంగా ఉన్న విద్యార్థుల నుంచి ఒక్కొక్కరికి రూ.80,000 నుంచి రూ.1,00,000 వసూలు చేసి, అందులో రూ.30,000 కేరళ వ్యక్తికి చెల్లించేవారు.
2021 ఆగస్టులో కాతోజు అశోక్ అనే వ్యక్తి రూ.80,000 తీసుకొని, మధురై కామరాజ్ యూనివర్సిటీకి చెందిన నకిలీ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ డిగ్రీ సర్టిఫికెట్ (2015-2018) ఇచ్చాడు. దీని సహాయంతో పకీరు గోపాల్ రెడ్డి అమెరికాలోని వెబ్‌సైట్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందాడు. రెండేళ్ల కాలేజీ ఫీజు 28,000 డాలర్లు (సుమారు రూ.22 లక్షలు) చెల్లించి, 15 నెలలు చదువుకున్నాడు. అయితే, ఐదు నెలల క్రితం డల్లాస్ ఎయిర్పోర్ట్‌లో ఇమ్మిగ్రే షన్ ప్రక్రియలో అతని స్టేటస్ ఇన్‌యాక్టివ్‌గా ఉండటంతో అధికారులు బహిష్కరించారు. హైదరాబాద్ ఎయిర్పోర్ట్‌కు తిరిగి వచ్చిన అతన్ని ఇమ్మిగ్రేష న్ అధికారులు విచారించగా, నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ ద్వారా స్టూడెంట్ వీసా పొందినట్లు తేలింది. 2020 నుంచి ఇప్పటివరకు సుమారు 15 మంది విద్యార్థులను విదేశాలకు పంపినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. పోలీసులు 121 నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు, వీటిలో 13 మధురై కామరాజ్ యూనివర్సిటీకి, 4 ఉస్మానియా యూనివర్సిటీకి చెందినవి. అలాగే, 7 నకిలీ స్టాంపులు, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన మూడు నకిలీ బ్యాంక్ ఖాతా పాస్‌బుక్‌లు, 3 లాప్‌టాప్‌లు, 4 సెల్‌ఫోన్‌లు, రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నకిలీ సర్టిఫికెట్ల తయారీపై ఆరా తీస్తున్నారు. నిందితుల్లో ఒకరు పరారీలో ఉన్నాడు.

## భూ భారతి చట్టం రైతుల భూముల రక్షణకు వజ్ర కవచం

- భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత అవసరమే
- మనిషికి ఆధార్ కార్డు గుర్తింపు లాగే భూమికి భూదార్
- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి : పిఎసి చైర్మన్ అరికెపూడి




**శేరిలింగంపల్లి, జూన్ 03 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత నిస్తుందని, రైతు సంతోషంగా గడిపిన రోజే రాష్ట్రానికి శుభ దినమని రాష్ట్ర ప్రజాప్రద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం అధికార లాంఛనంతో భూభారతి చట్టాన్ని అమలు చేయడానికి రెవెన్యూ సదస్సుల నిర్వహణ నిమిత్తం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా శేరిలింగంపల్లి మండల పరిధిలో 3వ తేది మంగళవారం నుండి 6వ తేది శుక్రవారం వరకు జరిగే రెవెన్యూ సదస్సులను పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో చేపట్టిన జరిగిన రెవెన్యూ సదస్సుకు శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్, తహసిల్దార్ వెంకా రెడ్డి, కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వెంకారెడ్డితో కలిసి మాట్లాడుతూ భూ భారతి అనేది ఒక కొత్త ఆర్.ఒ.ఆర్ చట్టమని, అందులో భూమి హక్కుల భద్రతతోపాటు భూ సమస్యల సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలో ఇది ఒక గొప్ప చారిత్రాత్మక మలుపుగా ఆయన అభివర్ణించారు. భూ భారతి చట్టం నిజంగా తెలంగాణ రాష్ట్ర రైతుల చుట్టమని, రైతుల మేలుకోసం ప్రభుత్వం సుస్థిరమైన అడుగులు వేస్తుందని అన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని, ప్రభుత్వం ప్రతి రైతుకు భూధార్ కార్డులను జారీ చేయనుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే విధంగా వెసులుబాటు కల్పిస్తుందని, ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో రెవెన్యూ సస్సులను జూన్ 3వ తేది నుండి 6వ తేది వరకు నిర్వహిస్తున్నారని, ఉదయం 10 గంటలనుండి నిర్దేశిత ప్రాంతంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు. ఇందులో భాగంగా 3వ తేదీన గోపనపల్లి, నల్లగండ్ల, నానక్రాంగూడ గ్రామాలకు సంబంధించి గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో, గుట్టల బేగంపేట్, ఇజ్జత్ నగర్, గఫూర్ నగర్, మాదాపూర్ గ్రామాలకు సంబంధించి మాదాపూర్ డివిజన్ పరిధిలోని కాకతీయ హిల్స్ లోగల మాదాపూర్ వార్డ్ కార్యాలయంలో ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఈనెల 4న, 5వ తేదీన, చివరగా 6వ తేదీన సైతం ఆయా ప్రాంతాలలో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని, ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో వారికి ఉన్నటువంటి సమస్యను సంబంధిత అధికారులకు తెలిపినట్లైతే సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని అరికెపూడి వివరించారు. అన్నారు. ప్రతి రైతుకూ న్యాయం జరిగే విధంగా భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని, భవిష్యత్తులో ఏ రాష్ట్రంలో రెవెన్యూ చట్టం తయారు చేయాలన్నా తెలంగాణ రాష్ట్ర భూ భారతి చట్టాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వం తయారు చేసిందని, దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం నిలుస్తుందని %ూూజ% చైర్మన్ గాంధీ గారు అన్నారు. తెలంగాణ భూభారతి చట్టం ద్వార భూమి రిజిస్ట్రేషన్ రికార్డుల నిర్వహణను పూర్తిగా పారదర్శకంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనానికి అనుగుణంగా ఉండేలా నిర్దిష్టమైన విధానంలో కొనసాగించడం జరుగుతుందని, గతంలో ఏవైనా భూ సమస్యలు వస్తే కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, కానీ... భూ భారతితో 90శాతం రైతుల భూమి సమస్యలు తహసీల్దార్ వద్దే పరిష్కారం అవుతాయని చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ఆర్ఐ చంద్రారెడ్డి, నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


# నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు చేస్తాం

- నకిలీ విత్తనాలు వాటిని తయారు చేసే పరికరాలు సీజ్
- నకిలీ పత్తి విత్తనాల స్వాధీనం: ముగ్గురు అరెస్ట్
- రూ.4.62 లక్షల విలువైన 308 కేజీల నకిలీ విత్తనాలు సీజ్
- నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు : ఎస్పీ నరసింహ హెచ్చరిక
- కేసులో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందికి అభినందనలు




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
జిల్లా సీసీఎస్, తిరుమలగిరి పోలీసులు, వ్యవసాయ శాఖ అధ్వర్యంలో తనిఖీలు జరుపగా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రూ.462000 విలువైన 308కేజీల నకిలీ పత్తి విత్తనాలు, వాటిని తయారు చేసే పరికరాలను సీజ్ చేయడంతో పాటు ముగ్గురు నిందితులను తిరుమలగిరి పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ నరసింహ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మి వ్యవసాయానికి, రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తన నాణ్యతను తనిఖీ చేసుకోవాలని, వ్యవసాయ అధికారు ల సలహాలు తీసుకోవాలన్నారు.కంపెనీ లేబుల్ ఉన్న విత్తనాలు, నమ్మకమైన డీలర్స్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయడం మేలు అని తెలిపారు.విడి విత్తనాలతో అధిక నష్టమని అన్నారు.తిరుమలగిరి మండల పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్న నిందితుడిని, వాటిని తీసుకపోయి విక్రయిస్తున్న మరో ఇద్దరు నిందితులని తిరుమలగిరి పోలీస్ వారు మంగళవారం రోజున నమ్మదగిన సమాచారంపై ఏ1 నిందితుని కౌలు భూమి నందు తనిఖీ చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.నకిలీ పత్తి విత్తనాలు, వాటిని తయారు చేయడానికి ఉపయోగించిన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇలాంటి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి అరుగాలం కష్టపడి ఒక్కరైతు కూడా నష్టపోవద్దని కోరారు.ఈ కేసులో ఏ1 సింగారపు యాదగిరి స్వామి, ఏ2 లొడంగి నవీన్, ఏ3 చిత్తలూరి సోమనారాయణ అన్నారు.సింగారపు యాదగిరిస్వామి పండించిన పత్తి నుండి గింజలు వేరు చేసి వాటిని పత్తి విత్తనాలు తయారు చేయవచ్చని యూట్యూబ్‌లో చూశారని పేర్కొన్నారు.ఆ విధంగా చూసి వాటిని ఒరిజినల్ బీటీ త్రీ విత్తనాలని నమ్మించి రైతులకు అమ్ముకొని డబ్బులు సంపాదించుకోవాలని ఉద్దేశంతో, అతను అనుకున్న ప్రకారం అతను పండించిన పత్తి నుండి పత్తి గింజలు తీసి, నకిలీ పత్తి విత్తనాలు తయారు చేయడానికి కావలసిన సామగ్రిని తీసుకువచ్చినట్లు తెలిపారు.ఎవరికి అనుమానం రాకుండా అతను లీజుకు తీసుకున్న వ్యవసాయ భూమి వద్ద పెట్టి, సుమారు 308కేజీల పై చిలుకు నకిలీ పత్తి విత్తనాలు తయారు చేశారన్నారు.అతని పరిచయం ఉన్న నందాపురం గ్రామానికి చెందిన నవీన్, చిర్రగూడూరు గ్రామానికి చెందిన సోమనారాయణలకు కలిసి అతని వద్ద పత్తి గింజలు ఉన్నాయని, వాటిని తయారు చేసినట్లు చెప్పారన్నారు.ఎక్కువ దిగుబడి వస్తాయని, కంపెనీకి కన్నా తక్కువ రేటుకు ప్యాకెట్ 1500 రూపాయలకు అమ్ముతానని, వాటిని తీసుకపోయి ఎక్కువ రేటుకు అమ్ముకొమ్మని చెప్పి, వారికి మొదటగా 10 కేజీల చొప్పున ఇద్దరికీ ఇచ్చారని చెప్పారు. వారు వాటిని అమ్మి మరలా కావాలని చెప్పడంతో నవీన్ కు 50కేజీలు,సోమ నారాయణకు కూడా 40కేజీల నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిపారు.పోలీసులకు అందిన పక్కా సమాచారంతో తిరుమలగిరి పోలీస్ వారు నిందితుల వ్యవసాయ భూములు, ఇండ్లలో దాడి నిర్వహించగా విక్రయాలకు సిద్దంగా ఉన్న నకిలీ పత్తి విత్తనాలతో పాటు, వాటిని తయారు చేయడానికి ఉపయోగించిన పరికరాలు స్వాదినం చేసుకుని ముగ్గురు నింధితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.నకిలీ విత్తనాలు సీజ్ చేసిన కేసులో బాగా పని చేసిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐ హరికృష్ణ, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్స్ విద్యాసాగర్ రావు, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, కర్ణాకర్, కానిస్టేబుల్ ఆనంద్, మల్లేష్, సతీష్, శివ కృష్ణ, ప్రభాకర్, మహిళా హోమ్ గార్డ్ మంజుల ఉన్నారు.తిరుమలగిరి పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# పెద్దధన్వాడలో మరోసారి ఆందోళనలు



రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలుపుతున్న ఆయా గ్రామాల ప్రజలు

- మరో రెండు రోజుల్లో కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం
- రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

## అభిప్రాయ సేకరణ లేకుండా పనులు ఎందుకు చేస్తున్నారు ?

**అభివృద్ధిలో వెనుకబడి ఉన్నా గ్రామాలు, రెక్కాడితే గాని, డొక్కాడని పేద బతుకులు ఇక్కడ నివసిస్తుంటాయి. ఉన్న అరకొర భూమినే నమ్ముకున్న కుటుంబాలెన్నో. ఇలాంటి 14 గ్రామాల ప్రశ్నార్థకంగా మారుతాయన్న పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకు గురిచేస్తోంది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలలోని పెద్ద ధన్వాడ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి రద్దుపై వ్యతిరేకంగా ఆందోళనలు మరోసారి ఉధృతమవుతున్నాయి. అయినప్పటికీ యజమానులు దొంగ దెబ్బతో ఫ్యాక్టరీ నిర్మాణం కొనసాగిస్తున్నారు.**

**రాజోలి, జూన్ 03 (జనంసాక్షి) :**

### రాత్రికి రాత్రే గుట్టుగా కంటైనర్లు దింపిన యాజమాన్యం



ఫ్యాక్టరీ నిర్మాణంలో అర్ధరాత్రి తీసుకొచ్చిన కంటైనర్

సోమవారం అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రజలంతా గాఢ నిద్రలో ఉండగా దొంగల్లాగా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కంటైనర్లు, టిప్పర్లు, హిటాచీలను ప్రైవేటు సైన్యంతో పెద్దధన్వాడలోని నిర్మాణ స్థలంలోకి తీసుకొచ్చారు. గత ఆరునెలలుగా 14 గ్రామాల ప్రజలైన మేము క్యాన్సర్ కారకాలు, విషాన్ని పెట్టే ఫ్యాక్టరీని నిర్మించవద్దని పలు రకాల నిరసన నిరహార దీక్షలు కొనసాగించాము. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఇంచార్జి సంపత్ కుమార్ హామీతో మేము ఆయనను నమ్మి దీక్షలు విరమించాం. అర్ధరాత్రి ప్రజలు గాఢ నిద్రలో ఉండగా..ఇలాంటి దొంగ దెబ్బ తీస్తారని ఊహించలేదని వాపోయారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి, శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్న ప్రజలపై దాడి చేసేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దురుద్దేశంతో ప్రైవేటు సైన్యంతో మోహరించడం ఫ్యాక్టరీ యాజమాన్యం ఏం కోరుకుంటున్నట్టు, ప్రజల సహనాన్ని పరీక్షించడం దీనికి సంకేతం..

ఇది మరో దిలావార్ పూర్, లగచర్ల కావాలని ఫ్యాక్టరీ యాజమాన్యం కుట్ర చేస్తోందన్నారు. శాంతియుత పద్ధతుల్లో ఆందోళన చేస్తున్న ప్రజలపైకి మందిమార్బలం, గుండాలతో రావడం అంటే ప్రభుత్వాన్ని అస్థిర పరచాలనే కుట్ర కూడా ఇందులో దాగి ఉన్నట్టు అర్థమవుతోంది. కాబట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లా యంత్రాంగం, కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ వెంటనే స్పందించి ఈ కుట్రను భగ్నం చేయాలని కోరుతున్నాం. ఇంతమంది గూండాలను మా గ్రామంపైకి ప్రయోగించినా..ఉద్యమం ఆగదని, ఫ్యాక్టరీ ఇక్కడినుంచి వెళ్ళిపోయే వరకు వెనక్కి తగ్గేదే లేదన్నారు.



రాజోలి ఎస్ఐతో ఆరోపిస్తున్న గ్రామస్తులు

### సంఘీభావం తెలిపిన మాచర్ల ప్రకాష్

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేయాలంటే ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని ప్రభుత్వాన్ని ఖండించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా కాలుష్య కారకమైన ఇంత పెద్ద పరిశ్రమను నిర్మించడం సరైనది కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ ప్రజల గొంతు నొక్కి రహస్యంగా ఫ్యాక్టరీ నిర్మాణం చేయడానికి చూస్తే అఖిలపక్షం నాయకులు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. విష వాయువులను వెదజల్లే ఇథనాల్ ఫ్యాక్టరీని జనావాసాలకు దూరంగా తరలించేంత వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ ఆల్ ఇండియా జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్

### అనుమతి రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

అనుమతులు రద్దు చేసే వరకు మా పోరాటం ఉంటుందని గ్రామస్తులు అన్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలతో పచ్చని పొలాలు బీళ్లుగా మారే అవకాశం ఉండడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే నారాయణపేట జిల్లా చిత్తనూర్, నిర్మల్ జిల్లా గుండంపల్లి, దిలావర్‌పూర్ రైతులు వ్యతిరేకించారు. ఫ్యాక్టరీ సమీపంలో మాకు భూములు ఉన్నాయి. కంపెనీ వస్తే బీడుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, ఉన్న భూమి పోతే మేమెలా బతకాలని, ఆందోళనలు చేస్తే పోలీసులు భయపెడుతున్నారు. ఎవరికీ భయపడే ప్రసక్తి లేదు. ప్రాణాలైనా అడ్డుపెట్టి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

### మాటతప్పిన అధికారులు

ఇటీవల గద్వాల జిల్లా కేంద్రంలో ఆర్డిఓ సమక్షంలో శాంతినగర్ సీఐ, రాజోలి ఎస్ఐ మరియు ఆయా గ్రామాల ప్రజలతో చర్చలు జరిపగా, 'మీ అనుమతి లేనిదే గుండుసూది రానివ్వం " అంటూ ఇప్పుడు కంటైనర్లు ఎలా వచ్చాయంటూ రాజోలి ఎస్ఐని గ్రామస్తులు నిలదీశారు. అధికారులు ప్రభుత్వ కోసమా ప్రజల కోసమా అంటూ మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు నష్టంచేసే ఈ ఇథనాల్ ఫ్యాక్టరీని ఇక్కడ నిర్మించరాదని రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపారు.

# మేడారం మహా జాతర శాశ్వత పనులు చేపట్టాలి

- అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి
- భారీ వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి
- సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క




**ములుగు ప్రతినిధి, జూన్ 03(జనంసాక్షి) :** వచ్చే సంవత్సరం (2026)లో జరగనున్న మేడారం మహాజాతను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాబోతున్నందున ప్రకృతి వైపరీత్యాల నుండి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కొరకు ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క రానున్న మేడారం మహా జాతరను, భారీ వర్షాలు పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి శబరిష్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో జరిగిన మహా మేడారం జాతర సందర్భంగా పనిచేసిన జిల్లా అధికారులు నేటికీ జిల్లా అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 33 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, రానున్న రోజులలో జాతరలో శ్వాశత పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు. ముఖ్యంగా జాతర సమయంలో మేడారంలోని పరిసరాలు అపరిశుభ్రంగా మారకుండా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయాలని తెలిపారు. పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం మంచినీటిని సరఫరా చేయాలని, గద్దెల ప్రాంతంలో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, భక్తులు సులభతరంగా దర్శనాలు ముగించుకునే విధంగా క్యూ లైన్ లు, వాటి పై షేడ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే ఉన్న కారణంగా గ్రామాలలోని కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు ప్రవహించే కాలువల లోని గుర్రపు డెక్క మొక్కలను తొలగించాలని తెలిపారు. గత వర్షాకాలంలో జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రాణాలతో సిద్ధం చేసుకుని పలు చర్యలు తీసుకోవడంతో ఏలాంటి ప్రాణాలు నష్టం జరగలేదని అన్నారు. జిల్లా కేంద్రం నుండి ఏటూరునాగారం వరకు గల జాతీయ రహదారి ఇరువైపుల గల చెట్లను అటవీ శాఖ, ఆర్ అండ్ బి సిబ్బంది పర్యవేక్షించాలని, అందులో బలహీనమైన చెట్లను గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. జిల్లాలోని లోతట్టు గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల కారణంగా ఏర్పడే వరద ప్రభావంతో రహదారులు దెబ్బతినకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, పూరిత పరిస్థితులలో ప్రజలకు త్రాగునీరు, ఆహారం పంపిణీపై దృష్టి సారించాలని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తెలిపారు.

# అధికారంలో లేకుంటే ఆవిర్భావంలో పాల్గొనరా?

- బిజెపి-బిఆర్ఎస్ కుట్ర రాజకీయాలపై జవాబివ్వండి
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, జూన్3 (జనంసాక్షి) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పండగలా నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జూన్ 2న భారాస మాత్రమే ఈ వేడుకలను నిర్వహించలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గుర్తుంటుందా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 2న కేసీఆర్ బయటికి రాలేదు. కనీసం అమరవీరులకు నివాళులర్పించలేదు. కేటీఆర్ అమెరికాకు వెళ్లారు.. ఆయనా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనలేదు. అధికారం లేకపోతే ఈ వేడుకల్లో పాల్గొనరా,అధికారం ఇవ్వకుంటే ప్రజల్లోకి వచ్చేది లేదని భారాస నేతలు ఒక సంకేతం ఇచ్చారు. రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేసింది. గతంలో భారాస ప్రభుత్వం రుణమాఫీని సక్రమంగా ఎప్పుడూ పూర్తి చేయలేదని ఆది శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని ఎమ్మెల్సీ కవిత లేఖలో పేర్కొందని ఆది శ్రీనివాస్ తెలిపారు. పొత్తు పెట్టుకోకుండా ఉండటానికి బీఆర్ఎస్ ఉండాలి కదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కేడర్‌ను మభ్య పెట్టేందుకే మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి కాంగ్రెస్‌ని దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. కవిత చెప్పిన దెయ్యాలు ఎవరో హరీష్‌రావు సమాధానం చెప్పాలని అన్నారు. పార్టీ ఇంటర్నల్ విషయాలు బయటకి చెప్పిన కవితపై చర్యలు తీసుకుంటారా అని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్‌కి అధికారం లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కూడా చేయరా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇకపోతే వేములవాడ రాజన్న ఆలయంలో ఇటీ-వల కోడెలు మృతిచెందాయి. ఈ సంఘటన తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. భక్తులు ఇచ్చిన కోడెలు మృతిచెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఈ సంఘటనపై వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కోడెల రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే కోడెలు మృతిచెందిన సంఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. రాజన్న ఆలయంలో కోడెల మృతిపై సమీక్ష చేశామని ఆది శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలం వ్యాధుల వల్ల కోడెలు చనిపోవడం బాధాకరమని తెలిపారు. కొందరు భక్తులు పాలు కూడా మరువని కోడెలను తీసుకువస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని విస్తరణ చేస్తున్నామని వెల్లడించారు. పాత ఆలయం, పాత మండపాలు యధావిధిగా ఉంటాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# నటుడు కమల్‌హాసన్‌పై హైకోర్టు ఆగ్రహం

- మీరేమైనా చరిత్రకారులు అనుకుంటున్నారా?
- ప్రజల మనోభావాలు దెబ్బతీసే హక్కు మీకెక్కడిది
- క్షమాపణలు చెప్పలేని వారు..చిత్రం ఆపొద్దని అగడమేంటి?

**బెంగళూరు, జూన్ 3 (జనంసాక్షి) :** క్షమాపణలు చెబితే సమస్య సమసిపోయే దానికి ఎందుకీ పట్టుదల అంటూ నటుడు కమలహాసన్‌పై కర్నాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణలు చెప్పనప్పుడు వ్యాఖ్యలు ఎందుకు చేయాలని కూడా ప్రశ్నించింది. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి మీరేమైనా చరిత్రకారులా అని నిలదీసింది. 'థగ్ లైఫ్' విడుదలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కేఎఫ్‌సీసీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం దీన్ని విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంత పెద్ద నటుడైనప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఆయనకు లేదని హెచ్చరించింది. ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది. అతడి వ్యాఖ్యలకు ఆధారాలను అడిగింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది. మీరు కమల్‌హాసన్ కావచ్చు లేదా మరెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయలేరు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. కన్నడ ప్రజలు మిమ్మల్ని క్షమాపణలు మాత్రమే అడిగారు. మీరు ఏ ప్రాతిపదికన ఆ ప్రకటన చేశారు? మీరు ఏమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా? ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారని కమల్‌హాసన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. క్షమాపణ చెప్పే ఉద్దేశం లేకపోతే, కర్ణాటకలో సినిమా విడుదల ఎందుకని ప్రశ్నించింది. క్షమాపణ చెప్పని పక్షంలో కర్ణాటకలో సినిమాను ఎందుకు ప్రదర్శించాలనుకుంటున్నారు? వదిలేసేయండి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దులు దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు కదా. మీరు క్షమాపణ చెబితే ఏ సమస్యా ఉండదు. మీ సినిమాను ప్రదర్శించటం ద్వారా కర్ణాటక నుంచి కూడా మీరు రూ.కోట్లలో ఆదాయాన్ని పొందవచ్చని కోర్టు పేర్కొంది. కమల్‌హాసన్ ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురాగా, 'పరిస్థితుల కారణంగా బాధితుడయ్యే వ్యక్తికీ, వాటిని సృష్టించే వ్యక్తికీ మధ్య చాలా తేడా ఉంది. ఇప్పటికే కమల్‌హాసన్ బాహాటంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370